



జిల్లా ప్రజలకు కాస్తంత ఊరట. రాష్ట్ర విభజన నాటి నుంచి ఎదురుచూస్తున్న వెనుకబడిన జిల్లా కల ఎట్టకేలకు నెరవేరింది. ఆ జాబితాలో ప్రకాశం చేరింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. పార్లమెంట్‌లో మంగళవారం కేంద్రప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఏపీలోని ఏడు జిల్లాలతోపాటు ప్రకాశంను కూడా వెనుకబడిన జిల్లాగా ఆమె వెల్లడించారు. దానివల్ల ప్రత్యేకంగా నిధులు రానున్నాయి. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషే కారణమైంది. దీంతో జిల్లాకు చెందిన మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు అమరావతిలో ఆయన్ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వెనుకబడిన జిల్లా ప్రకటనపై జిల్లాలోని రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు
'మార్కాపురం జిల్లా ఏర్పాటు గురించి స్పష్టమైన హామీ ఇచ్చా. దాన్ని నెరవేరుస్తా' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాకు చెందిన మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలతో అన్నారు. జిల్లాను

చెప్పాను.. చేస్తాను..

- మార్కాపురం జిల్లా ఏర్పాటుపై సీఎం చంద్రబాబు

వెనుకబడిన జాబితాలో చేరుస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో మంగళవారం అసెంబ్లీ ఆవరణలో ఆయన్ను నేతలు కలిశారు. మీ కృషితో కూటమి ప్రభుత్వం అందించిన గొప్ప విజయం అని అభివర్ణించారు. పశ్చిమప్రాంతానికి చెందిన గిద్దలూరు, మార్కాపురం ఎమ్మెల్యేలు ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా విషయాన్ని ప్రస్తావించారు. వెంటనే చంద్రబాబు 'అది మనం చెప్పిందే కాదా. కచ్చితంగా చేద్దాం' అని మరోసారి స్పష్టం చేశారు. అధికారికంగా ఆవైపు కదలిక కూడా ఉందని వ్యాఖ్యానించారు.


చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

సీఎంను కలిసిన జిల్లా ఎమ్మెల్యేలు

ఉమ్మడి జిల్లా ప్రజల దశాబ్దకాల డిమాండ్ అయిన వెనుకబడిన ప్రాంతాల జాబితాలో జిల్లా చేర్పు, ప్రత్యేక నిధుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపి కేంద్రం ప్రకటించేలా చేయడంపై ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, బీఎన్.విజయ్‌కుమార్, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎం.ఎం.కొండయ్య, ఇంటూరి నాగేశ్వరరావులు బాబును కలిసి జిల్లాప్రజల తరఫున కృతజ్ఞతలు చెప్పారు. అలాగే కేంద్రప్రభుత్వానికి కూడా వారు ధన్యవాదాలు తెలిపారు.

నిర్మల ప్రకాశం

- వెనుకబడిన జాబితాలో జిల్లాకు చోటు
- బడ్జెట్‌లో ప్రకటించిన కేంద్ర ఆర్థిక మంత్రి
- మౌలిక రంగాలకు ప్రాధాన్యం
- ఆ మేర జిల్లాకు నిధులు వచ్చే అవకాశం
- ఆశించిన ఊరట దక్కలేదని వేతన జీవుల నిరాశ
- సీఎంకు మంత్రులు, ఎమ్మెల్యేల కృతజ్ఞతలు

ఒంగోలు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లా ప్రజలకు కాస్తంత ఊరట లభించింది. రాష్ట్రంలో కేంద్రం గుర్తించిన వెనుకబడిన ప్రాంతాల్లో ఉమ్మడి జిల్లాకు స్థానం దక్కింది. ఆమేరకు ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు జిల్లాలను వెనుకబడిన ప్రాంతాలుగా గతంలో కేంద్రం ప్రకటించింది. అందులో రాలసీమలో నాలుగు, ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలు ఉన్నాయి. వాటి తరహాలోనే ఒకరకంగా పలు ఇతర జిల్లాల కన్నా ఇంకా ఎక్కువ వెనుకబడిన ప్రాంతంగా ఉన్న మన జిల్లాను మాత్రం అందులో చేర్చలేదు. ఈ విషయాన్ని జిల్లాకు చెందిన నాటి టీడీపీ ప్రజాప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. తదనుగుణంగా కేంద్రానికి సిఫార్సు చేసినా అప్పట్లో అనుమతి రాకపోగా అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం అసలు ఆ ఊసే పట్టించుకోలేదు.

జిల్లాకు ప్రత్యేకంగా నిధులు

ఈ ఏడాది ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీచేసి భారీ మెజారిటీతో గెలుపొందాయి. అలాగే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో టీడీపీ కీలకమైంది. ఇదేసమయంలో రాష్ట్రానికి చెందిన అందులో భాగంగా జిల్లాకు సంబంధించిన అభివృద్ధి అంశాలు కేంద్రం దృష్టికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా తీసుకెళ్లారు. ఆ ప్రభావం మంగళవారం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కనిపించింది. రూ.38లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా మౌలిక రంగాలు, వ్యవసాయం, ఉపాధి కల్పన, పరిశ్రమలు తదితర రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. రైల్వేలు, హైవేలు, పోర్టులు, తాగునీరు, విద్యుత్, గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ పథకం వంటి వాటికి భారీ నిధులు కేటాయించారు. అందులోభాగంగా రాష్ట్రానికి తదనుగుణంగా జిల్లాలో ఆయారంగాలకు నిధులు రానున్నాయి. రాష్ట్రానికి సంబంధించి ప్రత్యేకంగా అమరావతికి రూ.15వేల కోట్ల ఆర్థిక సాయం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వంటి కీలక అంశాలకు కేంద్రం ప్రాధాన్యం ఇచ్చింది. జిల్లాకు సంబంధించి ఆయా రంగాల వారీ వచ్చే నిధులతోపాటు వెనుకబడిన ప్రాంతాల జాబితాలో జిల్లాను చేర్చడం ద్వారా ప్రత్యేకంగా నిధులు వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారులు, నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టు, ఇతర భాగస్వామ్య పథకాలకు వచ్చే నిధులతోపాటు ప్రత్యేకంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు కూడా రానున్నాయి. ఇదిలాఉండగా పలు కీలకరంగాలకు ప్రాధాన్యతలు ఉన్నప్పటికీ ఆదాయ పన్ను శ్లాబ్‌ల సవరణ, పన్ను మినహాయింపులలో ఆశించిన విధంగా కేంద్రం స్పందించలేదన్న నిరాశను వేతనజీవులు వ్యక్తం చేస్తున్నారు. కాగా కేంద్ర బడ్జెట్‌పై కూటమి పక్షాలు హర్షం వ్యక్తం చేస్తుండగా... ఇతర పార్టీలు అంకెల గారడీగా అభివర్ణిస్తున్నాయి.



పనులు జరుగుతున్న నడికుడి-కాళహస్తి రైల్వే లైన్

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసింది. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.11.11 లక్షల కోట్లు, విద్య, నైపుణ్యాభివృద్ధికి రూ.1.48 లక్షల కోట్లు, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ.2.66 లక్షల కోట్లు, మహిళాభివృద్ధికి రూ.3లక్షల కోట్లు, వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.1.52లక్షల కోట్లు కేటాయించింది. ఇలా అభివృద్ధితోపాటు సంక్షేమానికి పెద్దపీట వేయడం గొప్ప విషయం. బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలాసీతారామన్ ప్రకాశంను వెనుకబడిన జిల్లాల్లో చేర్చడం హర్షణీయం. అమరావతికి రూ.15వేల కోట్లు కేటాయింపు వల్ల రాజధాని నిర్మాణం వేగవంతమవుతుంది.

- మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎంపీ

వెనుకబడిన జిల్లాగా ప్రకటన హర్షణీయం



కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అమరావతికి రూ.15వేల కోట్లు కేటాయించడం, జిల్లాను వెనుకబడిన ప్రాంతంగా గుర్తించడం హర్షణీయం. రాష్ట్ర ప్రజలు కేంద్రప్రభుత్వానికి రుణపడి ఉంటారు. కేంద్రం సముచిత ఆలోచనతో అన్నిరంగాలకు కేటాయింపులు చేసింది. రైతులు, యువత, చిరువ్యాపారులకు పెద్దపీట వేసింది. ప్రకాశంను వెనుకబడిన జిల్లాల జాబితాలలో చేర్పు తామని గతంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఢిల్లీ పర్యటనలో ఈ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. బడ్జెట్‌లో జిల్లాకు ప్రాధాన్యం దక్కడం శుభసూచికం. జిల్లా అభివృద్ధికి కేంద్రతోడ్పా టు ఎంతో ఉపకరిస్తుంది. ప్రధాని మోదీకి జిల్లా తరఫున కృతజ్ఞతలు.

- దామచర్ల జనార్దన్, ఒంగోలు ఎమ్మెల్యే

నిధుల కేటాయింపును స్వాగతిస్తున్నాం



రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రబడ్జెట్‌లో రూ.15వేల కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం. గత ప్రభుత్వం మూడు రాజధానుల జపం చేయడంతో ఏదీ అభివృద్ధి కాకుండా పోయింది. పోలవరం నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.33వేల కోట్ల ప్యాకేజీకి నిధులు కేటాయించాలి. వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశంను చేర్చడం అభినందనీయం. అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తే తప్ప ఆయాప్రాంతాల అభివృద్ధికి అవకాశం లేదు.

- ఎం.ఎల్.నారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి

బడ్జెట్‌లో ఏపీకి పెద్దపీట



కేంద్రం బడ్జెట్‌లో మన రాష్ట్రానికి పెద్దపీట వేసింది. అమరావతికి రూ.15వేల కోట్లు కేటాయించడం అభినందనీయం. రాజధాని నిర్మాణం కోసం ఒకేసారి పెద్దమొత్తంలో నిధులు ఇవ్వడం వలన త్వరగా పూర్తిచేసే అవకాశం ఉంటుంది. కేంద్రం సముచిత ఆలోచనతో అన్నిరంగాలకు ప్రాధాన్యం ఇచ్చింది. రైతులు, యువత, చిరువ్యాపారులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారికి పెద్దపీట వేసింది.

- పీవీ శివారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

జిల్లాకు 42 వేల ఇంటర్ పాఠ్యపుస్తకాలు

ఒంగోలు(విద్య), జూలై 23 : జిల్లాలోని ప్రభుత్వరంగ విద్యా సంస్థల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు 2024-25లో పాఠ్యపుస్తకాలు ఉచితంగా పంపిణీకి రంగం సిద్ధమైంది. 42వేల పుస్తకాలు ఒంగోలులోని విద్యాశాఖ గోడౌన్‌కు చేరాయి. జిల్లాలోని 38 మండల కేంద్రాలకు వాటిని చేరవేసే కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఆర్టీసీ బస్సు ద్వారా ఎమ్మార్సీ భవనాలకు పంపుతున్నట్లు ప్రభుత్వ పాఠ్యపుస్తకాల డిపో మేనేజర్ వైవీ శివాజీ తెలిపారు. ఆయా మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, ఏపీ మోడల్ స్కూళ్లు, హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పుస్తకాలను పంపిణీ చేస్తారు. మంగళవారం 12,200 పాఠ్యపుస్తకాలను మండలాలకు పంపారు.



సచివాలయాల్లో అర్జీల స్వీకరణ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 23 : గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలే ఆన్‌లైన్ పద్ధతిలో HTTPS//MEEKOSAM.AP.GIV.IN ఈ పోర్టల్ నందు ఆధార్ నెంబరు సహాయంతో వారి సమస్యను నమోదు చేసుకోవడంతోపాటు అర్జీ ఏ స్థితిలో ఉందో కూడా తెలుసుకోవచ్చన్నారు. మండల, డివిజనల్, జిల్లాస్థాయిలో ప్రతి సోమవారం జరిగే 'మీకోసం' వేదిక ద్వారా అర్జీలను స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.


టవర్‌పై నుంచి విమానాశ్రయ భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

పూర్తి నివేదికను అందించాలి

- దొనకొండ విమానాశ్రయాన్ని పరిశీలించిన కలెక్టర్ అన్సారియా

దొనకొండ, జూలై 23: దొనకొండ విమానాశ్రయానికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేసి వెంటనే అందించాలని ఆర్డీవోను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. దొనకొండలో బ్రిటీష్ కాలంలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న విమానాశ్రయ అభివృద్ధిపై టీడీపీ కూటమి ప్రభుత్వం దృష్టిసారించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో కలెక్టర్ మంగళవారం విమానాశ్రయాన్ని పరిశీలించారు. భవనంపై ఏర్పాటుచేసిన టవర్ ఎక్కి చుట్టుపక్కల ఉన్న భూములను చూశారు. విమానాశ్రయానికి ఇప్పటికే ఉన్న భూమి, అదనంగా ఎంత కేటాయించారు, అందుఓ పట్టా, అసైన్‌మెంట్, ప్రభుత్వభూమి, చెరువులు, బండిదారి తదితరాలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి, ఎటువంటి భూములు ఆక్రమణల్లో ఉన్నాయి, భవన నిర్మాణాలు ఏమైనా జరిగాయా తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విమానాశ్రయానికి 136 ఎకరాల భూమి ఉండగా, అదనంగా 340ఎకరాలు ఎంపిక చేసినట్లు కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్ కలెక్టర్‌కు వివరించారు. ఆ భూముల్లో 40 శాతం ఆక్రమణలో ఉన్నాయని చెప్పారు. మూడు పక్కాగృహాల నిర్మాణాలు జరిగాయన్న ఆయన అందుకు సంబంధించిన వివరాలను మ్యాప్ ద్వారా చూపించారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో వసంతరావునాయక్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎయిర్‌పోర్టు ఇన్‌చార్జ్ రామకృష్ణ, వీఆర్వో ఐలూరి పిచ్చిరెడ్డి, సర్వే అండ్ ల్యాండ్స్ డీఐ రాజేంద్రప్రసాద్, గ్రామ కార్యదర్శి డేవిడ్, సర్వేయర్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.


అన్న క్యాంటీన్లలో భోజనం చేస్తే బిచ్చగాళ్లా?

- తక్షణమే ప్రజలకు ఎమ్మెల్యే చంద్రశేఖర్ క్షమాపణ చెప్పాలి
- టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు డిమాండ్



ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు), జూలై 23 : పేదల కడుపు నింపేందుకు సీఎం చంద్రబాబు తీసుకొచ్చిన అన్న క్యాంటీన్లలో భోజనం చేసే పేదలను బిచ్చగాళ్లు అన్న వైసీపీ వై.పాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బేషరతుగా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఎర్రగొండపాలెంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాల్సిన ఎమ్మెల్యే. ఏకంగా పేదలను బిచ్చగాళ్లతో పోల్చడం ఏమిటని మండిపడ్డారు. ఎమ్మెల్యే చంద్రశేఖర్ వ్యాఖ్యలు సభ్య సమాజం తలవంచుకోలేలా ఉన్నాయన్నారు. రూ.5లకే పేదలకు భోజనం పెట్టేందుకు సీఎం చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్లను తీసుకొచ్చారన్నారు. వాటి విలువ అందులో నిత్యం భోజనం చేసే విద్యార్థులు, వైద్యశాలలకు వెళ్లే రోగులు, కార్మికులు, చిరుద్యోగులకు తెలుసన్నారు. అలాంటి వారిని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అవమానించారన్నారు. నియోజకవర్గంలో దళితుల వలసలు ఎక్కువగా వున్నాయని, ఆయన దళితుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని సూచించారు. మీ పులివెందుల ఎమ్మెల్యే జగన్‌కు ధైర్యం ఉంటే గెలిచిన ఎమ్మెల్యేలతో అసెంబ్లీకి వెళ్లి ప్రజాసమస్యలు ప్రస్తావించాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే చంద్రశేఖర్ నోటికి వచ్చినట్లు తనపై మాట్లాడుతున్నారన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, పయ్యావుల ప్రసాద్, టీడీపీ ముఖ్య నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, వెంగళరెడ్డి, కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, సత్య నారాయణ గౌడ్, మంత్రు నాయక్, వలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కబళించిన కరెంటు తీగ



- మోపెడ్‌పై వెళ్తుండగా తెగిపడిన విద్యుత్ హెచ్‌టీ లైన్ వైరు
- ముగ్గురు విద్యార్థులు మృతి
- పునుగోడులో విషాదం
- గుండెలవిసేలా రోదిస్తున్న కుటుంబసభ్యులు

వివరాలు లోపలి పేజీల్లో..

ప్రబలుతున్న వ్యాధులు

- మూడు నెలల్లో 125 డెంగ్యూ, 45 మలేరియా కేసులు
- జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న ఫీవర్ సర్వే
- మందులను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 23: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. జిల్లాలోని పలు మండలాల్లో డెంగ్యూతోపాటు మలేరియా కేసులు నమోదు కావడంతో వైద్యశాఖను అప్రమత్తం చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. దీంతో వైద్యశాఖ జిల్లావ్యాప్తంగా ఫీవర్ సర్వేను ప్రారంభించింది. వైద్య సిబ్బంది జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా గడిచిన మూడు నెలల కాలంలో 125 డెంగ్యూ కేసులు నమోదు కాగా ముగ్గురు మృత్యువాతపడ్డారు. మలేరియా కేసులు 45 నమోదయ్యాయి. మరోవైపు జ్వరం, దగ్గు, జలుబు, కాళ్ల నొప్పులు వంటి వ్యాధులతో మరో 25వేల మంది వరకు ఇబ్బందిపడుతున్నారు. ఈ ప్రాంతం, ఆ ప్రాంతం అని తేడా లేకుండా జిల్లావ్యాప్తంగా ప్రస్తుత సీజన్‌లో ప్రజానీకం వ్యాధుల బారిన పడి ఆస్పత్రులు, ఆర్ఎంపీల చుట్టూ తిరుగుతున్నారు.

వ్యాధులపై ప్రభుత్వం దృష్టి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టిసారించారు. పట్టణ, గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు పంచాయతీ, మున్సిపాలిటీలకు దిశానిర్దేశం చేశారు. అలాగే ఆయా శాఖల అధికారులను సమన్వయం చేసే దిశగా జిల్లా అధికారయంత్రాంగం చర్యలు తీసుకుంది. ప్రధానంగా డెంగ్యూ కేసులు నమోదైతే వెంటనే ఒంగోలు జీజీహెచ్, మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఒంగోలులోని జీజీహెచ్‌లో ప్లేట్‌లెట్స్ యూనిట్ కూడా ఉండటంతో డెంగ్యూ తీవ్రంగా ఉన్న వారిని అక్కడ చేర్చే విధంగా చర్యలు తీసుకున్నారు. మరో వైపు చిన్నచిన్న వ్యాధులకు ప్రజానీకం ఆర్ఎంపీలు, ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లకుండా ఉండేందుకు అన్నిరకాల మందులను ప్రాథమిక, అర్బన్ హెల్త్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. మలేరియాకు సంబంధించిన మందులు అందుబాటులోకి రావడంతో ప్రజలకు కొంతమేర ఊరట కలిగింది. అదేవిధంగా డెంగ్యూ అని అనుమానం రాగానే రక్తపరీక్షలు చేసేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా కేంద్రంలోని వైద్యశాలకు పంపుతున్నారు. అక్కడ పరీక్షలు నిర్వహించిన అనంతరం చికిత్స ప్రారంభిస్తున్నారు. మలేరియా కేసు నమోదైతే ఆ ఇంటి సమీపంలోని వంద గృహాలను వైద్య, పంచాయతీల సిబ్బంది ఆధ్వర్యంలో అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.


ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగులు

రాజధాని నిర్మాణం కోసం రూ.లక్ష విరాళం



మంత్రి స్వామి, సత్యలకు చెక్కును అందజేస్తున్న సాయినవీన్ కుటుంబసభ్యులు

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 23 : రాజధాని నిర్మాణానికి తమ వంతు సహకారంగా ఒంగోలుకు చెందిన సాయినవీన్, ఆయన తాతయ్య కృష్ణారావులు రూ.1లక్ష విరాళాన్ని రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, టీడీపీ రాష్ట్ర నాయకులు దామచర్ల సత్యకు మంగళవారం ఒంగోలులో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి, సత్యలు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత రాజధాని విషయంలో స్పష్టత వచ్చిందన్నారు. రాష్ట్రానికి రాజధానిగా అమరావతి ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని ఆయన పేర్కొన్నారు. రాజధాని అభివృద్ధి కోసం నవీన్, కృష్ణారావు తోడ్పాటు అందించి విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. అలాగే గతంలో ఒంగోలులో నారా లోకేష్ చేపట్టిన యువగళంలో కూడా నవీన్ కుటుంబసభ్యులు తమ వంతు సహకారాన్ని అందించారు.

ఇంజనీరింగ్ తుది దశ కౌన్సెలింగ్ ప్రారంభం

ఒంగోలు(విద్య), జూలై 23: ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్-23-24తుది దశ అడ్మిషన్ల కౌన్సిలింగ్ మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈనెల 23నుంచి 25వ తేదీ వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు అవకాశం ఇచ్చారు. మొదటి విడత కౌన్సిలింగ్‌కు హాజరు కాని విద్యార్థులు కూడా ప్రస్తుతం రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి అడ్మిషన్ కౌన్సిలింగ్‌కు హాజరయ్యేందుకు అనుమతిచ్చారు. ఈనెల 23నుంచి 26 వరకు ఆన్‌లైన్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తారు. ఈనెల 24నుంచి 28 వరకు విద్యార్థులు ప్రాధాన్యతక్రమంలో తాము అడ్మిషన్ కోరుకుంటున్న కళాశాలలకు ఆప్షన్ నమోదు చేసుకోవాలి. 28నుంచి 30వ తేదీ వరకు సీట్లకేటాయింపు ప్రక్రియ జరుగుతుంది. 30న తుది దశ సీట్ల కేటాయింపు ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 31 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు కళాశాలల్లో రిపోర్టు చేయాలి. ఇప్పటికే ఇంజనీరింగ్ తరగతులు ప్రారంభమైనందున విద్యార్థులు నేరుగా తరగతులకు హాజరుకావాలి.

మాజీ మంత్రి జీవీ.శేషుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న రాజ్‌విమల్, నాయకులు

ఒంగోలు(కార్పొరే షన్), జూలై 23: మాజీ మంత్రి జీవీ.శేషు 8వ వర్ధంతి మంగళవారం ఒంగోలులో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఊరచెరువులోని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద గల జీవీ.శేషు విగ్రహం వద్ద పలువురు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం కొత్తపట్నం బస్టాండ్ వద్దగల అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శేషు తనయుడు గుర్రాల రాజ్‌విమల్, డాక్టర్ కామేపల్లి చంద్రశేఖర్, డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, డాక్టర్ మునీర్, మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, గంగవరపు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఒంగోలు(విద్య), జూలై 23 : విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో స్టెప్ సహకారంతో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాలకు బానిసలై తమ భవితను పాడు చేసుకోవద్దని హితవు పలికారు. సైబర్‌క్రైమ్ కౌన్సిలర్ సాయి మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, ఎన్‌ఎస్‌ఎస్‌హెడ్ నవనీత్‌కృష్ణన్ పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

● మైనర్ బాలుడిపై కేసు

సింగరాయకొండ, జూలై 23 : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని ప్రశాంతి థియేటర్ ఎదురు వీధిలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో నగదు చోరీకి ఓ మైనర్ బాలుడు సోమవారం అర్ధరాత్రి విఫలయత్నం చేశాడు. ఎస్సై శ్రీరాం తెలిపిన వివరాల మేరకు.. స్థానిక హనుమాన్‌నగర్‌కు చెందిన మైనర్ బాలుడు అర్ధరాత్రి ఏటీఎంలోకి వెళ్లాడు. నగదు చోరీకి ప్రయత్నిస్తుండగా అందులో ఉన్న సీసీ కెమెరాల్లో దృశ్యాలను బ్యాంకు సిబ్బంది గమనించారు. వెంటనే ఎస్సై శ్రీరాంకు ఫిర్యాదు చేయగా ఆయన ఏటీఎం వద్దకు చేరుకొని చోరీకి ప్రయత్నిస్తున్న బాలుడిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కి తరలించారు. అతని తల్లిదండ్రులను మంగళవారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నాబార్డు మాజీ చైర్మన్ పూజలు

టంగుటూరు, జూలై 22 : మండలంలోని జమ్ములపాలెం సాయిబాబా మందిరంలో మంగళవారం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో నాబార్డు మాజీ చైర్మన్ పమిడి కోటయ్య పాల్గొన్నారు. పలువురు గ్రామ పెద్దలు ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో వ్యాపారవేత్తలు పి.వెంకటేశ్వర్లు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

ఎస్పీ దామోదర్ హెచ్చరిక ● సింగరాయకొండ పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

సింగరాయకొండ, జూలై 23 : గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ దామోదర్ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. సింగరాయకొండ సర్కిల్ కార్యాలయాన్ని, పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లోని లాకప్ గదిని, రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటి దర్యాప్తు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. పోలీసులు గ్రామాల్లో పర్యటిస్తూ దొంగతనాలు, అల్లర్లు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాతనేరస్థులు, రౌడీషీటర్లపై నిఘా ఉంచాలన్నారు. అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, నూతన చట్టాలు, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ఫలితాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే వారితో స్నేహపూర్వకంగా మెలిగి వారి ఫిర్యాదులను స్వీకరించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ ఎస్.వి.శ్రీధర్‌రావు, సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సైలు శ్రీరామ్, పున్నారావు ఉన్నారు.

అసాంఘీక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఒంగోలు(క్రైం): జిల్లాలో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఆర్.దామోదర్ హెచ్చరించారు. మంగళవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు విక్రయించినా, రవాణా చేసిన ఉపేక్షించేది లేదన్నారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, మహిళల పట్ల అసభ్యకరంగా వహరించడం, వేధింపులకు గురిచేయడం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టేలా అవాస్తవాలు పోస్టు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పేకాట, వ్యభిచారం లాంటి అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. అలాగే ద్విచక్ర వాహనాలపైన అసాధారణ నెంబరు ప్లేట్లు వాడకూడదని, అదేవిధంగా ప్రత్యేక శబ్ధాలు వచ్చే సైలెన్సర్లు వాడకూడదని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని, హెల్మెట్ విధిగా ధరించాలని కోరారు. ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యకలపాలు జరుగుతుంటే డయల్ 112/100లకు, 9121102266 సెల్‌నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

కర్నూలురోడ్డుకు సత్వరమే మరమ్మతులు చేపట్టాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం



కలెక్టర్ అన్సారియాకు వివరాలు తెలియజేస్తున్న అధికారులు

చీమకుర్తి, జూలై 23 : రాష్ట్రంలోనే అత్యంత రద్దీ రహదారుల్లో ఒకటి.. పశ్చిమ ప్రకాశానికి ముఖద్వారంగా ఉన్న రామతీర్థం సమీపంలో కర్నూలు రోడ్డు అధ్వానంగా మారి గత ఐదేళ్లుగా కనీస మరమ్మతులుకు కూడా నోచుకోక వాహనదారులకు నరకప్రాయంగా మారింది. ఇపుడు ఆ రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించనుంది కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం గోతులమయమై అధ్వానంగా ఉన్న ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. తక్షణమే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి వాహనదారుల ఇక్కట్లు తొలగించటానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రూ.1.70కోట్లతో ఈ రహదారి మరమ్మతులు చేపట్టడానికి అంచనాలు రూపొందించి ప్రభుత్వ అనుమతికి పంపటం జరిగిందని ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ దేవానందం కలెక్టర్‌కు వివరించారు. ఈ ప్రాంతం తోతట్టులో ఉండటం వల్ల లెవెలింగ్ పనులు చేపట్టాల్సి ఉందని తెలిపారు. త్వరితగతిన ఆయా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ గోపీనాయక్, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభం



క్రియాశీలక సభ్యత్వ నమోదు చేస్తున్న సాయిబాబా, నాగేంద్రయాదవ్, అరుణ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 23: జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో ఆ పార్టీ జిల్లా ప్రచారకమిటీ కో ఆర్డినేటర్ జడా బాలనాగేంద్రయాదవ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక నాగేంద్రయాదవ్ కార్యాలయం వద్ద జనసేన లీగల్ సెల్ అధ్యక్షుడు సుంకర సాయిబాబాతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జడా బాలనాగేంద్రయాదవ్ మాట్లాడుతూ ఇతర పార్టీలకు భిన్నంగా జనసేన పార్టీలో సభ్యత్వం తీసుకుంటే ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కూడా కల్పించారన్నారు. సభ్యత్వం తీసుకుంటే ఏదైనా అనుకొని పరిస్థితుల్లో జరిగితే అటువంటి వారికి ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు. ఒంగోలు నగరంతో పాటు జిల్లావ్యాప్తంగా ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌స్ఫూర్తితో జిల్లాలో బలోపేతం చేసే దిశగా పార్టీని చర్యలు తీసుకుందన్నారు. ఇప్పటికే వైసీపీకి చెందిన పార్టీ శ్రేణులు జనసేనలో చేరేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. అటువంటి వారందరినీ అధినేత వద్దకు తీసుకెళ్లి పార్టీలో చేర్పే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. కాగా డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం ఆరో రోజు కూడా కొనసాగింది. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, కాపు సంఘం నాయకుడు ఆరిగ శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, ఆదాయం

● పీడీ సుభాషిణి



కషాయాల తయారీ విధానంపై అవగాహన కల్పిస్తున్న పీడీ సుభాషిణి

కొండపి, జూలై 23: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు, ధాన్యాలు, కూరగాయలు పండించడం ద్వారా ఆదాయంతోపాటు ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.సుభాషిణి సూచించారు. మండలంలోని ఇలవర (నేతివారిపాలెం)లో రైతులకు మంగళవారం ఆమె ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వలన ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయడం వలన ఆరోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే దస్పర్ని, అజ్ఞాస్త్రం కషాయాల తయారీ విధానం, వాటి ఉపయోగాలను ప్రయోగాత్మకంగా తయారు చేసి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం కమ్యూనికేషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, రమేష్, ఎన్ఎఫ్ఏ డి.ఝాన్సీ ఇలవర ఐసీఆర్పీలు డి.జ్యోత్స్న, గోల్కొండ మస్తాన్, తన్నీరు విజయలక్ష్మి, ఎం.మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

● ఏవో విజయకుమార్



మాట్లాడుతున్న ఏవో విజయకుమార్

కొండపి, జూలై 23 : కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.విజయకుమార్ కోరారు. కొండపి ఆర్‌బీకేలో మంగళవారం నిర్వహించిన అవగాహనసభలో ఆయన మాట్లాడారు. కార్డుల ద్వారా పొలం కౌలుకు తీసుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని ప్రయోజనాలు అందుతాయన్నారు. తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ యజమానులు కౌలు రైతులకు భూములు ఇచ్చినందువల్ల ఎలాంటి నష్టం ఉండదన్నారు. కౌలుదారుకు పంటపై మాత్రమే హక్కు ఉంటుందని స్పష్టం చేశారు.

కొత్త సింగరబొట్లపాలెంలో..

పొన్నలూరు(కొండపి): పొన్నలూరు మండలంలోని కొత్త సింగరబొట్లపాలెంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీపై గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ సుధాకర్‌రావు మాట్లాడుతూ రైతులకు భూ యజమానులు కౌలు అంగీకార పత్రాలు ఇచ్చినందువల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కౌలుదారులకు ప్రభుత్వం నుంచి రాయితీలు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో ఏవో పూర్ణచంద్రరావు, గ్రామ వ్యవసాయశాఖ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాతసింగరాయకొండ ఎస్సీకాలనీలో చోరీ

● 12 గ్రాముల బంగారం, రూ.30వేల అపహరణ

సింగరాయకొండ, జూలై 23: మండలంలోని పాతసింగరాయకొండ ఎస్సీకాలనీలోని ఒక గృహంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బీరువాను పగులకొట్టి రూ.30 వేలు నగదు 12 గ్రాముల నగలును అపహరించుకెళ్లారు. ఎస్సై శ్రీరాం కథనం మేరకు.. ఎస్సీకాలనీకి చెందిన బొడ్డు కోటిరత్నం తన నివాసానికి సమీపంలో బంకును ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తోంది. ఆమె మంగళవారం ఇంటికి బయట గడియపెట్టి దగ్గరలో ఉన్న కుట్టుమిషన్ వద్దకు వెళ్లగా, ఆమె తల్లి మనవరాలును స్కూల్లో వదిలిపెట్టేందుకు వెళ్లింది. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాను పగులకొట్టారు. అందులో ఉన్న రూ.30 వేల నగదు, 12 గ్రాముల బంగారాన్ని చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. స్థానికులే చోరీకి పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు.

పంటల సాగు పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

చీమకుర్తి, జూలై23: మండలంలోని అయ్యపురాజుపాలెం, ఊబచెత్తపాలెం గ్రామాల్లో సాగు చేసిన ఖరీఫ్ పంటలను మంగళవారం ఆత్మ పీడీ అన్నపూర్ణ, ఏవో భాస్కర్ పరిశీలించారు. వరి, సజ్జ, కంది, పత్తి పంటల్లో రైతులు చేపట్టాల్సిన సస్యసంరక్షణా చర్యలను సూచించారు. కార్యక్రమంలో శైలజారాణి, శేషమ్మ, రైతులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ సేవలు

● నగర కమిషనరు జశ్వంత్‌రావు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 23: ఆధార్‌కార్డులో చిరునామా, మొబైల్ నెంబరును అప్‌డేట్ చేసుకోవడానికి 'అప్‌డేట్ డాక్యుమెంట్ సేవా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు నగర కమిషనరు ఎం.జశ్వంత్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని కేటాయించిన సచివాలయాల్లో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కొత్తగా ఆధార్‌కార్డు కోసం, అలాగే 0-5 సంవత్సరాల వయస్సు పిల్లల కొత్త ఆధార్‌కార్డు పొందవచ్చని తెలిపారు. బొల్లినేనివారిపాలెం, కరవది డొంక, ప్రతిభ జూనియర్ కాలేజీ,(పేర్నమిట్ట), అన్నవరప్పాడు, రాజీవ్ గృహకల్ప, కొప్పోలు, త్రోవగుంట, పెళ్లూరు, చెరువుకొమ్ముపాలెం సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్‌సెంటర్‌లో సేవలు పొందవచ్చని కోరారు.

హైస్కూల్‌ప్లస్‌లో త్వరలో సిబ్బంది నియామకం : ఆర్జేడీ

ఒంగోలు(విద్య), జూలై 23 : జిల్లాలో హైస్కూలు ప్లస్ జూనియర్ కళాశాలల్లో బోధనా సిబ్బందిని రెండు రోజుల్లో నియమిస్తామని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఒంగోలు వచ్చిన ఆయన హైకోర్టు కేసు దృష్ట్యా స్థానిక మాంటిస్సోరి హైస్కూలును తనిఖీ చేసి వివరాలు తీసుకున్నారు. అలాగే తూర్పునాయుడుపాలెం జడ్పీహైస్కూలును తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఈవో టి.కిషోర్‌బాబు ఉన్నారు.

డయేరియా నివారణకు సహకరించాలి

చీమకుర్తి, జూలై 23 : డయేరియా నివారణకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని జలజీవన్‌మిషన్ జిల్లా కోఆర్డినేటర్ కేశవరావు కోరారు. మంగళవారం బండ్లమూడి పాఠశాల, పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. డాక్టర్ కల్పన, మాధవరావు, హెచ్ఎం బ్రహ్మయ్య పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

శభాష్ ఆటోడ్రైవర్ !

● ఏడు సవర్లు బంగారం అప్పగింత



సీఐకి ఆభరణాలను అందజేస్తున్న సురేష్

ఒంగోలు(క్రైం), జూలై23: ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. తన ఆటోలో ప్రయాణికులు మరిచిపోయిన బంగారాన్ని తిరిగి అప్పగించి శభాష్ అనిపించుకున్నాడు. ఒంగోలు నగరం సుజాతనగర్ 9 లైన్‌లో నివాసం ఉంటున్న పరిటాల సురేష్ తన కుటుంబసభ్యులతో కలిసి ఇంటి దగ్గర ఆటో ఎక్కి లక్కీ షాపింగ్‌మాల్ వద్ద దిగారు. అయితే ఏడు సవర్ల బంగారపు ఆభరణాలు ఉన్న సూట్‌కేసును ఆటోనే వదిలేశారు. కొద్ది సేపటి తరువాత ఆటోడ్రైవర్ మద్దిపాడు మండలం పెదకొత్తపల్లికి చెందిన నూతలపాటి శివప్రసాద్ తన ఆటోలో ఉన్న సూట్‌కేసును గుర్తించి ఒంగోలు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎస్‌కే.ఖాజావలికి అప్పగించారు. అదే సమయంలో బంగారపు ఆభరణాలు పోగొట్టుకున్న పరిటాల సురేష్ ఫిర్యాదు ఇచ్చేందుకు స్టేషన్‌కు వచ్చాడు. ఈ మేరకు విచారించి బంగారపు ఆభరణాలను సురేష్‌కు అప్పగించారు. ఆటో డ్రైవర్ శివప్రసాద్ నిజాయితీకి వారు అభినందనలు తెలిపారు.

శిశు ఆధార్‌కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నాగులుప్పలపాడు, జూలై 23: శిశు ఆధార్‌కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కామన్ సర్వీస్ సెంటర్ అధికారులు వందనం, ప్రమోద్ తెలిపారు. చదలవాడలోని కామన్ సర్వీస్ సెంటర్ (సి.ఎస్.సి) వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన శిశు ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు. ఐదేళ్లలోపు చిన్నారులకు తల్లిదండ్రులు గ్రామాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల వద్ద ఆధార్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈనెల 27వ తేదీ వరకు అన్ని కామన్ సర్వీస్ సెంటర్ల వద్ద ప్రత్యేక శిబిరాలను నిర్వహించి కొత్త ఆధార్ కార్డులు నమోదుతోపాటు పాత ఆధార్ కార్డుల సవరణలు చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, ఐసీడీయస్ సూపర్‌వైజర్ కె.ప్రమీల, రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్ గొర్ల గోపి పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోసం ప్రార్ధనలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు

ఒంగోలు(కార్పొరే షన్), జూలై 23 : ప్రపంచ శాంతి కోసం ప్రతి క్రైస్తవుడు ప్రార్ధనలు చేయాలని ఒంగోలు టౌన్ డినామినేషన్స్ చర్చస్ ప్రతినిధులు కోరారు. మంగళవారం స్థానిక సుజాతనగర్‌లోని షకీనా ప్రార్ధన మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో శాంతి విరాజిల్లాలని కోరారు. అందుకోసం ప్రతి చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు ప్రెసిడెంట్ ఐజక్‌బాబు, సెక్రటరీ భగవాన్ దాస్, యోబు, జకర్యా కృపారావు, డేవిడ్, శ్రీనివాసరావు, రమణ, రవికుమార్, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి నిధులు కేటాయింపుపై హర్షం



మాట్లాడుతున్న జగదీష్

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 23: రాష్ట్ర రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులను కేటాయించడం పట్ల విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ హర్షం వ్యక్తం చేశారు. ఒంగోలులోని జేఏసీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతి ప్రాంతం అభివృద్ధి చెందితేనే విద్యార్థి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మరో వైపు ప్రకాశం జిల్లాను వెనుకబడి జిల్లాల జాబితాలో చేర్చడం అభినందనీయమన్నారు. తద్వారా జిల్లా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. దొనకొండ ప్రాంతాన్ని పారిశ్రామికరంగా అభివృద్ధి చేయడంతో పాటు రామయపట్నం పోర్టు, ఆంధ్రకేసరి యూనివర్సిటీ, ట్రిపుల్‌ఐటీ, కనిగిరి ప్రాంతంలో పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కేంద్ర బడ్జెట్ దోహదం

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 23 : వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లాను చేర్చడం ద్వారా జిల్లా అభివృద్ధికి దోహద పడుతుందని బీజేపి మాజీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శిరసనగండ్ల శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం ల్లాను వెనుకబడిన ప్రాంతాల జాబితాలో చేర్చాలని అనేక ఏళ్ళుగా ఉద్యమాలు జరుగుతూ కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చారన్నారు. కానీ ఏ ప్రభుత్వం పట్టించుకున్న పరిస్థితి లేకుండాపోయిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జిల్లా అభివృద్ధికి దోహదపడే విధంగా వెనుకబడిన జిల్లాల జాబాతాలో చేర్చడం అభినందనీయమన్నారు. తద్వారా జిల్లా అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడుతాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు చేయూత ఇచ్చేలా ప్రవేశపెట్టడం పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఐటీఐ ప్రవేశ దరఖాస్తుకు నేడు తుది గడువు

ఒంగోలు(విద్య), జూలై 23: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశానికి దరఖాస్తులను బుధవారం తుది గడువని జిల్లా కన్వీనర్, ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంవీ.నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించి సంబంధిత పత్రాలు ప్రింట్ తీసుకోవాలి. విద్యార్థులు ఒకటి కంటే ఎక్కువ ఐటీఐలను కూడా ఎంపిక చేసుకోవచ్చు, దరఖాస్తుదారులు దరఖాస్తు ప్రింట్ కాపీ, ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఒక జిరాక్స్ కాపీ సెట్ తీసుకుని తాము చేరదల్చుకున్న ఐటీఐలలో ఈనెల 25వతేదీన సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాలని ఆయన కోరారు.

పల్లామల్లి సొసైటీకి కొత్త విచారణాధికారి

ఒంగోలు(విద్య), జూలై 23 : పల్లామల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో జరిగిన అవినీతిని వెలికితీసి నివేదికను సమర్పించేందుకు కొత్త విచారణాధికారిని నియమిస్తున్నట్లు జిల్లాసహకారశాఖ అధికారి బి.శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ విచారణాధికారిగా వ్యవహరించిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ బీవీఎస్‌శాస్త్రిని రాష్ట్ర సహకారశాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో సొసైటీ అక్రమాలపై విచారణాధికారిగా నియమించేందుకు రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ డీసీవోకు అనుమతి ఇచ్చారు. దీంతో కొత్త విచారణాధికారిని నియమించి రెండు నెలల్లో విచారణ పూర్తి చేయించి సమగ్ర నివేదికను తెప్పిస్తామని డీసీవో తెలిపారు.

కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు సర్వే

పొన్నలూరు (కొండపి), జూలై 23 : మండలంలోని అన్ని గ్రామాల్లో కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు వైద్యారోగ్యశాఖ సిబ్బంది మంగళవారం సర్వే నిర్వహించారు. వైద్యాధికారులు రవికిరణ్, కృష్ణ చైతన్య ఇంటింటికీ వెళ్లి నివాసితులను పరీక్షించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, రాగి రంగులో ఉండే మచ్చలు ఎవరైనా గుర్తిస్తే తమకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ముప్పాళ్ల, కొత్తసింగరబొట్లపాలెంలోనూ కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తింపుతోపాటు డెంగ్యూ, డయేరియా పీడితుల సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లోని ఎంపీయూపీ స్కూళ్లలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

వెల్‌నెస్ సెంటర్ పరిశీలన

కొండపి, జూలై 23 : కొండపిలోని వెల్‌నెస్ సెంటర్‌ను మంగళవారం తహసీల్దార్ కిరణ్‌కుమార్ పరిశీలించారు. అక్కడ ఎంఎల్‌హెచ్‌పీ శాంతితో మాట్లాడారు. సెంటర్ ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోజువారీ ఓపీ, అందుబాటులో ఉన్న మందుల వివరాలను తెలుసుకున్నారు. రోగులకు మరిన్ని సేవలు అందించాలని ఆయన సూచించారు.

పండ్ల తోటల పెంపకంతో నికరాదాయం



మాట్లాడుతున్న పీడీ అర్జునరావు

జరుగుమల్లి (కొండపి), జూలై 23 : చిన్న, సన్నకారు రైతులు ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు పెంచుకోవడం ద్వారా నికరాదాయం పొందవచ్చని డ్వామా పీడీ బి.అర్జునరావు సూచించారు. పండ్లతోటల పెంపకంపై మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో జలజాక్షి, ఏవో యుగంధర్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి ప్రత్యూష, ఏపీవో నాగరాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాల చోరీలపై నిఘా

ప్రత్యేక టీమ్‌ల ఏర్పాటు

ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ బీటీ నాయక్



దుండగులు ధ్వంసంచేసిన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న ఈఈ కరీమ్, సీఐ బీటీనాయక్

తాళ్లూరు, జూలై 23 : ఇటీవల విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి విద్యుత్ పరికరాలను అపహరిస్తున్న దుండగులను పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటుచేసినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ బీటీ నాయక్, ఈఈ అబ్దుల్ కరీమ్ తెలిపారు. మూడు రోజుల క్రితం తురకపాలెం పొలాల్లో దుండగులు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి పరికాలను చోరీ చేశారు. సంఘటనా స్థలాన్ని మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాన్స్‌కో చీఫ్ విజిలెన్స్ అధికారి లావణ్యలక్ష్మి ఆదేశానుసారం ఒంగోలు ట్రాన్స్‌కో ఎస్ఈ ఆపరేషన్ సత్యనారాయణ పర్యవేక్షణలో దుండగులను గుర్తించేందుకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటీవల కాలంతో తరచుగా తాళ్లూరు, ముండ్లమూరు, అద్దంకి, బల్లికురవ, పంగులూరు మండలాల్లో విద్యుత్తు పరికరాల చోరీలు అధికంగా జరుగుతున్నాయన్నారు. తాళ్లూరులో 28, ముండ్లమూరులో 38 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి పరికరాలను చోరీ చేశారని చెప్పారు. గతంలో చోరీలకు పాల్పడ్డ పాత నేరస్తులపై నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో ఏడీ కె.పిచ్చయ్య, ఏఈ వీరబ్రహ్మం, ఎస్సై మోహన్‌రావు, ఎల్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు

ఒకరి మృతి, నలుగురికి గాయాలు

మృతుడు చీమకుర్తి వాసి

ఓజిలి జూలై 23 : మండలంలోని పెద్దపరియ క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన ఒకరు మృతిచెందగా మరో నలుగురు గాయపడ్డారు. చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్తున్న లారీ తిరుపతి జిల్లా ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద ఉన్నట్టుండి బ్రేక్ వేయడంతో అదే మార్గంలో ఒంగోలుకు వెళ్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. చీమకుర్తికి చెందిన శీను(40)తో పాటు మరో నలుగురు తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై అరుణాచలం దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీకొన్నారు. ఈ ఘటనలో ముందు సీట్లో ఉన్న శీను తీవ్రంగా గాయపడగా, డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన శీను చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిబాబు తెలిపారు.

నర్సింగ్ విద్యార్థినులకు సప్లిమెంటరీ పరీక్షలు

● **గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి హాజరు**

నెల్లూరు(వైద్యం), జూలై 23 : నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో నర్సింగ్‌లో ఏఎన్ఎం కోర్సు చదువుతున్న విద్యార్థినులకు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు ఎగ్జామినర్‌గా కావలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత వ్యవహరించారు. ఆమె మాట్లాడుతూ ఈ పరీక్షలు ఈ నెల 26వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో వివిధ నర్సింగ్ కళాశాలలకు చెందిన మొత్తం 110 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరయ్యారని ఆమె తెలిపారు.

కాటేసిన కరెంట్ తీగలు

స్కూటీపై వెళ్తుండగా తెగిపడిన విద్యుత్ లైన్ వైరు

ముగ్గురు విద్యార్థులు మృతి

మూడు ప్రాణాలను బలిగొన్న సిబ్బంది నిర్లక్ష్యం

గుండెలవిసేలా రోదిస్తున్న మృతుల కుటుంబసభ్యులు

కనిగిరి/అద్దంకి, జూలై 23: విద్యుత్ హైటెన్షన్ వైరు తెగి స్కూటీపై వెళ్తున్న ముగ్గురు ఇంటర్ విద్యార్థులను కబళించింది. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో మూడు నిండు ప్రాణాలను బలిగొంది. హృదయ విదారకమైన ఈ దుర్ఘటన మంగళవారం కనిగిరి మండలం పునుగోడు గ్రామంలో చోటుచేసుకుంది. ఈప్రమాదంలో కనిగిరి పట్టణంలోని ఇందిరాకాలనీకి చెందిన కామినేని బాలాజి (15), వీరమాచనేని గౌతమ్ (15), దేశపోగు నజీర్ (15)లు సజీవదహనమయ్యారు. ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

మృతులు పేద కుటుంబాలకు చెందినవారు..

కామినేని బాలాజి తల్లిదండ్రులు కుటుంబాన్ని పోషించుకునేందుకు తిరుపతి సమీపంలోని కోడూరులో బేల్దారి పనుల చేసుకుంటున్నారు. బాలాజి మేనత్త ఇంట్లో ఉంటూ కళాశాలకు వెళ్ళి వస్తుంటాడు. మరో మృతుడు వీరమాచనేని గౌతమ్ తల్లిదండ్రులు కూడా రోజువారీ కూలి పనులు చేసుకునేవారే. ఇందిరాకాలనీలో నివాసం ఉండే మరో మృతుడు దేశపోగు నజీర్ తల్లిదండ్రులు ప్రయివేటు కాలేజీలో వంట చేస్తుంటారు. వీరు ముగ్గురు స్నేహితులు కావటంతో స్కూటీపై సరదాగా పొలాలు వైపు వెళ్ళినట్లు తెలుస్తుంది.

స్కూటీతో సహా ముగ్గురు సజీవదహనం

పునుగోడు ఎస్టీ కాలనీలోని మెటల్ రోడ్డు ముగ్గురు స్నేహితులకు మృత్యుమార్గంగా మారింది. మృతుల్లో బాలాజి స్కూటీ నడుపుతుండగా నజీర్, గౌతమ్‌లు సరదాగా మాట్లాడుకుంటూ వెళ్తున్నారు. ఇంతలో మృత్యువు విద్యుత్ వైరు రూపంలో అమాంతంగా వచ్చి పడింది. ఆ యువకులకు ఏం జరుగుతుందో గ్రహించే లోపే పెద్ద మంటలు చెలరేగి స్కూటీతో పాటు వారు మృత్యు ఒడిలోకి జారుకున్నారు. కళ్ళ ముందే ముగ్గురు ముక్కుపచ్చలారని యువకులు మంటల్లో సజీవ దహనమవుతుంటే రక్షించే అవకాశంలేక స్థానికులు హాహాకారాలు పెడుతూ బోరున విలపించారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యం మూడు నిండు ప్రాణాలను బలిగొంది. హెచ్‌టీ లైను వెళ్ళే స్తంభానికి మూడు ఇండక్టర్ ఇన్సులేటర్‌కు అడుగు భాగాన బోల్టు బిగించకుండా ఉంది. మంగళవారం ఉదయం నుంచి ఈదురుగాలులు వీస్తున్నాయి. దీంతో పింగాణి ఇండక్టర్ ఇన్సులేటర్ ఈదురుగాలులకు పైకి లేచిన క్రమంలో వైరు మధ్యలోకి తెగిపోయింది. ఈవైరు స్కూటీపై వెళుతున్న విద్యార్థులపై పడటంతో ప్రమాదం చోటు చేసుకుంది. హెచ్‌టీ లైను కోసం వైరు వేసిన తర్వాత జంపింగ్ చెక్ చేసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించారు. విద్యుత్ లైను ఏర్పాటుచేసే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కూడా ఈ ఘటనకు కారణంగా తెలుస్తుంది.

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర దిగ్ర్భాంతి

విద్యుత్ షాక్‌తో ముగ్గురు విద్యార్థులు దుర్మరణం పాలవటం పట్ల ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అమరావతిలో ఉన్న ఎమ్మెల్యే ఈ విషయాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ద్వారా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళారు. వెంటనే వారి కుటుంబాలకు అండగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్‌లను ఆదేశించారు. ఘటనపై పూర్తి విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందజేసి అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: మంత్రి గొట్టిపాటి

పునుగోడులో విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన ముగ్గురు యువకుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున పరిహారం అందించి, అన్నివిధాలా అండగా ఉంటామని విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు. ముగ్గురు మృతిపై రవికుమార్ తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

మృతుల కుటుంబాలకు విద్యుత్‌శాఖ నుంచి ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని డీఈఈ ఆర్.ఉమాకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గురు యువకులు విద్యుత్ వైరు పడి మృతి చెందటం బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటనలో విద్యుత్‌శాఖ పొరపాటు లేదని తెలిపారు. విపరీతంగా వీస్తున్న ఈదురుగాలులతో 11కేవీ పునుగోడు ఫీడర్‌లో విద్యుత్ కండక్టర్ వైరు రాపిడికి గురై లైను తెగిపడినట్లు పేర్కొన్నారు. కండక్టర్ వైరు నేలకు తాకకపోవటం వల్ల పునుగోడు సబ్‌స్టేషన్‌లో ఫీడర్ ట్రిప్ కాలేదని తెలిపారు. బైకుపై వెళుతున్న ముగ్గురు విద్యార్థులను వేలాడే 11కేవీ సప్లయి వైరు తగలడంతో ప్రమాదం చోటుచేసుకుందని పేర్కొన్నారు.

ప్రజలందరికీ మంచినీరు అందించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా



సాగర్ కాలువలను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇన్‌చార్జ్ డాక్టర్ లక్ష్మి

దర్శి, జూలై 23 : ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. దర్శి పట్టణ సమీపంలోని ఎన్ఏపీ మంచినీటి చెరువును టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. తాగునీటి అవసరాల కోసం విడుదలైన సాగర్ జలాలను స్థానిక ఎన్ఏపీ చెరువుకు పంపింగ్ చేస్తున్న మోటార్లను వారు పరిశీలించారు. ఎన్ఏపీ చెరువులో నిల్వ ఉన్న నీటి పరిమాణాన్ని తనిఖీ చేశారు. ఆర్ఎస్ఎఫ్ ఫిల్టర్ బెడ్లు పరిశీలించారు. గతంలో నిర్మించిన మాన్యువల్ ఫిల్టర్‌బెడ్లను తనిఖీ చేశారు. ఎంతోకాలంగా మాన్యువల్ ఫిల్టర్‌బెడ్లు మూలన పడిన విషయానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ షేక్ మర్ధన్‌అలీ వీటి దుస్థితి గురించి వివరించారు. 40 ఏళ్ల క్రితం నిర్మించినవి కాలం చెల్లిపోవటంతో పనిచేయటం లేదన్నారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలంటే సుమారు రూ.2 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. వీటికి బదులుగా మరో ఆర్ఎస్ఎఫ్ ఫిల్టర్ బెడ్లు నిర్మిస్తే భావితరాలకు స్వచ్ఛమైన నీరు ఎక్కువ కాలం అందించవచ్చునని తెలిపారు. డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ఎన్ఏపీ చెరువు పూడిపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందన్నారు. దీంతో అన్నిగ్రామాలకు సక్రమంగా మంచినీరు అందించలేకపోతున్నారని తెలిపారు. స్కీమ్ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు. ప్రజలందరికీ పూర్తిస్థాయిలో తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

సాగర్ కాలువల పరిశీలన

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, తదితరులు సాగర్ కాలువలో నీటి పంపిణీ పరిశీలించారు. ఓబీసీ హెడ్ వద్ద సరఫరా అవుతున్న నీటిని మీటర్ రీడింగ్‌ను తనిఖీ చేశారు. ఇదే క్రమంలో ఎన్నిరోజులు నీరు విడుదలయితే మంచినీటి చెరువులు నిండుతాయని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం విడుదలవుతున్న నీరు పది రోజులకు పైగా వస్తుందని, చాలావరకు చెరువులకు నీరు నింపే అవకాశం ఉంటుందని ఇరిగేషన్ ఇంజనీర్ మురళీమోహన్ వివరించారు. సాగర్ జలాలు దుర్వినియోగం కాకుండా మంచినీటి చెరువులకు నీరు నింపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దర్శి నగర పంచాయతీ కార్యాలయం భవన నిర్మాణం కోసం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఆవరణలోని ఖాళీ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు పూర్ణచంద్రరావు, రామస్వామి, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో హనుమంతరావు, డిప్యూటీ తహసీల్దార్ ఏ.రవిశంకర్, నగర పంచాయతీ కమిషనర్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధార్ శిబిరాలు

- కార్డుల్లో తప్పులు ఉన్న వారు సరిచేయించుకోండి
- ప్రజలకు సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా సూచన



ఆధార్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురం రూరల్, జూన్ 23: ఆధార్‌కార్డుల్లో తప్పుల సవరణలకు ప్రభుత్వం గ్రామాల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తోందని సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా సూచించారు. మండలంలోని కోలభీమునిపాడు గ్రామంలో ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులను పరిశీలించి సిబ్బదికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆధార్‌కార్డు సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు గ్రామస్థాయిలోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో నివాసాల మధ్య ఎక్కడ అపరిశుభ్రంగా ఉండకుండా తగుజాగ్రత్తలు తీసుకొని పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం అవుతాయని ప్రజలకు వివరించారు. నీటి నిల్వ ఉండే తొట్లు తదితర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటూ బ్లీచింగ్ పౌడర్ వాడుతుండాలని సూచించారు. మురికి నీరు ఇంటి పరిసరాలలో నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సబ్ కలెక్టర్ వెంట వెంట సచివాలయ ఉద్యోగులు, పరిశుధ్య కార్మికులు ఉన్నారు.

ఆధార్ కేంద్రాలు వినియోగించుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఈ.కిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఆధార్ కార్డులు ఎన్‌రోల్, బయోమెట్రిక్ అప్డేట్, డేమోగ్రాఫిక్ అప్డేట్, ఆధార్‌కార్డు డౌన్‌లోడ్, కలర్ ప్రింట్ మొదలైన సర్వీసులు చేయడానికి ఈనెల 27వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. 24న సచివాలయం-5, 25, 26 తేదీలలో సచివాలయం-18, 27న పూలసుబ్బయ్య కాలనీలోని ఎంపీయూపీ స్కూల్స్‌లో ఈ ప్రత్యేక ఆధార్ కార్డు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. బయోమెట్రిక్ అప్డేట్ కోసం రూ.100, డెమోగ్రాఫిక్ అప్డేట్ కోసం రూ.50, డౌన్‌లోడ్, కలర్ ప్రింట్‌ల కోసం రూ.30 చెల్లించాలన్నారు. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, మ్యాండటరీ బయోమెట్రిక్ అప్డేట్, డెమోగ్రాఫిక్ అప్డేట్‌లు ఉచితంగా చేస్తామన్నారు.

పెద్ద దోర్నాల : ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను ప్రజలు సద్విని యోగ పర్చుకోవాలని ఎంపీడీవో నాసర్‌రెడ్డి అన్నారు. స్థానిక సచివాలయం-2లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆధార్‌కేంద్రాన్ని ఎంపీడీవో నాసర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ చేయించి పది సంవత్సరాలు దాటిన వారు అప్‌డేట్ చేయించుకోవాలని, ఏదైనా, పేర్లు, ఇంటి పేరు, అడ్రస్ తదితర మార్పు, చిన్నపిల్లలకు ఆధార్ చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ నెల 23వ తేదీ నుంచి 27 వరకు అవకాశ ముందన్నారు. కార్యక్రమంలో వీఆర్వో సునీత, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ఆధార్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కంభం : మండలంలో సచివాయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపును డీఎల్‌డీవో సాయికుమార్, ఎంపీడీవో మస్తాన్‌వలిలు పరిశీలించారు. ప్రతి గ్రామంలో 0-5 సంవత్సరాల పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేయించడం, మార్పులు చేసుకోవడం, మొబైల్ నెంబర్లు లింకు చేసుకోవడం తదితర కార్యక్రమాలను క్యాంపులో అందుబాటులో ఉంచామన్నారు. కందులాపురం-3, పెద్దనల్లకాల్వ సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు ఉన్నాయని తెలిపారు.

కార్మికులపై కక్షసాధింపును విడనాడాలి

పొదిలి, జూలై 23 : కార్మికులపై అధికారులు కక్షసాధింపును విడనాడాలని, ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ ఆర్గనైజింగ్ సెక్రెటరి ఎస్వీఎస్ శాస్త్రీ అన్నారు. పొదిలి ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలపై ఏపీపీటీడీ, ఎంప్లాయిస్ యూనియన్ తలపెట్టిన నిరాహార దీక్షలు 9వ రోజుకు చేరాయి. ఈ నిరసన దీక్షలో గిద్దలూరు డిపో సెక్రెటరీ, ప్రెసిడెంట్ బి.తిరుపతయ్య, ఎస్కే జాఫర్, కనిగిరి డిపో సెక్రెటరీ సుందరం ఒంగోలు, కనిగిరి రీజినల్ జోనల్ రాష్ట్ర నాయకులు పాల్గొని మాట్లాడారు. డిపోలో ఉన్న సమస్యలపై పోరాటాలు చేస్తున్నా, అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. కనీసం సమస్యలపై చర్చించేందుకు అధికారులు ముఖం చాటేయడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. అధికారులు కావాలని కండక్టర్లను, డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. చిన్న పొరపాట్లకు కూడా అధికారులు పనిష్మెంట్లు ఇస్తూ ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు డిపోలో ఉన్న సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కారమార్గాన్ని చూపాలని కోరారు.

అదృశ్యమైన టీఏ ఆచూకీ లభ్యం

మార్కాపురం, జూలై 23: రెండురోజులు క్రితం కనిపించకుండా పోయిన సస్పెషన్‌కు గురైన మార్కాపురం మండల ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ కుందురు అనిల్‌కుమార్‌రెడ్డి ఆచూకీ లభ్యమైనట్లు మంగళవారం కుటుంబ సభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లోని బంధువుల ఇంటిలో ఉన్నట్లు అనిల్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులకు మంగళవారం ఉదయం సమాచారం అందించాడు. దీంతో ఎట్టకేలకు కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ నెల 20న ఇంట్లోంచి వెళ్లిన అనిల్‌కుమార్‌రెడ్డి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అన్నిచోట్లా గాలించారు. ఆచూకీ లభ్యంకాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పట్టణ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి అతనే తాను హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలపడంతో మిస్సింగ్ కేసు సుఖాంతమైంది.

గ్యాస్ ఇవ్వడం లేదని నిరసన



నిరసన తెలుపుతున్న వినియోగదారులు

కొనకనమిట్ల, జూలై 23 : మండలంలోని కొనకనమిట్ల గ్యాస్‌గూడెం వద్ద మంగళవారం గ్యాస్ వినియోగదారులు గ్యాస్‌ఇవ్వడం లేదని ఖాళీ సిలెండర్లతో నిరసన వ్యక్తంచేశారు. భారత్‌గ్యాస్ డీలర్ గ్యాస్‌బుక్ చేసుకున్న వెంటనే వినియోగదారులకు ఇవ్వకుండా రోజుల తరబడి తిప్పుతున్నారని ఆరోపించారు. సిలిండర్ బుక్ చేసుకున్న వెంటనే ఇవ్వకుండా గ్యాస్ స్టాక్ లేదని ఇదిగో ఇస్తాం అదిగో ఇస్తాం అంటూ ప్రతి నెల తిప్పుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే వినియోగదారులు నిరసనతో దిగివచ్చిన భారత్ గ్యాస్ ఏజెన్సీ డీలర్ వెంటనే వినియోగదారులకు గ్యాస్ అందించారని బాధితులు తెలిపారు.

ఉపాధిహామీ టీఏ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న రాజ్‌కుమార్

మార్కాపురం రూరల్, జూన్ 23: ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్‌కు గురికావడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు యత్నించిన ఘటన మార్కాపురం మండలం గజ్జలకొండ గ్రామంలో మంగళవారం చోటు చేసుకొంది. ముండ్లమూరు మండలంలో రాజ్‌కుమార్ ఉపాధిహామీ పథకంలో టీఏగా పనిచేసేవారు. ఆయన గతంలో పుల్లలచెరువు మండలంలో పనిచేశారు. ఆ సమయంలో ఈయనపై పలు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఉన్నతాధికారులు విచారించి మే 20న చర్యలు తీసుకున్నారు. తనను అన్యాయం సస్పెండ్ చేశారని మనస్తాపంతో ఇంట్లో ఉన్న మాత్రలు భోజనంలో కలుపుకొని తిన్నాడు. దీంతో ఆయన్ను పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అయితే చికెన్ తినడంతో విరేచనాలు అయినట్లు చెప్పి ఆస్పత్రిలో చేరినట్లు వైద్యులు తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

గిద్దలూరు టౌన్, జూలై 23 : మండలంలోని కొంగలవీడు గ్రామ శివారులో ఎస్ఈబీ అధికారుల మంగళవారం 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ సీఐ కొండారెడ్డి చెప్పిన వివరాల ప్రకారం.., బురుజుపల్లి గ్రామానికి చెందిన నాసరి వెంకటేశ్వర్లు నాటుసారా తయారు చేస్తుండగా, సమాచారం మేరకు దాడి చేశామన్నారు. 8 డ్రమ్ములలో ఉన్న 200 లీటర్ల బెల్లంఊటను గుర్తించారు. అదే ప్రాంతంలో 20 లీటర్ల నాటుసారా, 30 కిలోల బెల్లం ఉండగా స్వాధీనం చేసుకున్నారు. అక్కడే ఉన్న నాసరి వెంకటేశ్వర్లును పట్టుకునేందుకు ప్రయత్నించగా పరారయ్యాడు. పారిపోయిన వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో ఎస్సై టి.ఫణికుమార్, సిబ్బంది కె.వెంకటేశ్వర్లు, ఎం.సాయి పాల్గొన్నారు.

జ్వరాలపై వైద్యసిబ్బంది సర్వే

గిద్దలూరు టౌన్, జూలై 23 : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా విజృంభిస్తున్న జ్వరాలను నివారించేందుకు వైద్య సిబ్బంది మంగళవారం చర్యలు చేపట్టారు. పట్టణ వైద్యాధికారి డాక్టర్ షరీఫ్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి వారి ఆరోగ్య పరిస్థితి, తాగునీటి నాణ్యతను పరిశీలించారు. వర్షం నీరు నిలువ ఉన్న చోట దోమల నివారణ మందును పిచికారి చేయించారు. డాక్టర్ షరీఫ్ మాట్లాడుతూ వర్షాకాలంలో చికెన్‌గున్యా, డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రోగం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుధారాణి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

డయాలసిస్ రోగులకు ప్రత్యేక వార్డు సిద్ధం

త్వరలో ప్రారంభానికి ఏర్పాట్లు



డయాలసిస్‌కు సిద్ధమైన ప్రత్యేక వార్డు

గిద్దలూరు, జూలై 23 : టీడీపీ అధికారంలోకి రావడంతో పెండింగ్‌లో ఉన్న పనులన్నీ చకచకా సాగుతున్నాయి. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ఆసుపత్రి స్థానంలో నూతన భవన నిర్మాణం, 50 పడకల నుంచి 100 పడకల ఆసుపత్రిగా మార్పు కోసం ప్రతిపాదించారు. ఆ పనులు వైసీపీ ప్రభుత్వ హయాంలో మొదలయ్యాయి. అయితే ఐదేళ్ల పాటు పనులు నత్తనడకన సాగగా ఎన్నికల ముందు హడావుడిగా అసంపూర్తిగానే భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆసుపత్రిలో కల్పిస్తున్న ఆధునిక సౌకర్యాల కల్పన మొదలు కాలేదు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఇటీవలే ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇందులో భాగంగానే డయాలసిస్ వార్డు సిద్ధమైంది. ఈ ప్రాంతంలోని డయాలసిస్ రోగులు నంద్యాల, ఒంగోలు లాంటి పట్టణాలకు వెళ్లి వ్యయప్రయాసలోడ్చి డయాల సిస్ చేయించుకునేవారు. గిద్దలూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో 5 బెడ్లతో ప్రత్యేక డయాలసిస్ వార్డు పనులు దాదాపు పూర్తయ్యాయి. ఒకే పర్యాయం ఐదుగురు రోగులకు డయాలసిస్ చేసే అవకాశం ఉంటుంది. ప్రైవేటు ఏజెన్సీ ద్వారా సిబ్బంది నియామకం కూడా పూర్తయింది. త్వరలోనే డయాలసిస్ వార్డు ప్రారంభం కానున్నది. ఇది ప్రారంభమైతే డయాలసిస్ రోగులందదరూ ఇతర పట్టణాలకు వెళ్ళకుండా స్థానికంగానే ఉచితంగా రక్తాన్ని డయాలసిస్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికే 15 మంది దాకా డయాలసిస్ రోగులు సిబ్బందికి రోగ వివరాలను ఇచ్చినట్లు తెలిసింది. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 100 మందికి పైగా డయలసిస్ రోగులకు ప్రత్యేక వార్డు ప్రారంభమైతే ప్రయోజనకరంగా ఉంటుంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో వేగంగా పూర్తవుతున్న డయాలసిస్‌వార్డు ప్రారంభోత్సవం పట్ల రోగులు ఎదురు చూస్తున్నారు.

వసతిగృహాల్లో అధికారుల తనిఖీ



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

పొదిలి, జూలై 23 : పొదిలిలో బీసీ, ఎస్సీ బాలకల వసతిగృహాలను తహసీల్దార్, కమిషనర్, ఎంఈవోలతో కూడిన అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. ప్రస్తుతం వసతిగృహాల్లో ఉన్న సమస్యలపై ఆరా తీసింది. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా..? లేదా..? అనే విషయాలను అధికారులు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దీంతో విద్యార్థులు వాడకం, తాగునీటికి ఇబ్బందిగా ఉందని అధికారులకు తెలిపారు. స్పందించిన నగరపంచాయతీ కమిషనర్ ఉచితంగా ప్రతిరోజు ఒక ట్యాంకర్ నీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా పరిసరాలు పరిశుభ్రంగా లేవని వాటిని కూడా శుభ్రం చేయించాలని విద్యార్థులు అధికారులను కోరారు. వెంటనే శుభ్రం చేయిస్తామని అధికారులు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని వైద్యాధాకారి శరత్ చంద్రకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ జియా, నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాసరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కంభం : పట్టణంలోని బాలుర, బాలికల వసతి గృహాలను తహసీల్దార్ రామయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. కంభం బీసీ బాలురు, బాలికలు, ఎస్సీ బాలుర, బాలికల వసతిగృహాలను తహసీల్దార్ రామయ్య వంటగదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. వంట గది అపరిశుభ్రంగా ఉండి దుర్వాసన వస్తుండడం, వాటర్ ట్యాంక్‌లు పాచిపట్టి అపరిశుభ్రంగా ఉండడంపై సంబంధిత ఎస్సీబాలికల హాస్టల్‌వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. మరో రెండు రోజుల్లో వచ్చి పరిశీలిస్తానని, ఇలాగే ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, ఈవోఆర్‌డీ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సర్పంచ్, సిబ్బందికి డీపీవో సూచన

కొమరోలు, జూలై2: కొమరోలు గ్రామపంచాయతీలో పంచాయతీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని డీపీవో ఉషారాణి సర్పంచ్, కార్యదర్శికి సూచించారు. మంగళవారం ఆమె కొమరోలు పంచాయతీని సదర్శించారు. పంచాయతీలో టెండర్ కార్మికులు ఏడుగురు, గ్రీన్ అంబాసిడర్లు 9 మంది పనిచేస్తున్నారు. వారికి సుమారు 20 నెలల నుంచి జీతాలు లేకపోవడంతో వారు ధర్నా చేస్తున్నారు. దీంతో సమస్య పరిష్కరించాల్సిందిగా కలెక్టర్ డీపీవోను ఆదేశించారు. దీంతో ఆమె కార్మికులు, ఎంపీడీవో, ఈవోఆర్‌డీలతో సమావేశమయ్యారు. ఈ సమస్యను ప్రతి అధికారి బాధ్యతగా తీసుకొని కార్యదర్శికి, సర్పంచ్‌ల మధ్య సమన్వయం చేసి సమస్య ఇంతవరకు వచ్చేది కాదన్నారు. ఇంటి పన్నులు సుమారు రూ.12లక్షలు వసులు చేయాల్సి ఉండగా రూ.7లక్షలు వస్నులు వసులు చేశారు కదా వాటిని కార్మికుల జీతాలకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మిగిలిన పన్ను వసూళ్లకు ఇక నుంచి మూడు సచివాలయ సిబ్బందిని కేటాయిస్తామన్నారు. గతంలో వసులు చేసిన రూ.7లక్షలకు సంబంధించి నగదును ఆన్‌లైన్‌ద్వార ప్రభుత్వానికి జమ చేశారా..? లేదా..? అని తెలుసుకోవాలని విచారణలో తెలుతుందన్నారు. సర్పంచ్ చొరవ తీసుకుని కార్మికులకు 10 రోజుల లోపు అందరికి జీతాలు ఇవ్వాలని, వాటిని ఎలా సమీకరిస్తారో అధికారులతో కలసి చర్చించాలన్నారు.

వెనుకబడిన జిల్లాగా ప్రకాశాన్ని గుర్తించడం హర్షణీయం

- టీడీపీ వై.పాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు, జూలై 23: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనలతో ప్రకాశం జిల్లాను కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన జిల్లా జాబితాలో చేర్చడం హర్షణీయమని టీడీపీ వై.పాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రకాశం అభివృద్ధికి ఈ నిధులు ఎంతో దోహదపడుతాయని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు కృషితోనే వెనుకబడిన జిల్లాల్లో ప్రకాశం జిల్లాను చేర్చారన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

గిద్దలూరు, జూలై 23 : మండలంలోని సంజీవరాయునిపేట గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ సుమయ వైద్యపరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. భోజనం చేసే ముందు చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వ్యాధులబారిన పడితే నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యుల వద్దకు పిల్లలను తీసుకుని రావాలని సిబ్బందికి సూచించారు. దోమలు దరిచేరకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం హెచ్ఈవో బాదరయ్య, ఏఎన్ఎం లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

దానం, త్యాగానికి ప్రతీకగా మొహర్రం



పీర్లకు ప్రార్థన చేస్తున్న భక్తులు

కొమరోలు, జూలై 23: దానం, త్యాగానికి నిదర్శనమైన మొహర్రం వేడుకలను కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారని ఎంపీపీ కామూరి అమూల్య అన్నారు. మండలంలోని బాదినేనిపల్లి గ్రామంలోని ఖాశీంపీరుస్వామి పీర్లపండుగలో భాగంగా ఎంపీపీ కామూరి అమూల్య, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివారెడ్డిలు అన్నదాన కార్యాక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అమూల్య మాట్లాడుతూ తమ సొంత గ్రామంలో కేవలం హిందువులు, క్రైస్తవులు మాత్రమే ఉన్నారని కానీ పీర్లపండుగ అనాధిగా బ్రాహ్మణుల నుంచే ఆచారంగా తాము ఘనంగా నిర్వహించడం అనవాయితీగా ఉందన్నారు. ప్రస్తుతం పీర్లచావిడి ధర్మకర్త కూడా ఓరుగంటి రామక్రిష్ణయ్య అని గుర్తుచేశారు. అంటే గ్రామం ఐక్యమత్యంతో కుల, మతాలకు, వర్గాలకు సంబంధం లేకుండా కలిసికట్టుగా జరుపుకుంటున్నామన్నారు. ఈ పండుగకు వచ్చిన భక్తులకు భోజన ప్రసాదాన్ని అందివ్వడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. చావిడిలో ఖాశిం, చిన్న ఖాశిం స్వాములకు భక్తులు పెద్ద సంఖ్యలో మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఒంగోలు వారిచే పాటకచేరిని, పేరాల వారిచే అబ్బురపర్చే టపాసులు కాల్చడం వంటి కార్యాక్రమాల అనంతరం స్వాములను ప్రదర్శిస్తారు. ఈ దర్శనం కోసం రాష్ట్రం నలుమూలనుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. గుండంలో రైతులు తమ వాహనాల ద్వారా కలపను పెద్ద సంఖ్యలో వేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

బలప్రదర్శన పోటీలలో కడప జిల్లా ఎడ్ల సత్తా



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ

కొమరోలు, జూలై23: మండలంలోని బాదినేనిపల్లి గ్రామంలోని శ్రీరెడ ఖాశీంస్వామి పీర్లపండుగ సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పోటీలలో కడప జిల్లా ఎడ్లు సత్తాచాటాయి. పోటీలను ఎంపీపీ కామూరి అమూల్య ప్రారంభించారు. ఈ పోటీల్లో కడప జిల్లా పోత్తిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మూలే సూరారెడ్డికి చెందిన ఎడ్ల జత 4033అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి రూ.40వేలను గెలుచుకొంది. గ్రామానికి చెందిన జ్యోగిపర్తి సుబ్రహ్మణ్యం, రాముడు, వెంకటరామయ్యలు అందచేశారు. ద్వితీయ బహుమతిని కడపజిల్లాకు చెందిన బాలయ్యగారిపల్లి గ్రామం సుధాకర్‌రెడ్డికి చెందిన ఎడ్ల జత 4000 అడుగుల దూరం లాగి రూ.30 వేలను గెలుచుకొంది. గ్రామానికి చెందిన ముత్తుముల జంగంరెడ్డి అందజేశారు. తృతీయ బహుమతిని కడప జిల్లా పోతిరెడ్డిపల్లి గ్రామం మూలే ప్రసాద్‌రెడ్డికి చెందిన ఎడ్ల జత 3421 అడుగుల దూరం లాగి రూ. 20 వేలను గెలుచుకుంది. గ్రామానికి చెందిన ముత్తుముల యల్లారెడ్డి, వేమారెడ్డి వెంకటరెడ్డిలు అందజేశారు. నాలుగవ బహుమతిని కడప జిల్లాగుడిపాడుకు చెందిన తుమ్మల నారాయణ రెడ్డికి చెందిన ఎడ్ల జత 3240 అడుగుల దూరం లాగి రూ. 15వేలను గెలుచుకోగా, సానెబోయిన పిచ్చయ్య కుమారులు బహుమతి అందజేశారు. ఐదవ బహుమతిని నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన పెద్ది శివకాంత్‌రెడ్డికి చెందిన ఎడ్ల జత 3200 అడుగుల దూరం లాగి రూ.10వేలను, ఆరవ బహుమతిని రాచర్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ఎడ్లజత 2038 అడుగుల దూరం లాగి రూ.8 వేల బహుమతులను గెలుచుకున్నాయి.

అవీ..ఇవీ..

రైతులు పండ్ల మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న ఏపీడీ భాస్కర్

తర్లుపాడు, జూలై 23: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు పండ్ల తోటలు పోషించుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఏపీడీ భాస్కర్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఐదెకరాల పొలం ఉన్న రైతులకు రాయితీ ద్వారా పండ్ల తోటలు పెంచుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, మిగిలిన రైతులకు 90 శాతం రాయితీతో మొక్కలు నాటుకోవచ్చన్నారు. మొక్కలు నాటినప్పటి నుంచి మూడేళ్ల వరకు మెయింటెన్స్‌కు డబ్బులు ఇస్తారన్నారు. అర్హులైన రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేష్, ఏపీవో చిన్నకొండయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీని అందిపుచ్చుకోవాలి

కంభం, జూలై 23 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లతోటల సాగు కు అందజేసే రాయితీని రైతులు అందిపుచ్చు కోవాలని కంభం మండల ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో రైతలకు పండ్లతోటల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులు ముందుగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి మాట్లాడుతూ, ప్రభుత్వం ఇస్తున్న ఉచిత పండ్ల మొక్కలను పొలాల్లో నాటుకుని ఆర్థికంగా బలపడాలని కోరారు. ఎంపిడిఒ మస్తాన్‌వలి మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగి 5 ఎకరాల లోపు ఉన్న రైతులకు ప్రభుత్వం బత్తాయి, నిమ్మ, జామ మొక్కలను ఉచితంగా అందజేస్తుందన్నారు. ప్రభుత్వం కంభం మండలానికి 200 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి లక్ష్యంగా నిర్ణయిస్తే, ఏడుగురు రైతులు కేవలం 17 ఎకరాల్లో సాగుకు ముందుకు వచ్చారన్నారు. మిగిలిన రైతులు ముందుకు రావాలన్నారు. ఉద్యానవన శాఖాధికారిణి శ్వేత మాట్లాడుతూ బేస్తవారపేట, అర్ధవీడు మండలాల్లో అధిక మంది రైతులు పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి చూపారన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో ఏడుకొండలు, ఫీల్డ్ అసిస్టెంట్లు రైతులు పాల్గొన్నారు.

అసంబద్ధ డిప్యుటేషన్లు రద్దుచేయాలి

పెద్దారవీడు, జూలై 23: వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో భాగంగా మండల విద్యాశాఖాధికారి చేసిన అసంబద్ధ డిప్యుటేషన్లను రద్దు చేయాలని యూటీఎఫ్ మండల శాఖ ప్రతినిధులు డిమాండ్ చేశారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఈవోలు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యంలకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్లు వేయడం దారుణమన్నారు. నిబంధనల మేరకు డిప్యుటేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.శ్రీరాములు, జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్, మండల శాఖ అధ్యక్షుడు వై.పాపయ్య, ప్రధాన కార్యదర్శి యల్లమందారెడ్డి పాల్గొన్నారు.

కౌలురైతులు కార్డులు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏవో చంద్రశేఖర్

తర్లుపాడు, జూలై 23: కౌలురైతులు తప్పనిసరిగా కార్డులు తీసుకోవాలని వ్యవసాయాధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌలు రైతు కార్డుకోసం భూయజమాని ఆధార్‌కార్డు, పాస్‌బుక్ జిరాక్స్, సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారికి అందజేసి కౌలుకార్డులు తీసుకోవాలని సూచించారు. కౌలు కార్డులు తీసుకున్న రైతులకు బ్యాంకులో రుణాలు, పంటల బీమా వంటి పథకాలు పొందుతారన్నారు. కార్యక్రమంలో వీఆర్వో భాస్కర్‌రెడ్డి, వ్యవసాయ సహాయకుడు గోవింద్ బాషా, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణిత పునాదిపై అవగాహన

ఎర్రగొండపాలెం, జూలై 23 : శిక్షాసప్తాహ విద్యా వారోత్సవాలలో గణిత పునాది అభ్యసనంపై విద్యార్థులకు చక్కటి అవగాహనతో కూడిన గణితం నేర్పించాలని ఉపాధ్యాయులను ఎంఈవో పి.ఆంజనేయులు కోరారు. శిక్షాసప్తాహ విద్యా వారోత్సవాలలో మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలలో విద్యార్థులకు గణిత పునాది అభ్యసంపై ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు. స్థానిక ఎస్టీ కాలనీలో మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో గణితంపై బోధనా చిత్రాలపై అవగాహన కల్పించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గణితం అంటే తెలీని ఒక భయం ఉంటుందని, ఉపాధ్యాయులు వారికి చక్కని ప్రణాళికలతో విద్యాబోదన చేస్తూ భయాన్ని పొగొట్టాలని అన్నారు. అందుబాటులో ఉండే రాళ్ళు, చింత పిక్కలు, గోళీలు, కర్రపుల్లలు, అగ్గిపెట్టెలు, అబాకస్, పూసల చట్రం మొదలైన వాటిని తక్కువఖర్చుతో గణిత పరికరాలుగా వినియోగించి విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధించవచ్చన్నారు. పాఠశాలకు ప్రభుత్వం ఇచ్చిన గణిత కిట్స్‌తో విద్యార్థులకు చక్కటి బోధన చేయాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గుల్షన్‌బేగ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండండి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పొదిలి, జూలై 23 : సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎం, ఆశావర్కర్లకు సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించాలన్నారు. రానున్నది వర్షాకాలం కావున డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా, బోదకాలు వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రతిఒక్కరూ గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి పరిసరాలను పరిశీలించి ప్రజలకు తగు జాగ్రత్తలు చెప్పాలన్నారు. నివాస ప్రాంతాల్లో నీటినిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. జ్వరపీడితులను గుర్తించి వారికి తక్షణ వైద్యం చేయాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి పెద్దబస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైద్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

- ఐఆర్ఎస్ అధికారి మధుబాబు



మాట్లాడుతున్న ఐఆర్ఎస్ అధికారి మధుబాబు

పొదిలి, జూలై 23 : జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఐఆర్ఎస్ అధికారి మధుబాబు అన్నారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించిన కెరీర్‌గైడెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవడం వలన జీవన నైపుణ్యాలను పెంచుకో వచ్చన్నారు. అదేవిధంగా జీవితంలో కష్టపడి చదవడం, ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేంత వరకు విడవకుండా పోరాడటం, ఏదైనా సాధించగలమనే నమ్మకంతో బాధ్యతగా మెలగాలన్నారు. అలా అనుకున్న లక్ష్యం వైపు ముందుకు సాగాలన్నారు. ఏదైనా ముందుచూపుతో సాగినప్పుడు ఎలాంటి అడ్డంకులు లేకుండా బోధన సాఫీగా సాగుతుందన్నారు. కనుక ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా మంచి చదువులు చదివి మీతల్లిదండ్రులకు, గురువులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తారావాణి అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేతకు మంత్రి రవికుమార్ సన్మానం



టీడీపీ సీనియర్ నాయకుడు చెంచయ్యను సన్మానిస్తున్న మంత్రి రవికుమార్

దొనకొండ, జూలై 23: మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన కామేపల్లి చెంచయ్య టీడీపీలో సీనియర్ నాయకుడిగా గుర్తించి రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శాలువాతో సన్మానించారు. రామాపురం గ్రామంలో ఇరిగేషన్ ప్రాజెక్టు మంజూరు నిమిత్తం మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో చెంచయ్య, మరికొందరు నాయకులు కలిశారు. ఈసందర్భంగా చెంచయ్య మంత్రి రవికుమార్‌ను సన్మానించబోగా మంత్రి శాలువాను తీసుకొని పార్టీ ఆవిర్భావం నుంచి అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపి చెంచయ్యను సన్మానించారు. రామాపురంలో ఇరిగేషన్ ప్రాజెక్టు ఆవశ్యకతను ప్రభుత్వంతో చర్చించి మంజూరుకు చర్యలు చేపడతానని మంత్రి రవికుమార్ తెలిపినట్లు వివరించారు. కార్యక్రమంలో దర్శి ఏఎంసీ మాజీ చైర్మన్ ఆర్.వెంకటయ్య, నాయకులు తాండ్ర వెంకటేశ్వర్లు, వల్లపునేని ఆదినారాయణ, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, ఫణిదపు వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆధార్ నమోదు చేయించుకోవాలి

పామూరు, జూలై 23: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్న పలు సంక్షేమ పథకాలు పొందాలంటే ప్రతిఒక్కరూ ఆధార్ నమోదు చేయించుకోవాలని ఎంపీడీవో పి.పుట్టారెడ్డి తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు క్యాంప్‌ను మంగళవారం పరిశీలించారు. నూతనంగా ఆధార్ నమోదుతో పాటు, ఆధార్‌లో సవరణలు, చేర్పులతో పాటు ఫోన్‌లింక్‌ను నమోదు చేసుకొనే అవకాశం ఉందని చెప్పారు. మండల ప్రజలు ఆధార్ నమోదు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.బ్రహ్మానందరెడ్డి, వార్డు మెంబర్ షేక్ మస్తాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు టీడీపీ నాయకులు ఘనస్వాగతం

దొనకొండ, జూలై 23: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి ప్రప్రథమంగా విమానాశ్రయంను పరిశీలించేందుకు మంగళవారం దొనకొండ విచ్చేసిన కలెక్టర్ తమీమ్ అన్సారియా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని మండల నాయకులు ఘనస్వాగతం పలికారు. టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, తెలుగు యువత ఉపాధ్యక్షుడు కుందుర్తి లక్ష్మణ్, కొమ్మతోటి సుబ్బారావు, చెన్నుబోయిన సుబ్బారావులు అరటి మొక్కలు, పూల బొకే, శాలువాలు అందజేసి స్వాగతం పలికారు.



తమీమ్ అన్సారియా, డాక్టర్ లక్ష్మిలకు అరటి మొక్కలు అందించి స్వాగతం పలికిన టీడీపీ నాయకులు

వాసవీమాతకు ఆషాడసారె సమర్పణ

తాళ్లూరు, జూలై 23: మండలంలోని తాళ్లూరు గ్రామంలోని ఆర్యవైశ్య మహిళలు కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య మహిళలు వాసవీ మాతకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళలు ఆషాడ చీరెలను చేతబూని గ్రామంలో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. వాసవీమాతకు ఆషాడసారె సమర్పించి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ మాతను పట్టు చీరెలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

కాటేసిన కరెంట్ తీగ

- స్కూటీపై వెళ్తుండగా తెగిపడిన విద్యుత్ హెచ్‌టీ లైన్ వైరు
- ముగ్గురు విద్యార్థులు మృతి
- మూడు నిండు ప్రాణాలను బలిగొన్న విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం
- గుండెలవిసేలా రోదిస్తున్న మృతుల కుటుంబసభ్యులు

కనిగిరి/అద్దంకి, జూలై 23: విద్యుత్ హైటెన్షన్ వైరు తెగి స్కూటీపై వెళ్తున్న ముగ్గురు ఇంటర్ విద్యార్థులను కబళించింది. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో మూడు నిండు ప్రాణాలను బలిగొంది. హృదయ విదారకమైన ఈ దుర్ఘటన మంగళవారం కనిగిరి మండలం పునుగోడు గ్రామంలో చోటుచేసుకుంది. ఈప్రమాదంలో కనిగిరి పట్టణంలోని ఇందిరాకాలనీకి చెందిన కామినేని బాలాజి (15), వీరమాచనేని గౌతమ్ (15), దేశపోగు నజీర్ (15)లు సజీవదహనమయ్యారు. ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

మృతులు పేద కుటుంబాలకు చెందినవారు..



బోరున విలపిస్తున్న నజీర్ నానమ్మ

కామినేని బాలాజి తల్లిదండ్రులు కుటుంబాన్ని పోషించుకునేందుకు తిరుపతి సమీపంలోని కోడూరులో బేల్దారి పనుల చేసుకుంటున్నారు. బాలాజి మేనత్త ఇంట్లో ఉంటూ కళాశాలకు వెళ్ళి వస్తుంటాడు. మరో మృతుడు వీరమాచనేని గౌతమ్ తల్లిదండ్రులు కూడా రోజువారీ కూలి పనులు చేసుకునేవారే. ఇందిరాకాలనీలో ని వాసం ఉండే మరో మృతుడు దేశపోగు నజీర్ తల్లిదం డ్రులు ప్రయివేటు కాలేజీలో వంట చేస్తుంటారు. వీరు ముగ్గురు స్నేహితులు కావటంతో స్కూటీపై సరదాగా పొలాలు వైపు వెళ్ళినట్లు తెలుస్తుంది.



రోదిస్తున్న బాలాజి కుటుంబసభ్యులు

స్కూటీతో సహా ముగ్గురు విద్యార్థులు సజీవదహనం

పునుగోడు ఎస్టీ కాలనీలోని మెటల్ రోడ్డు ముగ్గురు స్నేహితులకు మృత్యుమార్గంగా మారింది. మృతుల్లో బాలాజి స్కూటీ నడుపుతుండగా నజీర్, గౌతమ్‌లు సరదాగా మాట్లాడుకుంటూ వెళ్తున్నారు. ఇంతలో మృత్యువు విద్యుత్ వైరు రూపంలో అమాంతంగా వచ్చి పడింది. ఆ యువకులకు ఏం జరుగుతుందో గ్రహించే లోపే పెద్ద మంటలు చెలరేగి స్కూటీతో పాటు వారు మృత్యు ఒడిలోకి జారుకున్నారు. కళ్ళముందే ముగ్గురు ముక్కుపచ్చలారని యువకులు మంటల్లో సజీవ దహనమవుతుంటే రక్షించే అవకాశంలేక స్థానికులు హాహాకారాలు పెడుతూ బోరున విలపించారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యం మూడు నిండు ప్రాణాలను బలిగొంది. హెచ్‌టీ లైను వెళ్ళే స్తంభానికి మూడు ఇండక్టర్ ఇన్సులేటర్‌కు అడుగు భాగాన బోల్టు బిగించకుండా ఉంది. మంగళవారం ఉదయం నుంచి ఈదురుగాలులు వీస్తున్నాయి. దీంతో పింగాణి ఇండక్టర్ ఇన్సులేటర్ ఈదురుగాలులకు పైకి లేచిన క్రమంలో వైరు మధ్యలోకి తెగిపోయింది. ఈవైరు స్కూటీపై వెళుతున్న విద్యార్థులపై పడటంతో ప్రమాదం చోటు చేసుకుంది. హెచ్‌టీ లైను కోసం వైరు వేసిన తర్వాత జంపింగ్ చెక్ చేసుకోవాల్సిన అధికారులు నిర లక్ష్యం వహించారు. విద్యుత్ లైను ఏర్పాటుచేసే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కూడా ఈ ఘటనకు కారణంగా తెలుస్తుంది.

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర దిగ్భ్రాంతి

విద్యుత్ షాక్‌తో ముగ్గురు విద్యార్థులు దుర్మరణం పాలవటం పట్ల ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అమరావతిలో ఉన్న ఎమ్మెల్యే ఈ విషయాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ద్వారా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళారు. వెంటనే వారి కుటుంబాలకు అండగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్‌లను ఆదేశించారు. ఘటనపై పూర్తి విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందజేసి అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

- మంత్రి గొట్టిపాటి రవికుమార్

కనిగిరి మండలం పునుగోడులో విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన ముగ్గురు యువకుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున పరిహారం అందించి, అన్నివిధాలా అండగా ఉంటామని విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు. ముగ్గురు మృతి చెందడం పట్ల రవికుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన తనను కలిసివేసిందన్నారు. సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్య లు చేపట్టాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

మృతుల కుటుంబాలకు విద్యుత్‌శాఖ నుంచి ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని డీఈఈ ఆర్.ఉమాకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పునుగోడు గ్రామ ఎస్టీకాలనీ వద్ద కనిగిరి పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు విద్యుత్ వైరు పడి మృతి చెందటం బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటనలో విద్యుత్‌శాఖ పొరపాటు లేదని తెలిపారు. విపరీతంగా వీస్తున్న ఈదురు గాలులతో 11కేవీ పునుగోడు ఫీడర్‌లో విద్యుత్ కండక్టర్ వైరు రాపిడికి గురై లైను తెగిపడినట్లు పేర్కొన్నారు. కండక్టర్ వైరు నేలకు తాకకపోవటం వల్ల పునుగోడు సబ్‌స్టేషన్‌లో ఫీడర్ ట్రిప్ కాలేదని తెలిపారు.

అదే సమయంలో బైకుపై వెళుతున్న ముగ్గురు విద్యార్థులను వ్రేలాడే 11కేవీ సప్లయి వైరు తగలడంతో ప్రమాదం చోటుచేసుకుందని పేర్కొన్నారు.

ప్రజలందరికీ స్వచ్ఛమైన మంచినీరు అందించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

దర్శి, జూలై 23: ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. దర్శి పట్టణ సమీపంలోని ఎస్ఏపీ మంచినీటి చెరువును టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. తాగునీటి అవసరాల కోసం సాగర్ జలాలు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఎస్ఏపీ చెరువుకు నీరు పంపింగ్ చేస్తున్న మోటార్లను పరిశీలించారు. అనంతరం మోటార్ల ద్వారా పంపింగ్ చేసిన నీరు ఎస్ఏపీ చెరువులోకి ఎంతమేరకు చేరుతుందనే విషయాన్ని పరిశీలించారు. ఎస్ఏపీ చెరువులో నిల్వ ఉన్న నీటి పరిమాణంను తనిఖీ చేశారు. అనంతరం ఆర్ఎస్ఎఫ్ ఫిల్టర్ బెడ్లు పరిశీలించారు. గతంలో నిర్మించిన మ్యానువల్ ఫిల్టర్‌బెడ్లను తనిఖీ చేశారు. ఎంతోకాలంగా మ్యానువల్ ఫిల్టర్‌బెడ్లు మూలనపడిన విషయానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ షేక్ మర్ధన్‌ఆలీ వీటి దుస్థితి గురించి వివరించారు. గత 40 సంవత్సరాల క్రితం నిర్మించినవి కాలం చెల్లిపోవటంతో పనిచేయటం లేదన్నారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలంటే సుమారు రూ.2 కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. వీటికి బదులుగా మరో ఆర్ఎస్ఎఫ్ ఫిల్టర్‌బెడ్లు నిర్మిస్తే భావితరాలకు స్వచ్ఛమైన నీరు ఎక్కువ కాలం అందించవచ్చునని తెలిపారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ఎస్ఏపీ చెరువును 40 సంవత్సరాల క్రితం నిర్మించినందున పూడిపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందన్నారు. దీంతో అన్నిగ్రామాలకు సక్రమంగా మంచినీరు అందించలేకపోతున్నారని తెలిపారు. స్కీమ్ పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు. ప్రజలందరికీ పూర్తిస్థాయిలో తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.



సాగర్ కాలువలను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తదితరులు



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

సాగర్ కాలువల పరిశీలన

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, తదితరులు సాగర్ కాలువలో నీటి పంపిణీ పరిశీలించారు. ఓబీసీ హెడ్ వద్ద సరఫరా అవుతున్న నీటిని మీటర్ రీడింగ్‌ను తనిఖీ చేశారు. ఇదేక్రమంలో ఎన్నిరోజులు నీరు విడుదలయితే మంచినీటి చెరువులు నిండుతాయని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం విడు దలవుతున్న నీరు పది రోజులకు పైగా వస్తుందని, చాలావరకు చెరు వులకు నీరు నింపే అవకాశం ఉంటుందని ఇరిగేషన్ ఎస్సీ మురళీమోహన్ వివరించారు. సాగర్ జలాలు దుర్వినియోగం కాకుండా మంచినీటి చెరువులకు నీరు నింపాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం దర్శి నగర పంచాయతీ కార్యాలయం భవన నిర్మాణం కోసం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఆవరణలోని ఖాళీ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్, ఇరిగేషన్ ఈఈ పూర్ణచంద్రారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామి, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో హనుమంతరావు, డిప్యూటీ తహసీల్దార్ ఏ.రవిశంకర్, నగర పంచాయతీ కమిషనర్ మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపు ఆకస్మిక తనిఖీ

మండలంలోని గణేశ్వరపురం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మెడికల్ క్యాంప్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్యాన్ని అడిగి తెలుసుకున్నారు. సరఫరా చేస్తున్న మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నిసార్లు ఫీవర్ సర్వే చేశారని ఏఎన్ఎంలను ప్రశ్నించారు. ఎన్ని కేసులు నమోదయ్యాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడికి వైద్యానికి వచ్చిన బంకా కోటమ్మ, వెంకమ్మ తదితర మహిళలతో వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. మందులు సక్రమంగా ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్

దర్శి, జూలై 23: కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. దర్శిలో మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్ల నిధులు మంజూరు చేయటం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన చట్టానికి అనుగుణంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కేటాయింపు, విశాఖ, చెన్నై పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు ప్రత్యేక సహాయం చేయటం ఆనందదాయకమన్నారు. అదేవిధంగా పలు జాతీయ రహదారుల అభివృద్ధికి నిధులు విడుదల చేయటం సంతోషకరమన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనుల్లో ముందుకు సాగుతున్నాయన్నారు. గత ఐదేళ్ళ వైసీపీ అసమర్థ పాలనతో రాష్ట్రం అన్నివిధాల నష్టపోయిందన్నారు. ఎలాంటి అభివృద్ధి లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల సారథ్యంలో కూటమి ప్రభుత్వం కేంద్రం సహకారంతో వడివడిగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు. భవిష్యత్తులో కేంద్రం మరింతగా సహాయం అందించి రాష్ట్రాభివృద్ధికి సహకారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళల నిరసన

కనిగిరి, జూలై 23: మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పట్టణ సమీపంలోని పొదిలి రోడ్డుపై బిందెలు పెట్టి మహిళలు నిరసన వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా నీటిని సరఫరా చేయటం లేదని దేవాంగనగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న నీటిని సరఫరా చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు అడ్డంగా తుంగ మొద్దులు, బిందెలు పెట్టి రాస్తారోకో చేపట్టారు. నీటిని సరఫరా చేస్తామని మున్సిపల్ అధికారులు నచ్చచెప్పటంతో నిరసన విరమించారు.

నాణ్యమైన ఎరువులను విక్రయించాలి

తాళ్లూరు, జూలై 23: రైతాంగానికి నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులను విక్రయించాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు తెలిపారు. మంగళవారం తూర్పుగంగవరంలోని ఎరువుల, పురుగుల మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాలు తరుచూ తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దొంగల హల్‌చల్

దొనకొండ, జూలై 23: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల దొంగలు తరచూ తాళాలు పగులకొట్టి వస్తువులు ధ్వంసం చేస్తూ హల్‌చల్ చేస్తున్నారు. దీంతో కళాశాల సిబ్బంది ఎటువంటి విలువైన వస్తువులు చోరీకి గురవుతాయోనని భయాందోళనలు చెందుతున్నారు. మూడు రోజుల క్రితం కాలేజీ ఆవరణలో నూతనంగా నిర్మించిన టాయిలెట్స్ తాళాలు పగులకొట్టి లోపల ఏర్పాటుచేసిన వాష్ బేషన్లను ధ్వంసం చేశారు. సోమవారం రాత్రి కళాశాల ఆఫీస్, తరగతి గదుల తాళాలు పగులకొట్టారు. ఉదయం కళాశాలకు వచ్చిన సిబ్బంది తాళాలు పగులకొట్టి ఉండటం చూసి ఆందోళనకు గురై లోపలకు వెళ్లి పరిశీలించగా ఎటువంటి వస్తువులు చోరీకి గురికాకపోవటం గుర్తించి ఊపిరిపీల్చుకున్నారు. ఇందుకుసంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రిన్సిపాల్ ఫిర్యాదుచేశారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు

పీసీపల్లి, జూలై 23: కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నట్టు ఏఈవో పుల్లయ్య అన్నారు. మంగళవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి కౌలు రైతులను గుర్తిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో రసూల్, వీఏఏ మనోహర్, టీడీపీ నాయకులు వేమూరి రామయ్య, వీరపనేని పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలి

పామూరు, జూలై 23: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు హెచ్ఎం ఎం.రామస్వామి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థుల ఎత్తు, బరువులను కొలిచే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై దృష్టి సారిస్తారని చెప్పారు.

సబ్సిడీపై కంది, వరి విత్తనాలు

దొనకొండ, జూలై 23: మండలానికి మొదటి విడతగా 130 క్వింటాళ్ల విత్తనాలు మంజూరైనట్లు ఏవో లక్ష్మీనారాయణ తెలిపారు. ఇందులో కందులు 50 క్వింటాళ్లు, వడ్లు బీపీటీ 5204 రకం 80 క్వింటాళ్లు ఉన్నాయన్నారు. ఈఏడాది 30 శాతం సబ్సిడీపై కంది విత్తనాలను, కేజీ వరి విత్తనాలకు రూ.5 చొప్పున సబ్సిడీపై సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఒక్కో రైతుకు ఐదు ఎకరాల వరకు ఇస్తారని తెలిపారు. కంది విత్తనాలు 4 కేజీల ప్యాకెట్ పూర్తి ధర రూ.560 కాగా సబ్సిడీ రూ.168 పోను రైతు వాటాగా రూ.392 చెల్లించాలన్నారు. వరి విత్తనాల ప్యాకెట్ 25 కేజీ ఒక్కింటికి పూర్తి ధర రూ.1045 కాగా రూ.125 సబ్సిడీ పోను రూ.920 చెల్లించా లన్నారు.

రైతులు ముందుగా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు నకళ్ళతో గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకొని రైతు వాటా చెల్లించాలన్నారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ముండ్లమూరు, జూలై 23: మండలంలో పెదఉల్లగల్లు, వేముల, సింగనపాలెం గ్రామ సచివాలయాల్లో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఆర్.జనార్దన్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఆధార్ కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

‘తాగునీటి చెరువులు నింపాలి’

కురిచేడు, జూలై 23: మండలంలోని మంచినీటి చెరువులను సాగర్ నీటితో వెంటనే నింపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కురిచేడు పక్కనే ఉన్న దర్శి బ్రాంచి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలించి నీటి ప్రవాహం ఎంత ఉందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్నెస్పీ అధికారులతో మాట్లాడారు. రామతీర్థం రిజర్వాయర్‌తో పాటు జిల్లాలోని మంచినీటి చెరువులను వెంటనే నింపి జిల్లా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని కోరారు. జిల్లాకు నాగార్జున సాగర్ నుంచి 1.9 టీఎంసీలు మాత్రమే కేటాయించారని, అందుకు తగినట్లు చెరువులు నింపే పని పూర్తిచేయాలన్నారు.


కురిచేడు మండలంలో నాన్ నోటిఫైడ్ చెరువులు ఉన్నాయని, వాటిని సాగర్ నీటితో నింపాలని కలెక్టర్‌ను మండలవాసులు కోరారు. కురిచేడులోని చిన్న చెరువు, పెద్ద చెరువులను నింపితే గ్రామస్థుల తాగునీటి అవసరాలు నింపిన వారవుతారని ప్రజాప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. అలాగే, మండలంలో పొట్లపాడు, బోదనంపాడు, దేకనకొండ, ఆవులమంద చెరువులను కూడా సాగర్ నీటితో నింపాలని ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ కలెక్టర్‌ను కోరారు. తనకు తెలియకుండా తన కుటుంబ సభ్యులు తన భూమిని లాక్కున్నారని ఓ రైతు కలెక్టర్‌ను కోరారు. ఆవిషయాన్ని పరిశీలించాలని తహసీల్దార్‌కు సూచించారు.

ఆమె వెంట ఎన్నెస్పీ ఎస్ఈ నాగమురళి, ఈఈ పూర్ణచంద్రరావు, డీఈఈ విజయలక్ష్మి, ఆర్డీవో ఇర్విన్, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో సీతారామయ్య, ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, జడ్పీటీసీ వెంకటనాగిరెడ్డి, సర్పంచ్ కేసనపల్లి క్రిష్ణయ్య ఉన్నారు.

విద్యుత్ పరికరాల చోరీలకు పాల్పడుతున్నవారిపై నిఘా

- ప్రత్యేక టీమ్‌ల ఏర్పాటు
- ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ బీటీ నాయక్

తాళ్లూరు, జూలై 23 : ఇటీవల విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి విద్యుత్ పరికరాలను అపహరిస్తున్న దుండగులను పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటుచేసినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ బీటీ నాయక్, ఈఈ అబ్దుల్ కరీమ్ తెలిపారు. మూడు రోజుల క్రితం తురకపాలెం పొలాల్లో దుండగులు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి పరికాలను చోరీ చేశారు. సంఘటనా స్థలాన్ని మంగళవారం వారు పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ట్రాన్స్‌కో చీఫ్ విజిలెన్స్ అధికారి లావణ్యక్ష్మి ఆదేశానుసారం ఒంగోలు ట్రాన్స్‌కో ఎస్ఈ ఆపరేషన్ సత్యనారాయణ పర్యవేక్షణలో దుండగులను గుర్తించేందుకు ప్రత్యేక టీమ్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఇటీవల కాలంతో తరుచుగా తాళ్లూరు, ముండ్లమూరు, అద్దంకి, బల్లికురవ, జె.పంగులూరు మండలాల్లో విద్యుత్తు పరికరాల చోరీలు అధికంగా జరుగుతున్నాయన్నారు. తాళ్లూరులో 28, ముండ్లమూరులో 38 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి పరికరాలను చోరీ చేశారన్నారు. గతంలో చోరీలకు పాల్పడ్డ పాత నేరస్తులపై నిఘా ఉంచినట్టు చెప్పారు. గ్రామాల్లో కొత్తగా సంచరిస్తున్న వ్యక్తులపై కూడా నిఘా పెడుతున్నామన్నారు. పాతవస్తువుల కింద విద్యుత్తు పరికరాలను కొనుగోలు, అమ్మేవారివారి పట్ల కూడా అప్రమత్తంగా ఉన్నామన్నారు. ఎవరైనా విద్యుత్తు పరికరాలను పాత వస్తువుల కింద అమ్ముతుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.



ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఈఈ కరీమ్, ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ బీటీ నాయక్

కార్యక్రమంలో ఏడీ కె.పిచ్చయ్య, ఏఈ ఎస్.వీరబ్రహ్మం, ఎస్సై మోహన్‌రావు, ఎల్ఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి

పీసీపల్లి, జూలై 23: ఉపాధి కూలీలకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో బకాయిపడ్డ 12వారాల బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు .అనంతరం ఉపాధి కూలీల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో సుబ్బారావుకు అందజేశారు. కార్యక్రమంలో జనార్దన్, బాలయ్య స్టీఫెన్, మార్కండేయులు, సూర్యనారాయణ, యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులపై హర్షం

పీసీపల్లి, జూలై 23: రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.15వేల కోట్లు ప్రత్యేక ఆర్థిక సహాయం కేటాయింపులపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని పెదయిర్లపాడులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆపార్టీ మండల అధ్యక్షుడు దగ్గుమాటి బలరాంరెడ్డి అధ్యక్షత వహించారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రమణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలైన రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అమరావతి అభివృద్ధితో పాటు పోలవరం నిర్మాణానికి నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ పామూరు మండల అధ్యక్షుడు చినసుబ్బయ్య, కనిగిరి అర్బన్ ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, బి.వెంకటసుబ్బారెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి అధిక నిధులు కేటాయింపు

పామూరు, జూలై 23: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అత్యధిక నిధులు కేటాయించడం పట్ల బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు, పోలవరం నిర్మానానికి కావాల్సిన నిధులు కేటాయించడంపట్ల ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక శాఖమంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు జె.చినసుబ్బయ్య, ఉమ్మడి శ్రీను, చామల శ్రీనివాసులురెడ్డి, బి.గణేష్, డి.వెంకటచరణ్ పాల్గొన్నారు.







అమరావతికి.. అందలం

వెలుగులు.. ఆదాయం



పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన స్కీమ్ కూడా పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు చేకూర్చనుంది. దాదాపు గా నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ని ఈ పథకం ద్వారా పొందవచ్చు. ఇందుకోసం ఏర్పాటు చేసే సోలార్ ప్యానెల్స్ యూనిట్‌కి అయ్యే ఖర్చులో రూ.60 వేల వరకు సబ్సిడీ, మిగతా రూ.లక్ష రుణం రూపంలో సమకూరుస్తారు. వినియోగదారుడు వినియోగించగా మిగిలే విద్యుత్‌ని విద్యుత్ సంస్థలు కొనుగోలు చేస్తాయి.

ఆక్వాకి.. అండ

బాపట్ల జిల్లాలోని ప్రధాన రంగాల్లో ఆక్వా ప్రముఖం గా ఉంది. దాదాపు 22,000 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రంగం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంది. ఈ పరిస్థితుల్లో ఈ రంగానికి అండగా కేంద్ర బడ్జెట్‌లో ప్రకటనలు వెలువడ్డాయి. ముఖ్యంగా రొయ్యలు, చేపల మేతపై



పన్నును 5 శాతానికి తగ్గించారు. దీని వల్ల మేత రేటు తగ్గి పెట్టుబడి ఖర్చుల్లో భారీ తేడా వస్తుంది. తద్వారా ఆక్వారంగం పునర్ వైభవం సాధించడానికి ఇది ఉపయోగపడుతుందనేది రైతుల మాట. రొయ్యల సాగు కేంద్రాల నెట్‌వర్క్‌లు ఏర్పాటుకి ప్రత్యేక ఆర్థిక సాయం అందించడంతో పాటు నాబార్డ్ ద్వారా దీనిని ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించింది. మొత్తం మీద కేంద్రం ఆక్వా రంగ అభివృద్ధికి ప్రత్యేక విధానాన్ని తీసుకురావడంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మోదీ 3.0 బడ్జెట్ అమరావతి బాట పట్టింది. గత ఐదేళ్లు వైసీపీ పాలనలో ఊసే లేకుండా పోయిన నవ్యాంధ్ర రాజధాని అమరావతి బాధ్యత మాదంటూ కేంద్రం బడ్జెట్‌లో భరోసా ఇచ్చింది. నిర్మలా సీతారామన్ తన బడ్జెట్‌లో అమరావతికి ప్రత్యేకంగా నిధులు కేటాయించడంపై అటు రాష్ట్రప్రజలతో పాటు అమరావతి వాసులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. అటు తరతరాల నుంచి ఉన్న భూములను అమరావతి కోసం ఇచ్చి జగన్ నిర్లక్ష్యం తో రోడ్డెక్కిన రాజధాని రైతులకు భరోసా ఇస్తూ కూటమి ప్రభు త్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ఉమ్మడి గుంటూరు జిల్లావాసుల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ అమరావతికి ప్రాధాన్యం ఇవ్వడంపై అన్ని వర్గాల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమ వుతున్నాయి. ప్రత్యేకంగా నిధులతో పాటు రాజధాని కార్యకలా పాలకు అండగా ఉంటామన్న కేంద్రం ప్రకటనతో ఇక అమరావతి అభివృద్ధికి ఢోకా ఉండదని తెలుస్తోంది. కాగా అమరావతికి ప్రత్యేక కేటాయింపులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేటు సంస్థలు అమరావతికి క్యూ కట్టనున్నాయి. దీంతో అమరావతి దశ తిరిగిపోయినట్లే.

- కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం
- పరుగులు పెట్టనున్న నవ నగర నిర్మాణాలు
- నిధుల కేటాయింపుతో రాజధాని దశ తిరిగినట్లే
- రూ.15 వేల కోట్ల కేటాయింపుపై రైతుల్లో హర్షం
- కష్టాలు తీరిపోయాయన్న ఆనందంలో రైతులు

గుంటూరు, బాపట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకూ అమరావతి అంటే ఆగిపోయిన భవనాలు, అడవిలా మారిన గ్రామాలు, ఆవేదనా భరితమైన రైతులు. కానీ నేడు అది పూర్తిగా మారిపోయింది. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడంతో అమరావతి తలరాత మారిపోయింది. నవ్యాంధ్ర రాజధాని అమరావతి ఇక దేదీప్యమానంగా వెలగబోతోందని మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ ద్వారా తెలుస్తోంది. గడిచిన పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వం రాజధాని అమరావతికి కేంద్ర బడ్జెట్లో స్థానం కల్పించింది. రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.15 వేల కోట్లు సహాయాన్ని ప్రకటించింది. అమరావతి నిర్మాణ అవసరాల రీత్యా భవిష్యత్తులో మరింత సహాయం అందిస్తామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంగా పార్లమెంటులో ప్రకటించారు. అమరావతి అభివృద్ధికి సంబంధించి నిధులు సేకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతిచ్చింది. జాతీయ, అంతర్జాతీయ ఫైనాన్సు సంస్థల ద్వారా రుణాలు సేకరించుకునేందుకు అవకాశం కూడా కల్పించింది. దీంతో అమరావతి నిర్మాణానికి ఇక ఎలాంటి ఢోకా లేదని తేలిపోయింది.

కుట్రలకు ముగింపు

2014 నుంచి 2019 వరకూ రాజధాని అమరావతి నిర్మాణం పరుగులు పెట్టింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ అమరావతిని విధ్వంసం చేసేందుకు ప్రయత్నించింది. మూడు రాజధానులను తెరమీదకు తెచ్చి అమరావతిని విచ్ఛిన్నం చేయడంతో పాటు, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో అమరావతికి స్థానం కల్పించడం, బడ్జెట్ నిధులు కేటాయించడంతో ఆ కుట్రలకు తెరపడినట్లయింది. ఆంధ్రుల రాజధాని అమరావతేనని కేంద్రం విస్పష్టంగా చెప్పినట్లయింది. దీంతో అమరావతిని భవిష్యత్తులో ఎవరూ కదిలించలేరని సందేశమిచ్చింది. కాగా కేంద్రం కేటాయించిన నిధులతో అమరావతిలోని ప్రభుత్వ భవనాల నిర్మాణాలన్నీ నిధుల కొరత లేకుండా పూర్తైపోనున్నాయి.

మౌలికంగా ఊరట

కేంద్రం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజల్లో భరోసా నింపింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలతో పాటు పట్టణాల్లోనూ మౌలిక వసతులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. వీటన్నింటికి మరమ్మతులు చేసేలా కేంద్రం బడ్జెట్‌లో వాటికి ప్రాధాన్యం ఇచ్చింది. గడచిన ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దారుణంగా ఛిద్రమైన రహదారులు బాగుపడనున్నాయి. కేంద్రం నుంచి వచ్చే మ్యాచింగ్ గ్రాంట్ల మొత్తం పెరగనుండటంతో రోడ్లకు మహర్దశ కలగనుంది. యువతకు విద్యారుణాలతో పాటు ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇది కూడా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని యువతకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూర్చేదే కావడం గమనార్హం. గ్రామీణాభివృద్ధికి పెద్ద మొత్తంలో కేటాయింపులు జరపడం, ఎంఎస్ఎంఈలకు క్రెడిట్ గ్యారంటీలాంటి వన్నీ ఉమ్మడి గుంటూరు జిల్లా అభివృద్ధికి దోహదం చేసేవిగా ఉన్నాయి. విద్య, నైపుణ్యాభివృద్ధికి కేటాయింపులతో పాటు ఉపాధి కల్పన విషయంలోనూ ప్రత్యేక ప్రణాళికలను కేంద్రం ప్రకటించడం జిల్లాలోని యువతరానికి ఆశలు రేకెత్తించేవిగానే ఉన్నాయి. రూ.3 లక్షల వార్షికాదాయం లోపు ఉన్న వారికి ఎలాంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేకుండా పన్ను రేట్ల శ్లాబులను సవరించడంపై ఉద్యోగ, వ్యాపారవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు పెంచినందున గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు పెద్ద ఎత్తున పనులు లభించనున్నాయి. ప్రకృతి వ్యవసాయం కింద భారీగా రైతులకు ప్రోత్సాహకాలు అందనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు భాగాస్వామ్యంతో పట్టణ ప్రాంతాల్లో అద్దె ఇళ్లను నిర్మించి ఇక్కడికి వచ్చే వలస కూలీలకు ఆవాసం కల్పించేందుకు కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తమౌతున్నది.

సొంతింటి కల సాకారం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల సొంత ఇంటి కలని సాకారం చేస్తామని కేంద్రం ప్రకటించింది. సొంతింటి నిర్మాణానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2.67 లక్షల వరకు సబ్సిడీగా అందించనుంది. పీఎంఏవై కింద ఈడబ్ల్యూఎస్, ఎల్‌ఐజీ, ఎంఐజీ-1, ఎంఐజీ-2 కేటిగిరీల కింద ఇళ్ల నిర్మాణాలకు కేంద్రం ఆర్థికసాయం అందించనున్నది. అలానే ఎఫోర్డబుల్ హౌసింగ్ ఇన్ పార్టనర్‌షిప్(ఏహెచ్‌పీ), బీఎల్‌సీ కింద నిర్మించే ఇళ్లకు కూడా ఆర్థికసాయం అందుతుంది. ఈ రెండు కేటిగిరీల కింద ఇళ్లు నిర్మించుకునే వారికి రూ.1.50 లక్షలను సబ్సిడీగా ఇస్తుంది. ఈడబ్ల్యూఎస్ కేటిగిరీ కింద సాయం పొందేవారి వార్షికాదాయం రూ.3 లక్షల లోపు, ఎల్‌ఐజీ గ్రూపు కుటుంబాలకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు, ఎంఐజీ-1 కింద రూ.6 లక్షల నుంచి రూ.12 లక్షల మధ్య, ఎంఐజీ-2 కింద రూ.12 లక్షల నుంచి రూ.18 లక్షల ఆదాయం పొందే వారికి పీఎంఏవై వర్తిస్తుంది. ఈ నేపథ్యంలో ఈడబ్ల్యూఎస్ కేటిగిరీ లబ్ధిదారులకు రూ.2.20 లక్షలు, ఎల్‌ఐజీ కుటుంబాలకు రూ.2.67 లక్షలు, ఎంఐజీ-1 వారికి రూ.2.35 లక్షలు, ఎంఐజీ-2 వారికి రూ.2.30 లక్షల సబ్సిడీ వస్తుంది. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో సొంత ఇళ్లని కొనుగోలు చేసే అవకాశం ఉన్నది. అపార్టుమెంట్లలో ఫ్లాట్లు కొనుగోలు చేసేవారికి కూడా ఈ స్కీమ్ కింద ఆర్థికసాయం అందుతుంది. ఈ పథకంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వేల కుటుంబాలకు లబ్ధి జరుగుతుందని భవన నిర్మాణ సంస్థలు చెబుతున్నాయి.

నిర్మాణాలు ఇక పరుగులు..

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అమరావతిలో పనులు ప్రారంభమయ్యాయి. తొలుత కంపచెట్ల తొలగింపుతో మొదలై మెల్లగా నిర్మాణ పనుల వైపుగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజధాని నిర్మాణం కోసం కేంద్రం నుంచి నిధులు తెచ్చుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ప్రత్యేకంగా కేటాయింపులతో పాటు వివిధ ఏజెన్సీల ద్వారా సాయం చేయనున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించడంతో అమరావతికి నిధుల కొరత కొంత మేర తీరినట్లయింది. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన అద్భుత భవనాలు పూర్తయ్యే వీలు కలిగింది. దీంతో 90 శాతం పూర్తయిన ఆలిండియా ఉద్యోగుల భవనాలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గృహ సముదాయాలు, గ్రూప్-4 ఉద్యోగుల భవన సముదాయాలు పూర్తవడానికి ఇక ఎంతో సమయం పట్టకపోవచ్చు. వాటితోపాటు మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాలు కూడా వేగంగా పూర్తవుతాయి. కాగా ఐకానిక్, సచివాలయ టవర్స్ అసెంబ్లీ భవనాల నిర్మాణం కూడా చకచకా సాగనున్నది.

ఇక.. ప్రకాశం



కేంద్ర ప్రకటించిన బడ్జెట్‌లో ఉమ్మడి ప్రకాశాన్ని వెనుకబడిన జిల్లాలో జాబితాలో చేర్చి ప్రత్యేకంగా ఆదుకుంటామని హామీ ఇచ్చింది. గతంలో ఉమ్మడి ప్రకాశంలో భాగంగా ఉండిన చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలు ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఉన్నాయి. కేంద్రం ప్రకటన వల్ల ఈ నియోజకవర్గాలకు నిధుల కేటాయింపులో సముచిత స్థానం దక్కనుంది. అదే విధంగా జిల్లాలోని వెనకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం కానున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాని వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చడం వెనక సీఎం చంద్రబాబు కృషి ఎంతో ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు ఇచ్చిన హామీని నెల వ్యవధిలోనే సీఎం హోదాలో కేంద్రం నుంచి రాబట్టడంపై మంత్రి గొట్టిపాటి ఆనందం వ్యక్తం చేశారు.

రైతుల కష్టాలు తీరినట్లే..

గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రాజధానికి భూములిచ్చిన రైతులను వేధించింది. వారికి ఏటా చెల్లించాల్సిన కౌలు కూడా చెల్లించలేదు. గడిచిన రెండేళ్లుగా రైతులకు ఇవ్వాల్సిన రూ.380 కోట్ల కౌలు చెల్లించకపోవడంతో రైతులు అప్పులపాలై అల్లాడుతున్నారు. పిల్లలచదువులకు ఫీజులు కూడా కట్టుకోలేని దయనీయ స్థితిలో చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం నుంచి నిధులు రావడంతో వారు ఇప్పుడు ఊపిరి పీల్చుకున్నారు. రాజధా నికి కేంద్ర నిధులు వస్తుండడంతో తమ కష్టాలు తీరనున్నాయని వారు ఆనందంలో ఉన్నారు.



కుట్రలకు తెర



అమరావతిపై గత ప్రభుత్వం చేసిన కుట్రలకు తాజా బడ్జెట్‌తో తెరపడింది. అమరావతిని కేంద్ర ప్రభుత్వం గుర్తించడమే కాకుండా, నిధులు కూడా కేటాయించింది. దీంతో రాష్ట్రానికి రాజధాని అమరావతేనని ఖాయమైపోయింది. ఇక ఏ ప్రభుత్వం వచ్చినా రాజధానిని మార్చడం అసంభవం. ఇక వారి కుట్రలకు కాలం చెల్లిపోయినట్లే. - లంకా సుధాకరరావు, రైతు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

మా ఆవేదనకు సమాధానం



ఐదేళ్ల మా ఆవేదనకు సమాధానం దొరికింది. కేంద్రం బడ్జెట్ కేటాయించడం ద్వారా తాము రైతుల పక్షాన ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఐదేళ్లు మేం పడిన కష్టాలు ఇక తీరిపోతాయని భావిస్తున్నాం. మాకు రావాల్సిన కౌలు బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.

- మాదాల పున్నయ్య, మందడం రైతు

అభివృద్ధికి ఢోకా లేదు



ఇప్పటి వరకూ గుర్తించని అమరావతికి ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించడం ఆనందంగా ఉంది. దీంతో రాజధాని నిర్మాణానికి ఎలాంటి ఢోకా ఉండదు.

- రామినేని చిన్నా, నెక్కల్లు రైతు.



అడ్మిషన్లు.. అదుర్స్

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 75 శాతం ఇంజనీరింగ్ సీట్ల భర్తీ
- పక్క రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ చేరికలకు ఈ ఏడాది పుల్‌స్టాప్



గుంటూరు(విద్య), జూలై 23: ఒకవైపు ఊపందుకోనున్న అమరావతి నిర్మాణాలు.. మరోవైపు విశాఖలో ఐటీ కారిడార్ ఏర్పాటుకు ఏర్పాట్లు.. ఇంకోవైపు భారత్ పెట్రోలియం ఆయిల్ రిఫైనరీ సంస్థ ఏర్పాటుకు సన్నాహాలు.. రాష్ట్రంలో విద్యుత్ వాహనాల కంపెనీలు పెట్టుబడులపై ఆసక్తి.. ఈ నేపథ్యంలో పెరగనున్న ఉద్యోగ అవకాశాలతో పాటు ఈ ఏడాది తొందరగా ప్రారంభమైన ప్రక్రియ తో ఇంజనీరింగ్ అడ్మిషన్లకు ఊపువచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గతానికి భిన్నంగా ఈ ఏడాది తొలి విడత కౌన్సెలింగ్‌లోనే కొన్ని కళాశాలల్లో 75 శాతానికిపైగా సీట్లు, మరికొన్ని కళాశాలల్లో నూరుశాతం సీట్లు భర్తీ అయినట్లు సమాచారం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం తీసుకుంటున్న సానుకూల నిర్ణయాలే ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి సానుకూల పరిస్థితులు నెలకొన్నాయి. ఒకప్పుడు లక్ష ర్యాంకు దాటిన వారే సివిల్, మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ బ్రాంచిల వైపు చూసే పరిస్థితి ఉండేది. అయితే ఈ ఏడాది 26 వేల నుంచి 75 వేల ర్యాంకులు వచ్చిన వారు కూడా ఆయా బ్రాంచీల్లో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇక కంప్యూటర్ ఆధారిత కోర్సుల్లో అయితే 2వేల ర్యాంకులు వచ్చిన వారి నుంచే ఏడాది చేరికలు ప్రారంభమయ్యాయి. తాజాగా ఇంజనీరింగ్ మొదటి, ద్వితీయ సంవత్సరాలు చదివే విద్యార్థులు తాము కోర్సులు పూర్తి చేసే సరికి రాష్ట్రంలో ఐటీ, కెమికల్, సివిల్, మెకానికల్ రంగాల్లో ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందనే భావనలో ఉన్నారు. విద్యుత్‌తో నడిచే వాహనాలు ద్విచక్ర, కార్లు తయారీకి రాష్ట్రంలో సానుకూల అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రా నిక్స్ రంగాల్లో ఉద్యోగాలు వస్తాయని ఇంజనీరింగ్ కళాశాలల యాజ మాన్యాలు చెబుతున్నాయి. ఇక భారత్ పెట్రోలియం వంటి సంస్థలు రాష్ట్రంలో రిఫైనరీ ఏర్పాటు చేస్తే వేల ఉద్యోగాలు వస్తాయి. ముడి ఆ యిల్ నుంచి పెట్రోల్, డిజిల్, ఇతర ఉప వస్తువుల తయారీలో కెమి కల్ ఇంజనీర్లదే కీలక భూమిక. అంతేకాకుండా రిఫైనరీ ఏర్పాటుతో మె కానికల్, ఐటీ బ్రాంచీల్లో ఉద్యోగాలు వస్తాయని అంచనా వేస్తున్నారు.

సివిల్ ఇంజనీర్లకు భారీ డిమాండ్..

నిర్మాణ రంగంలో కీలకమైన సివిల్ ఇంజనీర్లుకు త్వరలో భారీ డిమాండ్ ఏర్పడనుంది. అమరావతి రాజధానికి నిర్మాణాలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. రాజధానిలో నిర్మాణాలు ఒక కొలిక్కి వచ్చి వేగం పుంజుకోవడానికి కనీసం ఏడాది సమయం పడుతుంది. గతంలో ప్రతిపాదించిన అనేక ప్రాజెక్టులు పట్టాలెక్కితే రాజధాని ప్రాంతంలో సివిల్ ఇంజనీర్లకు భారీ డిమాండ్ ఏర్పడనున్నది. మరోవైపు రాజధాని నిర్మాణాలతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగంలో నిర్మాణాలు వేగం పుంజుకోనున్నాయి. ఫలితంగా సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని బిల్డర్లు చెబుతున్నారు. దీంతో ఈ ఏడాది సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచీల్లో దాదాపు సీట్లు మొత్తం భర్తీ అయ్యే పరిస్థితి నెలకొంది.

సమీకృత కలెక్టరేట్‌కి స్థలాన్వేషణ

కర్లపాలెం, మూలపాలెం, ప్యాడిసన్‌పేటలో భూముల పరిశీలన

బాపట్ల, జూలై 23: బాపట్ల జిల్లాకు సంబంధించి సమీకృత కలెక్టరేట్ భవనానికి అవసరమైన స్థలాన్ని కలెక్టర్ జె.వెంకటమురళి మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్ పరిధిలోని భూమికి సంబంధించిన దస్త్రాలు, మ్యాప్‌లను కలెక్టర్ పరిశీలించారు. తదుపరి కర్లపాలెంలోని సత్యవతిపేటలో ఖాళీగా ఉన్న తాటితోపు భూమిని పరిశీలించారు. అనంతరం మూలపాలెం పంచాయతీపరిధిలోని మెడికల్ కళాశాల భవనం వద్ద ఉన్న భూమిని, ప్యాడిసన్‌పేటలో ఖాళీగా ఉన్న 54.16 ఎకరాల ప్రభుత్వ భూమి పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ఆర్డీవో గంధం రవీందర్, సర్వే అధికారులు పాల్గొన్నారు.



సమీకృత కలెక్టరేట్‌కి అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

ఆక్వా పార్కుకు భూముల పరిశీలన

రేపల్లె, జూలై 23: ఆక్వాపార్కు నిర్మాణానికి స్థలసేకరణ కోసం భూములను పరిశీలించినట్లు జేసీ సుబ్బారావు తెలిపారు. మంగళవారం నిజాంపట్నం, దిండి పరిసర ప్రాంత గ్రామాల్లో ఆయన పర్య టించి భూములను పరిశీలించారు. త్వరితగతిన స్థల సేకరణ కోసం చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఇప్పటికే ప్రభుత్వం నిధులు కేటాయించిందని, 192 ఎకరాల భూసేకరణ పూర్తి చేస్తే ఆక్వాపార్కు నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. భూ సేకరణ ఎంత తొందరగా జరిగితే పార్కు నిర్మాణ పనులను అంత తొందరగా ప్రారంభించవచ్చన్నారు. రైతులతో మాట్లాడాలని, ఇబ్బందులు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే స్వయంగా వారితో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హేలా షారోన్, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన జాబితాలో ప్రకాశం

కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన కేంద్రం

సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన మంత్రులు, ఎమ్మెల్యేలు

మౌలిక రంగాలకు కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యం

ఆ మేర జిల్లాకు నిధులొచ్చే అవకాశం

ఆశించిన ఊరట దక్కలేదని వేతనజీవుల నిరాశ

జిల్లాకు కాస్తంత ఊరట. జిల్లావాసులు రాష్ట్ర విభజన నాటి నుంచి ఎదురుచూస్తున్న వెనకబడిన జిల్లా కల ఎట్టకేలకు నెరవేరింది. వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం చేరింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. పార్లమెంట్‌లో మంగళవారం కేంద్రప్రభుత్వ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఏపీలోని ఏడు జిల్లాలతోపాటు ప్రకాశంను కూడా వెనకబడిన జిల్లాగా ఆమె వెల్లడించారు. దానివల్ల జిల్లాకు ప్రత్యేకంగా నిధులు రానున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి వల్లే ఇదంతా సాధ్యమైంది. దీంతో జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు అమరావతిలో ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వెనకబడిన జిల్లా ప్రకటనపై జిల్లాలోని రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఒంగోలు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లా ప్రజలకు కాస్తంత ఊరట లభించింది. రాష్ట్రంలో కేంద్రం గుర్తించిన వెనుకబడిన ప్రాంతాలలో ఉమ్మడి జిల్లాకు స్థానం దక్కింది. ఆ మేరకు ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం విభజన చట్టలలో భాగంగా ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు జిల్లాలను వెనుకబడిన ప్రాంతాలుగా కేంద్రం ప్రకటించి వాటి అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇచ్చింది. అయితే రాయలసీమలోని నాటి నాలుగు, ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలను వెనుకబడిన ప్రాంతాలుగా ప్రకటించిన కేంద్రం వాటి తరహాలోనే ఒక రకంగా పలు ఇతర జిల్లాల కన్నా ఇంకా ఎక్కువ వెనుకబడిన ప్రాంతంగా ఉన్న మన జిల్లాను మాత్రం అందులో చేర్చలేదు. ఈ విషయాన్ని జిల్లాకు చెందిన నాటి టీడీపీ ప్రజాప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకవెళ్లారు. తదనుగుణంగా కేంద్రానికి సిఫార్సు చేసినా అప్పట్లో అనుమతి రాకపోగా అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం అసలు ఆ ఊసే పట్టించుకోలేదు.

సీఎం కలిసిన జిల్లా ఎమ్మెల్యేలు

ఉమ్మడి జిల్లా ప్రజల దశాబ్దకాల డిమాండ్ అయిన వెనుకబడిన ప్రాంతాల జాబితాలో జిల్లా చేర్పు, ప్రత్యేక నిధుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపి కేంద్రం ప్రకటించేలా చేయడంపై ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, బీఎన్.విజయకుమార్, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎంఎం.కొండయ్య, ఇంటూరి నాగేశ్వరరావులు బాబును కలిసి జిల్లాప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు అలాగే కేంద్రప్రభుత్వానికి కూడా వారు ధన్యవాదాలు తెలిపారు. ఇదిలాఉండగా పలు కీలకరంగాలకు ప్రాధాన్యతలు ఉన్నప్పటికి ఆదాయ పన్ను శ్లాబ్‌ల సవరణ, పన్ను మినహాయింపులలో ఆశించిన విధంగా కేంద్రం స్పందించలేదన్న నిరాశను వేతనజీవులు వ్యక్తం చేస్తున్నారు. కాగా కేంద్ర బడ్జెట్‌పై కూటమి పక్షాలు హర్షం వ్యక్తం చేస్తుండగా ఇతరపక్షాలు అంకెల గారడీగా అభివర్ణిస్తున్నాయి.

జిల్లాకు ప్రత్యేక నిధులు

ఈ ఏడాది ఎన్నికలలో తిరిగి టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీచేసి భారీ మెజార్టీతో గెలుపొందాయి. అలాగే కేంద్రప్రభుత్వం ఏర్పాటులో టీడీపీ కీలకమైంది. ఇదేసమయంలో రాష్ట్రానికి చెందిన అందులోభాగంగా జిల్లాకు సంబంధించిన అభివృద్ధి అంశాలు కేంద్రం దృష్టికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా తీసుకెళ్లారు. ఆ ప్రభావం మంగళవారం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కనిపించింది. రూ.38లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా మౌలిక రంగాలు, వ్యవసాయం, ఉపాధి కల్పనా, పరిశ్రమలు తదితర రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు. రైల్వేలు, హైవేలు, పోర్టులు, తాగునీరు విద్యుత్ గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ పథకం వంటి వాటికి భారీ నిధులు కేటాయించారు. అందులో భాగంగా రాష్ట్రానికి తదనుగుణంగా జిల్లాలో ఆయారంగాలకు నిధులు రానున్నాయి. రాష్ట్రానికి సంబంధించి ప్రత్యేకంగా అమరావతికి రూ.15వేల కోట్లు ఆర్థిక సాయం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వంటి కీలక అంశాలకు కేంద్రం ప్రాధాన్యత ఇచ్చింది. జిల్లాకు సంబంధించి ఆయా రంగాల వారీ వచ్చే నిధులతోపాటు వెనుకబడిన ప్రాంతాల జాబితాలో జిల్లాను చేర్చడం ద్వారా ప్రత్యేకంగా నిధులు వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారులు, నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టు ఇతర భాగస్వామ్య పథకాలకు వచ్చే నిధులతోపాటు ప్రత్యేకంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు కూడా రానున్నాయి.

కేంద్ర బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎంపీ

కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసింది. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.11.11 లక్షల కోట్లు, విద్య, నైపుణ్యాభివృద్ధికి రూ.1.48 లక్షల కోట్లు, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ.2.66 లక్షల కోట్లు, మహిళా అభివృద్ధికి రూ.3లక్షల కోట్లు, వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.1.52లక్షల కోట్లు కేటాయించింది. ఇలా అభివృద్ధితోపాటు సంక్షేమానికి పెద్దపీట వేయడం గొప్ప విషయం. బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలాసీతారామన్ ప్రకాశంను వెనుకబడిన జిల్లాల్లో చేర్చడం హర్షణీయం. అమరావతికి రూ.15వేల కోట్లు కేటాయింపు వల్ల రాజధాని నిర్మాణం వేగవంతమవుతుంది.

వెనకబడిన జిల్లాగా ప్రకటన హర్షణీయం

దామచర్ల జనార్దన్, ఒంగోలు ఎమ్మెల్యే

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అమరావతికి రూ.15వేలు కోట్లు కేటాయించడం, జిల్లాను వెనుకబడిన ప్రాంతంగా గుర్తించడం హర్షణీయం. రాష్ట్ర ప్రజలు కేంద్రప్రభుత్వానికి రుణపడి ఉంటారు. కేంద్రం సముచిత ఆలోచనతో అన్నిరంగాలకు కేటాయింపులు చేసింది. రైతులు, యువత, చిరువ్యాపారులకు పెద్దపీట వేసిందన్నారు. ప్రకాశంను వెనుకబడిన జిల్లాల జాబితాలలో చేర్చుతామని గతంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఢిల్లీ పర్యటనలో ఈ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. బడ్జెట్‌లో జిల్లాకు ప్రాధాన్యం దక్కడం శుభసూచికం. జిల్లా అభివృద్ధికి కేంద్రతోడ్పాటు ఎంతో ఉపకరిస్తుంది. ప్రధాని మోదీకి జిల్లా తరఫున కృతజ్ఞతలు.

రాజధానికి నిధుల కేటాయింపును స్వాగతిస్తున్నాం

ఎం.ఎల్.నారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి

రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రబడ్జెట్‌లో రూ.15వేల కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం. గత ప్రభుత్వం మూడు రాజధానుల జపం చేయడంతో ఏదీ అభివృద్ధి కాకుండా పోయింది. పోలవరం నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.33వేల కోట్ల ప్యాకేజీకి నిధులు కేటాయించాలి. వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశంను చేర్చడం అభినందనీయం. అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తే తప్ప ఆయాప్రాంతాల అభివృద్ధికి అవకాశం లేదు.

బడ్జెట్‌లో ఏపీకి పెద్దపీట

పీవీ శివారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కేంద్రం బడ్జెట్‌లో మన రాష్ట్రానికి పెద్దపీట వేసింది. అమరావతికి రూ.15వేల కోట్ల నిధులు కేటాయించడం అభినందనీయం. రాజధాని నిర్మాణం కోసం ఒకేసారి పెద్దమొత్తంలో బడ్జెట్ కేటాయింపు చేయడంతో త్వరగా పూర్తిచేసేందుకు అవకాశం వచ్చింది. కేంద్రం సముచిత ఆలోచనతో అన్నిరంగాలకు బడ్జెట్‌ను కేటాయించింది రైతులు, యువత, చిరు వ్యాపారులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారికి కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది.

యువకుడిపై కత్తితో దాడి

ఎవరూ చూడకుండా బాధితుడిని కారులో అపహరించే ప్రయత్నం

స్థానికుల కేకలతో పరార్

దాడికి పాల్పడిన వారంతా పాత నేరస్తులే



హాస్పిటల్ ఆవరణలో అపస్మారక స్థితిలో తరుణ్ అనిల్

చీరాలటౌన్, జూలై 23 : తమతోపాటు నేరాలు చేసేందుకు రావాలని లేకుంటే నిన్ను చంపేస్తామని ఒక వ్యక్తి, ఇద్దరు స్త్రీలు అతి క్రూరంగా కత్తులతో దాడిచేసి పరారయ్యారు. ఈ సంఘటన మంగళవారం మధ్యాహ్నం చీరాల పరిధిలోని ఉజిలీపేటలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. రామనగర్‌కు చెందిన మానుపాటి సాయి, అతని తల్లి ఈశ్వరికి సాగరికతో పరిచయాలు ఉన్నాయి. వీరు ముగ్గురూ నేరాలకు పాల్పడతుండగా, వీరిపై ఇప్పటికే చీరాల పరిధిలో పలు కేసులు ఉన్నాయి. అలాగే చీరాల మండలం రామకృష్ణాపురానికి చెందిన గుంటూరు తరుణ్ అనిల్ బీటెక్ పూర్తి చేసి ఖాళీగా ఉన్నాడు. ఇతని తండ్రి అప్పారావు అనారోగ్యంతో చనిపోగా, తల్లి అంజన కుట్టు మిషన్‌తో కుటుంబాన్ని పోషిస్తుంది. ఈక్రమంలోనే తల్లి కుట్టిన వాటిని డెలివరీ చేసి కుమారుడు డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఈక్రమంలో ఇతనికి పై ముగ్గురు పరిచయమయ్యారు. ఈ నేపథ్యంలో ఇతనిని వారితో పాటు నేరాలు చేసేందుకు రావాలని చాలాసార్లు బెదిరింపులకు పాల్పడ్డారు. అందుకు తరుణ్ నిరాకరిస్తూ వచ్చాడు. దీంతో ఆగ్రహించిన ముగ్గురు అవకాశం కోసం ఎదురు చూస్తుండగా తరుణ్ డ్రెస్సులను డెలివరీ చేసేందుకు ఉజిలీపేట సచివాలయం వెనుకకు వచ్చాడు. విషయం తెలుసుకున్న ఆ ముగ్గురు చాకుతో ఒకరు, ఇటుక రాయితో ఒకరు, మద్యం సీసా పెంకుతో మరొకరు హఠాత్తుగా దాడికి తెగబడ్డారు. దీంతో తరుణ్ శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకోవడంతో అక్కడి నుంచి వారు పరారయ్యారు. 108లో తరుణ్‌ను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రస్తుతం బాధితుడి పరిస్థితి నిలకడగా ఉంది. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించే అవకాశాలు ఉన్నాయి.

అపహరించేందుకు యత్నించారు

దేవర లక్ష్మి, ప్రత్యక్ష సాక్షి



తరుణ్ అనిల్ తల్లి చాలాకాలంగా మాకు డ్రెస్సులు కుడుతోంది. ఈక్రమంలో వాటిని డెలివరీ చేసేందుకు తరుణ్ వచ్చాడు. దీంతో ఉద్దేశపూర్వకంగానే ముగ్గురు అతడిపై తీవ్రంగా దాడి చేశారు. ఎవరూ చూడకుండా కారులో ఎక్కించేందుకు లాక్కెళుతుండగా మేమంతా చూసి కేకలు వేశాం. దీంతో వారు పరారయ్యారు. లేకపోతే తరుణ్‌ను హతమార్చే వారు. పోలీసులు దీనిపై చర్యలు తీసుకోవాలి.

తీర ప్రాంతంలో అప్రమత్తంగా ఉండండి



పర్యాటకులతో మాట్లాడుతున్న ఎస్ఐ శివకుమార్

వాడరేవు(చీరాలటౌన్), జూలై 23 : సముద్రతీర ప్రాంతంలో ప్రమాదాలపై పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని ఈపూరుపాలెం ఎస్ఐ శివకుమార్ పేర్కొన్నారు. మంగళవారం వాడరేవులో సిబ్బందితో కలిసి పర్యటించారు. పర్యాటకులకు ప్రమాదాలపై సూచనలు చేశారు. నిర్దేశిత ప్రదేశాలలో మాత్రమే పర్యాటకులు స్నానాలు ఆచరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రమాదాలబారిన పడరాదని హెచ్చరించారు. ఆయనతోపాటు స్టేషన్, మెరైన్ సిబ్బంది ఉన్నారు.

31న రాష్ట్ర స్థాయి ఎడ్ల పందాలు

చినగంజాం, జూలై 23 : పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామంలో అవనిగడ్డ వారి ఇలవేల్పు పల్నాటి ఈర్లంకమ్మ అమ్మవారి 16వ రోజు పండుగ సందర్భంగా రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఒంగోలు నాటు పోలు రాధ ఎడ్ల పందాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. గ్రామ పెద్దలు, యువత సహకారంతో ఈ నెల 31వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నాటు బండి పోలురాధ ఎడ్ల పందాలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలలో మొదటి బహుమతిగా రూ.25,116, రెండవ బహుమతిగా రూ.20,116, మూడవ బహుమతిగా రూ.15,116, నాలుగవ బహుమతిగా రూ.10,116, ఐదవ బహుమతిగా రూ.7,116, ఆరవ బహుమతిగా రూ.5,116 అందజేయనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.1000 అని తెలిపారు. సమయం 10 నిమిషాలని, బండిని ఆరుగురు మాత్రమే తోలాలని, బండి మీద బరువు రెండు క్వింటాళ్లని సూచించారు. వివరాలకు వల్లభుని శేషయ్య సెల్ నెంబరు 8897045365, అవనిగడ్డ వెంకటేశ్వర్లు 7729949780, 7729938355 సెల్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

అన్న క్యాంటీన్లలో భోజనం చేస్తే బిచ్చగాళ్లా?

తక్షణమే ప్రజలకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు డిమాండ్



మాట్లాడుతూన్న ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు), జూలై 23:పేదల కడుపు నింపేందుకు సీఎం చంద్రబాబు తీసుకొచ్చిన అన్న క్యాంటీన్లలో భోజనం చేసే పేదలను బిచ్చిగాళ్ల అన్న వైసీపీ వై.పాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బేషరతుగా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం ఎర్రగొండపాలెం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., నియోజకవర్గంలో సమస్యలను ఆయన అసెంబ్లీలో ప్రస్తావించాల్సింది పోయి, ఏకంగా పేదలను బిచ్చగాళ్లతో పోల్చడం ఏమిటని మండిపడ్డారు. ఎమ్మెల్యే చంద్రశేఖర్ వ్యాఖ్యలు సభ్య సమాజం తలవంచుకోలేలా ఉన్నాయన్నారు. రూ.5లకే పేదలకు భోజనం పెట్టేందుకు సీఎం చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్లను తీసుకొచ్చారన్నారు. వాటి విలువ అందులో నిత్యం భోజనం చేసే విద్యార్థులు వైద్యశాలలకు వెళ్లె రోగులకు, కార్మికులకు, చిరు ఉద్యోగులకు తెలుసన్నారు. అలాంటి వారిని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అవమానించారన్నారు. నియోజకవర్గంలో దళితుల వలసలు ఎక్కువగా వున్నాయని ఆయన దళితుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తవించాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు గురించి అసెంబ్లీలో ప్రస్తవించాని అన్నారు. మీ పులివెందుల ఎమ్మెల్యే జగన్‌కు ధైర్యం ఉంటే గెలిచిన ఎమ్మెల్యేలతో అసెంబ్లీకి వెళ్లి ప్రజాసమస్యలు ప్రస్తావించాలన్నారు. ఎమ్మెల్యే చంద్రశేఖర్ నోటీకి వచ్చినట్లు తనపై మాట్లాడుతున్నారన్నారు. లేని పోని ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామలు ఉంటాయని హెచ్చారించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, పయ్యావుల ప్రసాద్, టీడీపీ ముఖ్య నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, వెంగళరెడ్డి, కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, సత్య నారాయణ గౌడ్, మంత్రునాయక్, వలీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై విచారణ చేపట్టాలి

జగన్ ప్రచారా ఆర్భాటానికే ఆ కార్యక్రమం

అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే ఏలూరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జూలై 23 : గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన నాడు - నేడు పనులపై సమగ్ర విచారణ చేపట్టాలని, మంత్రి నారా లోకేష్ విద్యాశాఖను ప్రక్షాళన దిశగా చర్యలు చేపట్టాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన ప్రసంగించారు. వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి నాడు-నేడు పథకాన్ని ప్రచార ఆర్భాటానికి వాడుకున్నారని ధ్వజమెత్తారు. 2015-19లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పేద విద్యార్థులకు అన్ని వసతులతో పాఠశాలలో చదువుకునేందుకు పథకం రూపొందించగా, జగన్‌రెడ్డి వచ్చాక నాడు-నేడు పేరుతో వైసీపీ నేతలే కాంట్రాక్టు అవతారమెత్తి దోచుకున్నారని ఎమ్మెల్యే ఏలూరి ఆరోపించారు.

జిల్లాకు 42 వేల ఇంటర్ పాఠ్యపుస్తకాలు

ఒంగోలు(విద్య), జూలై 23 : జిల్లాలోని ప్రభుత్వరంగ విద్యా సంస్థల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఉచిత పంపిణీకి రంగం సిద్ధమైంది. 42వేల పాఠ్యపుస్తకాలు జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తకాల గోడౌన్‌కు చేరాయి. జిల్లాలోని 38 మండలకేంద్రాలకు పాఠ్యపుస్తకాలను చేరవేసే కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఆర్టీసీ బస్సు ద్వారా పాఠ్యపుస్తకాలను మండలకేంద్రాల్లోని ఎమ్మార్సీ భవనాలకు అందజేస్తున్నట్లు ప్రభుత్వ పాఠ్యపుస్తకాల డిపో మేనేజర్ వైవీ శివాజీ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, కేజీబీవీ మోడల్ స్కూళ్లు, హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పుస్తకాలను పంపిణీ చేస్తారు. మంగళవారం 12,200 పాఠ్య పుస్తకాలను పలు మండలాలకు పంపారు. ఎమ్మార్సీల నుంచి కళాశాలలకు పంపించినట్లు శివాజీ తెలిపారు.

కాటేసిన కరెంటు తీగలు

స్కూటీపై వెళ్తుండగా తెగిపడిన విద్యుత్ లైన్ వైరు

ముగ్గురు విద్యార్థులు మృతి

మూడు ప్రాణాలను బలిగొన్న సిబ్బంది నిర్లక్ష్యం

గుండెలవిసేలా రోదిస్తున్న మృతుల కుటుంబసభ్యులు

కనిగిరి/అద్దంకి, జూలై 23: విద్యుత్ హైటెన్షన్ వైరు తెగి స్కూటీపై వెళ్తున్న ముగ్గురు ఇంటర్ విద్యార్థులను కబళించింది. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో మూడు నిండు ప్రాణాలను బలిగొంది. హృదయ విదారకమైన ఈ దుర్ఘటన మంగళవారం కనిగిరి మండలం పునుగోడు గ్రామంలో చోటుచేసుకుంది. ఈప్రమాదంలో కనిగిరి పట్టణంలోని ఇందిరా కాలనీకి చెందిన కామినేని బాలాజి (15), వీరమాచనేని గౌతమ్ (15), దేశపోగు నజీర్ (15)లు సజీవదహనమయ్యారు. ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

మృతులు పేద కుటుంబాలకు చెందినవారు..

కామినేని బాలాజి తల్లిదండ్రులు కుటుంబాన్ని పోషించుకునేందుకు తిరుపతి సమీపంలోని కోడూరులో బేల్దారి పనుల చేసుకుంటున్నారు. బాలాజి మేనత్త ఇంట్లో ఉంటూ కళాశాలకు వెళ్ళి వస్తుంటాడు. మరో మృతుడు వీరమాచనేని గౌతమ్ తల్లిదండ్రులు కూడా రోజువారీ కూలి పనులు చేసుకునేవారే. ఇందిరాకాలనీలో నివాసం ఉండే మరో మృతుడు దేశపోగు నజీర్ తల్లిదండ్రులు ప్రయివేటు కాలేజీలో వంట చేస్తుంటారు. వీరు ముగ్గురు స్నేహితులు కావటంతో స్కూటీపై సరదాగా పొలాలు వైపు వెళ్ళినట్లు తెలుస్తుంది.

స్కూటీతో సహా ముగ్గురు సజీవదహనం

పునుగోడు ఎస్టీ కాలనీలోని మెటల్ రోడ్డు ముగ్గురు స్నేహితులకు మృత్యుమార్గంగా మారింది. మృతుల్లో బాలాజి స్కూటీ నడుపుతుండగా నజీర్, గౌతమ్‌లు సరదాగా మాట్లాడుకుంటూ వెళ్తున్నారు. ఇంతలో మృత్యువు విద్యుత్ వైరు రూపంలో అమాంతంగా వచ్చి పడింది. ఆ యువకులకు ఏం జరుగుతుందో గ్రహించే లోపే పెద్ద మంటలు చెలరేగి స్కూటీతో పాటు వారు మృత్యు ఒడిలోకి జారుకున్నారు. కళ్ళముందే ముగ్గురు ముక్కుపచ్చలారని యువకులు మంటల్లో సజీవ దహనమవుతుంటే రక్షించే అవకాశంలేక స్థానికులు హాహాకారాలు పెడుతూ బోరున విలపించారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యం మూడు నిండు ప్రాణాలను బలిగొంది. హెచ్‌టీ లైను వెళ్ళే స్తంభానికి మూడు ఇండక్టర్ ఇన్సులేటర్‌కు అడుగు భాగాన బోల్టు బిగించకుండా ఉంది. మంగళవారం ఉదయం నుంచి ఈదురుగాలులు వీస్తున్నాయి. దీంతో పింగాణి ఇండక్టర్ ఇన్సులేటర్ ఈదురుగాలులకు పైకి లేచిన క్రమంలో వైరు మధ్యలోకి తెగిపోయింది. ఈవైరు స్కూటీపై వెళుతున్న విద్యార్థులపై పడటంతో ప్రమాదం చోటు చేసుకుంది. హెచ్‌టీ లైను కోసం వైరు వేసిన తర్వాత జంపింగ్ చెక్ చేసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించారు. విద్యుత్ లైను ఏర్పాటుచేసే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కూడా ఈ ఘటనకు కారణంగా తెలుస్తుంది.

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర దిగ్భ్రాంతి

విద్యుత్ షాక్‌తో ముగ్గురు విద్యార్థులు దుర్మరణం పాలవటం పట్ల ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అమరావతిలో ఉన్న ఎమ్మెల్యే ఈ విషయాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ద్వారా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళారు. వెంటనే వారి కుటుంబాలకు అండగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్‌లను ఆదేశించారు. ఘటనపై పూర్తి విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందజేసి అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: మంత్రి గొట్టిపాటి

కనిగిరి మండలం పునుగోడులో విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన ముగ్గురు యువకుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున పరిహారం అందించి, అన్నివిధాలా అండగా ఉంటామని విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు. ముగ్గురు మృతి చెందడం పట్ల రవికుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన తనను కలిసివేసిందన్నారు. సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

మృతుల కుటుంబాలకు విద్యుత్‌శాఖ నుంచి ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని డీఈఈ ఆర్.ఉమాకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పునుగోడు గ్రామ ఎస్టీకాలనీ వద్ద కనిగిరి పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు విద్యుత్ వైరు పడి మృతి చెందటం బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటనలో విద్యుత్‌శాఖ పొరపాటు లేదని తెలిపారు. విపరీతంగా వీస్తున్న ఈదురు గాలులతో 11కేవీ పునుగోడు ఫీడర్‌లో విద్యుత్ కండక్టర్ వైరు రాపిడికి గురై లైను తెగిపడినట్లు పేర్కొన్నారు. కండక్టర్ వైరు నేలకు తాకకపోవటం వల్ల పునుగోడు సబ్‌స్టేషన్‌లో ఫీడర్ ట్రిప్ కాలేదని తెలిపారు. అదే సమయంలో బైకుపై వెళుతున్న ముగ్గురు విద్యార్థులను వేలాడే 11కేవీ సప్లయి వైరు తగలడంతో ప్రమాదం చోటుచేసుకుందని పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై భారీ వాహనం



భారీ ట్యాంకర్

మేదరమెట్ల, జూలై 23 : జాతీయ రహదారిపై పరిశ్రమలకు అవసరమైన పరికరాలతో భారీ వాహనాలు అప్పుడప్పుడు ప్రయాణిస్తుంటాయి. మంగళవారం మండలంలోని తిమ్మన్నపాలెం వద్ద చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే భారీ వాహనం ఆగింది. 108 చక్రాలతో ఈ భారీ వాహనం వెళుతోంది. భారీ పరిశ్రమలో బిగించే ట్యాంకర్‌తో ప్రయాణిస్తోంది. పగలు మాత్రమే ప్రయాణించే ఈ వాహనంలో చాలా మంది సహాయకుల ఉన్నారు. ఇది తక్కువ వేగంతో వెళుతోంది. జాతీయ రహదారి వెంబడి ప్రయాణించే ఈ వాహనాన్ని ద్విచక వాహనదారులు, కారుల్లో వెళ్లేవారు ఆసక్తిగా చూస్తున్నారు.

'వెలుగు' అక్రమాలపై స్పందనలో ఫిర్యాదు

మార్టూరు, జూలై 23 : మండల వెలుగు కార్యాలయంలో అక్రమాలపై అఖిల భారత విప్లవ రైతు సంఘం నాయకులు ఎస్‌కే మహమ్మద్ బాషా వారం రోజుల కిందట స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరు ఆదేశాలు మేరకు మంగళవారం జిల్లా అధికారులు మార్టూరు వెలుగు కార్యాలయంలో విచారణ చేపట్టారు. వెలుగు కార్యాలయంలో ద్రోణాదుల క్లస్టరు సీసీగా పనిచేస్తున్న జల్లి నరసింహారావు కొంతకాలంగా అనారోగ్య కారణంగా విధులకు హాజరుకావడంలేదని, అయితే అతని స్థానంలో భార్య కృష్ణవేణి వెలుగు కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నారని, కార్యాలయంలో జరిగే అక్రమాలకు ఆమె సహకరిస్తున్నారని ఆ ఫిర్యాదులో బాషా పేర్కొన్నారు. అంతేగాకుండా మండలంలో భర్తలు ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్న నలుగురు మహిళలు యానిమేటర్లుగా పనిచేస్తున్నారని ఆయన ఫిర్యాదులో తెలిపారు. వెలుగులో జరిగే అక్రమాలపై అధికారులు విచారణ చేశారు. హెచ్‌ఆర్ డీపీఎం సుబ్బారావు, పర్చూరు క్లస్టర్ కోఆర్డినేటరు లక్ష్మణాచారి, ఏపీఎం రాజారత్నం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

వేటపాలెం(చీరాల), జూలై 23 : సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శర్మ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండల పరిధిలోని పంచాయతీ సెక్రటరీలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షా సవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో, ప్రధానంగా శివారు ప్రాంతాల్లో, జనావాసాలు ఉన్నచోట మురుగు నిల్వ లేకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని చెప్పారు. దోమకాటు ప్రబలకుండా చేపట్టాలని, మంచినీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని తదితర అంశాలపై చర్చించి, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోఆర్డీ ఎం.శ్రీనివాసరావు, అన్న గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

శింగరకొండలో రాతి ముఖమండపానికి విరాళం

అద్దంకి, జూలై 23 : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో నిర్మాణంలో ఉన్న రాతి ముఖమండపానికి బల్లికురవ మండలం చెన్నుపల్లికి చెందిన కుమ్మరి వెంకట్రావు, పద్మ దంపతులు మంగళవారం రూ.1.50 లక్షలను అందజేసినట్లు ఈవో సుభద్ర తెలిపారు.

నేడు గుర్రం జాషువా వర్ధంతి

అద్దంకిటౌన్, జూలై 23 : అద్దంకిలోని కొత్తపసుమర్తిపాలెంలో ఉన్న గుర్రం జాషువా విగ్రహం వద్ద జాషువా వర్ధంతి కార్యక్రమం బుధవారం 5 గంటలకు జరుగుతుందని బాధ్యులు పీసీహెచ్ కోటయ్య మంగళవారం ప్రకటన ద్వారా తెలిపారు. సాహిత్యాభిమానులు, కళాభిమానులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోటయ్య కోరారు.

పచ్చదనం మాటున.. ప్రమాదం..!

- డివైడర్ల మధ్య కోనో కార్పస్
- విరివిగా దుబాయ్ మొక్కల పెంపకం
- వీటితో ప్రమాదమని హెచ్చరిక



డివైడర్ల మధ్య పెంచుతున్న కోనో కార్పస్ మొక్కలు

చీరాల, జూన్ 23 : పచ్చదనానికి పెద్దపీట వేద్దాం. ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటండి. వాటిని సంరక్షించండి. పర్యావరణాన్ని పరిరక్షించండి. ఇవి పాలకులు, అధికారులు నిరంతరం చెప్పే మాటలు. అందులో భాగంగా ప్రధానంగా పట్టణ ప్రాంతాలలో డివైడర్ల మధ్య, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారులకు ఇరువైపులా అందంగా కనిపించేందుకు కోనో కార్పస్ (దుబాయ్ మొక్కలు) మొక్కలు వేశారు. వేస్తున్నారు. అయితే వీటితో ప్రమాదమని ఇటీవల అధ్యయనాల్లో వెల్లడైంది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో ఈ మొక్కలను నర్సరీలలో పెంచొద్దని, ఎక్కడా వాటిని వేయవద్దని ఆదేశించింది. కోనో కార్పస్ మొక్కలు పెంపకంతో ఏర్పడే అనర్థాలను వివరిస్తూ గతంలో బీబీసీలో కథనం వెలువడింది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత. అందులో ఎలాంటి సందేహం లేదు. పచ్చదనం పేరుతో ప్రమాదాన్ని కొనితెచ్చుకోవడం సరికాదు. దుబాయ్, పాకిస్తాన్, ఆఫ్రికా దేశాల్లో విరివిగా పెంచే కోనోకార్పస్ మొక్కలను పలు దేశాలు నిషేధించాయి. ఆ మొక్కలు క్రమేణా పెరిగి, భూమిలోకి అత్యధిక దూరం వేళ్ల పాకుతూ నీటి వనరులను హరించివేస్తాయి. దీంతో పాటు వర్షాభావ పరిస్థితులకు కారణమవుతాయి. ఇదిలావుంటే పట్టణప్రాంతాల్లో డివైడర్లు (మున్సిపల్ పరిధిలో) మధ్య వేసిన కోనోకార్పస్ మొక్కలు దీర్ఘకాలంలో భూగర్భంలో ఉన్న అండర్‌గ్రౌండ్ వాటర్ పైపులను కూడా దెబ్బతీసే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో వెలువడిన కథనాల నేపథ్యంలో ఇటు ఆంధ్రప్రదేశ్, అటు తెలంగాణ రాష్ట్రాల్లో చర్చ మొదలయింది. ఆ మొక్కలను తెలంగాణ రాష్ట్రంలో పెంచవద్దని, అవి భూగర్భ జాలను హరించడంతో పాటు, శ్వాసకోశ వ్యాధులకు కారకాలుగా మారతాయనే ఉత్తర్వులను కూడా ఇచ్చారు.

ప్రమాదం ఎలా అంటే

మొక్కలు, చెట్లలో సింహభాగంగా కార్బన్ డయాక్సైడ్‌ను తీసుకుని, ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. ఇది ప్రాణవాయువు. ఎంతో ఉపయోగం. కోనో కార్పస్ మొక్కలు ఆక్సిజన్‌ను తీసుకుని, కార్బన్‌డయాక్సైడ్‌ను విడుదల చేస్తాయి. ఇది ప్రమాదం. కోనో కార్పస్ మొక్కలు పుష్పించే సమయంలో పుప్పొడి రేణువులు గాలిద్వారా ప్రయాణం చేస్తూ ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు శ్వాసతీసుకునే సమయంలో నేరుగా శరీరంలోకి వెళ్లిపోతాయి. దీంతో శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. దీనిపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

వైజాగ్‌లో 2వేల మొక్కలు తొలగించాం

ఇక్కడా తీసేస్తాం

కోనో కార్పస్ మొక్కలు ప్రమాదకరం. అందులో సందేహం లేదు. ఈ నేపథ్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వైజాగ్‌లో పనిచేసేపుడు అక్కడ 2వేల మొక్కలు తొలగించాం. ఇక్కడ ఎన్ని మొక్కలు ఉన్నాయో పరిశీలించి వాటిని తొలగించేందుకు ఉన్నతాధికారుల అనుమతితో అడుగులు వేస్తాం. ఆ మొక్కలు తొలగించిన వెంటనే ప్రత్యామ్నాయంగా ఆహ్లాదాన్ని, నీడను ఇచ్చే మొక్కలను కూడా వేసేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేస్తాం. వీలైనంత వరకు వచ్చే వారంలోనే ఆ చర్యలు చేపడతాం.

- చక్రవర్తి, కమిషనర్, చీరాల మున్సిపాలిటీ



సభ్యత్వ నమోదులో పాల్గొన్న విజయ్‌కుమార్

జనసేన పార్టీలో సభ్యత్వంతో భరోసా

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్

పర్చూరు, జూలై 23 : జనసేన పార్టీలో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ భరోసా ఉంటుందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం పర్చూరులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో విజయ్ కుమార్‌తోపాటు, ప్రవాసాంధ్రుడు జనసేన పార్టీ యువ నాయకులు మన్నెం శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద బీమాతోపాటు, పార్టీ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు మన్నెం శ్రీకాంత్, పార్టీ మండలపార్టీ అధ్యక్షుడు విన్నకోట అజయ్ కుమార్, కారంపూడి సందీప్‌తేజ, కఠారి సురేంద్ర బాబు తులసి సునీల్, మణి, లగడపాటి వెంకటమోహనసుచంద్, అప్పారావు, రంగిశెట్టి ఆంజనేయులు, గోగుల శ్రీను, అచ్చుకోలు సతీష్, బోగాది మోహన్, మారుతి, శ్రీను, నాగరాజు, శివయ్య, మల్లికార్జున, రాముడు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం



తహసీల్దార్ సుభద్రను సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

బల్లికురవ, జూలై 23 : ఎన్నికల విధులలో భాగంగా నెల్లూరు జిల్లా నుంచి బల్లికురవకు వచ్చిన తహసీల్దార్ సుభద్ర తిరిగి తన సొంత జిల్లాకు బదిలీపై వెళుతున్నారు. దీంతో మంగళవారం కార్యాలయ ఉద్యోగులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ గత నాలుగు మాసాల వ్యవధిలో వృత్తిలో నిబద్ధతో పనిచేసి అందరితో మంచి అధికారిగా గుర్తింపు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, ఏఎస్‌వో అమరనాథ్, గ్రామ రెవెన్యూ అధికారులు, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బదిలీ అయినా కదలని కానిస్టేబుళ్లు

బల్లికురవ, జూలై 23 : టీడీపీ అధికారంలోకి రాగానే బల్లికురవ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ముగ్గురు పోలీసు సిబ్బందిని మూడు సర్కిళ్లకు ఎస్పీ ఆదేశాలతో బదిలీ చేశారు. వీరి బదిలీ ఉత్తర్వులు వచ్చి పది రోజులు దాటినా వారు మాత్రం ఇంకా స్టేషన్ నుంచి రిలీవ్ కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీ అయిన వారిలో ఇద్దరు వెళ్లేందుకు సిద్ధం అవుతుండగా, ఒక కానిస్టేబుల్ ఇక్కడే ఉండేందుకు టీడీపీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. బల్లికురవ స్టేషన్‌లో మామాళ్లు బాగా ముడుతుండడంవల్లే ఇక్కడినుంచి కదలడం లేదన్న విమర్శలున్నాయి. బదిలీ ఉత్తర్వులు అందుకున్న కానిస్టేబుల్ గ్రానైట్ క్వారీల వద్ద హల్‌చల్ చేస్తూ వసూలు చేస్తున్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

అద్దంకిటౌన్, జూలై 23 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు దాతల సహకారంతో నోటు పుస్తకాలను అందజేశారు. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాతలు కొల్లిపర నాగయ్య, మలాది శ్రీనివాసరావుల సౌజన్యంతో ఏడు వేల రూపాయలతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, హ్యాండ్ వాష్ బాటిల్స్‌తో స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీకృష్ణ, చిన్ని మరళికృష్ణ, శ్రీనివాసరావు, శ్రీరామచంద్రమూర్తి, హెచ్ఎం విజయభాస్కర్, విద్యా కమిటీ చైర్మన్ చందు పాల్గొన్నారు.

మురుగు నివారణ చర్యలు

పంగులూరు, జూలై 23 : పంగులూరులో డ్రైనేజీలలో పేరుకున్న మురుగును తొలగించే చర్యలకు గ్రామ పంచాయతీ శ్రీకారం చుట్టింది. గ్రామంలోని దళితవాడలలో డ్రైనేజీలలో చెత్తాచెదారం పేరుకుని మురుగు నీరు ముందుకు సాగక దోమలు, ఈగల ఉధృతి పెరగడంతో వ్యాధులు పెరుగుతాయని భావించిన పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రామంలోని కాలువలలో పేరుకున్న మురుగును తొలగించి వర్షపు నీరు ముందుకు పోయేందుకు వీలుగా 24 మంది కూలీలలతో పనులు చేపట్టినట్లు కార్యదర్శి సునీత తెలిపారు. సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, కార్యదర్శి సునీత పరిశీలించారు.

లోకమాన్య తిలక్‌కు నివాళి

మార్టూరు, జూలై 23 : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక ఎపర్ట్ కార్యాలంలో స్వర్గీయ లోకమాన్య బాల గంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, కాజారావు, బసవరాములు, కోటేశ్వరరావు, హనుమంతరావు, అంకమ్మచౌదరి పాల్గొన్నారు.

ఘనంగా రొట్టెల పండుగ

ఇంకొల్లు, జూలై 23 : మండలంలోని గంగవరంలో మూడు రోజులుగా నౌవు షహీద్ దర్గా 403వ గంధమహోత్సవ కార్యక్రమాల్లో భాగా రొట్టెల పండుగను ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బల్లికురవలో పారిశుధ్య పనులు

బల్లికురవ, జూలై 23 : బల్లికురవ మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ రోడ్డులో మంగళవారం పంచాయతీ సర్పంచ్ పందిరి అంజిబాబు ఆదేశాలతో పారిశుధ్య కార్యక్రమాలు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసు స్టేషన్‌కు వచ్చే మండల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలను తీసి వేయించారు. అలానే గ్రామంలో కూడా పలు వీధులను శుభ్రం చేయిస్తామని వారు తెలిపారు.

బాల్యవివాహాలపై అవగాహన

చీరాల, జూలై 23 : కస్తూర్బా బాలికోన్నత పాఠశాలలో మంగళవారం బాలల పరిరక్షణ విభాగం పీడీ ఉమాదేవి ఆదేశాల మేరకు మంగళవారం విద్యార్థినులకు బాల్యవివాహాలు, బాలికా సంరక్షణ, హక్కులపై అవగాహన సదస్సు నిర్విహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఆఫీసర్ స్వప్నప్రియ, విభాగ కౌన్సిలర్ రోజ్‌లీనాలు విద్యార్థినులను అవగాహన కల్పించారు. విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కృష్ణమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఈపూరుపాలెంలో వృద్ధురాలి దారుణ హత్య

- కత్తితో గొంతులో పొడిచిన దుండగులు
- పోలీస్ స్టేషన్‌కు అతి తక్కువ దూరంలో ఘటన

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జూలై 23 : చీరాల మండలం ఈపూరుపాలెంలో విశ్రాంత ఉపాధ్యాయినిని దారుణంగా హతమార్చారు. వివరాల్లోకి వెళితే పోలీస్ స్టేషన్ వెనుక జెండా చెట్టు సమీపంలో పిల్లి లలిత(74) ఒంటరిగా నివాసం ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి కత్తితో ఆమె గొంతులో పొడిచి పరారయ్యారు. సమాచారం అందుకున్న ఎస్పీ తుషార్ డూడీ హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. అయితే గ్రామంలోనే నెల కిందట యువతి హత్య, ఇప్పుడు రెండో ఘటనతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు.



వివరాలు సేకరిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ



మాట్లాడుతున్న ఏవో సుమతి

పరిపాలన పారదర్శకంగా ఉండాలి

చీరాలటౌన్, జూలై 23 : పరిపాలన పారదర్శకంగా ఉండాలని తద్వారా జవాబుదారీతనం ప్రజలకు అందుతుందని ఎంపీడీవో శోభారాణి, వ్యవసాయాధికారి సుమతి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టం-2005 మండల స్థాయి అవగాహన కార్యక్రమం మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిచారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ అధికారికంగా పనిచేస్తున్న అన్ని ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన సమాచారాన్ని కార్యాలయం ముందు స్వచ్ఛందంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని వివరించారు. సమాచారాన్ని కోరిన అర్జీదారులకు ఎటువంటి సమాచారాన్ని ఏవిధంగా ఇవ్వాల్సి ఉంటుందనే అంశాన్ని వివరించారు. అంతేకాకుండా ప్రతినిధులకు దాసరి ఇమ్మానియేల్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. కార్యక్రమంలో డీటీ సురేష్, ఐఎల్ ఏవో సరిత, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ పురుషోత్తం, విద్యుత్ ఏఈ రామ్‌కుమార్, జేఈ శ్యాంసుందర్. బ్రహ్మం, ఈపూరుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రీదేవి, వెటర్నరీ వైద్యురాలు డా. పావని, తదితర ప్రభుత్వ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నైపుణ్యాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

అద్దంకిటౌన్, జూలై 23 : ప్రతి రోజు ఉపాధ్యాయులు అభ్యసన, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని, దానిలో అందరూ భాగస్వాములు కావాలని ఎంఈవో బీ సుధాకరరావు అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాయపాలెం ప్రాథమిక పాఠశాల శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఎంఈవో సుధాకరరావు సందర్శించారు. ఈనెల 29వ తేదీ వరకు అన్ని పాఠశాలల్లో శిక్ష సప్తాహ్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ వి.గంగాధరరావు, హెచ్ఎం సర్వేశ్వరరావు, సీఆర్ఎంటీ ఎం.రమేష్‌బాబు పాల్గొన్నారు.

70శాతం రాయితీపై గోకులం షెడ్లు

చినగంజాం, జూలై 23 : గోకులం పథకం ద్వారా పశువుల షెడ్లకు 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70 శాతం రాయితీ ఇస్తున్నట్లు చినగంజాం పశువైద్యాధికారి డాక్టర్ బి.కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారులకు ఉపాధిహామీ పథకం ద్వారా షెడ్ల నిర్మాణాలకు సంబంధించి గోకులం పథకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఈ పథకం ఉపాధి హామీ పథకం అధికారులు, ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో చేపట్టనున్నట్లు తెలిపారు. 2, 4 లేదా 6 పశువులు, 20 లేదా 50 గొర్రెలు, మేకలు, 100 నుండి 200 కోళ్లను ఒక యూనిట్‌గా మంజూరు చేస్తారని తెలిపారు. 70 శాతం ప్రభుత్వ రాయితీ అందజేస్తుందని, మిగిలినది రైతు వాటా లేదా ఉపాధిహామీ వేజ్ కాంపొనెంట్ కింద జమ చేస్తారని తెలిపారు. చినగంజాం మండలంనకు 50 షెడ్ల నిర్మాణానికి మంజూరు ఇచ్చినట్లు తెలిపారు. దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, జాబ్ కార్డు, స్థలానికి సంబంధించిన పత్రాలు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను రైతు సేవా కేంద్రం, పశు వైద్యశాలలో అందజేయాలని తెలిపారు. ఈ సదుపాయాన్ని మండల పరిధిలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కిరణ్‌కుమార్ కోరారు.

బ్యాంకు సేవలపై అవగాహన

అడుసుమల్లి(పర్చూరు), జూలై 23 : అడుసుమల్లి జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు బ్యాంకు సేవలపై మంగళవారం విశ్రాంత నవోదయ ఉపాధ్యాయుడు పిన్నక సాంబయ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు సైతం బ్యాంకు సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అనంతరం బ్యాంకు సేవలు, తదితర అంశాలపై విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీ రుణాలను వినియోగించుకోవాలి

మేదరమెట్ల , జూలై 23 : డ్వాక్రా గ్రూపు మహిళలు రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని స్త్రీనిధి మేనేజర్ నాగశంకర్ తెలిపారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో వీవోఏలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పీఎంఈజీపీ, పీఎం ఎఫ్ఎంజీ, ముద్ర రుణాలను బ్యాంక్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. మండలానికి 242 అందించాలని లక్ష్యం అని ఆయన తెలిపారు. డ్వాక్రా మహిళలందరూ స్త్రీనిధి రుణాలను సకాలంలో చెల్లించేలా వీవోఏలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అనూరాధ, సీసీలు మస్తాన్‌వలి, సాంబయ్య, చంద్రశేఖర్, మండల సమైఖ్య అధ్యక్షురాలు జ్యోతుల రాజ్యం పాల్గొన్నారు.

ఉంచుదామా.. తీసేద్దామా..!

- మునిసిపాలిటీలో కాంట్రాక్టు కార్మికుల విషయమై సమాలోచన
- 2019 తరువాత 40 మందిని తీసుకున్నట్లు నివేదిక సిద్ధం చేసిన అధికారులు
- తమను కొనసాగించాలని కొందరు పైరవీలు



చీరాల, జూలై 23 : చీరాల పురపాలక సంఘంలో కాంట్రాక్టు కార్మికుల కహాని రాజకీయవర్గాల్లో జోరుగా చర్చసాగుతోంది. ప్రధానంగా 2019 నుంచి 2024 వరకు ఉన్న కొందరు కాంట్రాక్టు కార్మికులను కొలువుల నుంచి తప్పించాలని అధికార పార్టీ భావిస్తున్నట్లు ప్రచారం ఉంది. కొందరు పైరవీకారులు బాహాటంగా చేస్తున్న వ్యాఖ్యలు అందుకు బలాన్నిస్తున్నాయి. 2019 ఎన్నికల తరువాత సుమారు 40 మంది కాంట్రాక్టు కార్మికులుగా తీసుకున్నట్లు అధికారులు నివేదిక తయారు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వారందరినీ ఉంచుదామా, తీసేద్దామా.. అనే కోణంలో అధికార పార్టీ యోచిస్తున్నట్లు కొందరు బహిరంగంగానే అంటున్నారు. అయితే అందులో కొందరు పైరవీకారులు ఉండడం విశేషం. ఈ క్రమంలో ఇటీవల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మున్సిపల్ కార్యాలయంలో పలు విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ముందుగా రిక్వెస్ట్‌గా చెప్తా .. కాదంటే పనిష్‌మెంటేనని సున్నితంగా, స్పష్టంగా చెప్పారు. ఆ వెసులుబాటు ఆ రోజు సమీక్షా సమావేశంలో పాల్గొన్న వారికేనా, లేకుంటే కాంట్రాక్టు కార్మికులకు కూడా వర్తిస్తుందా అనే కోణంలో అధికారులు, సిబ్బంది, రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో నిర్ణ యం ఏదైనా పైరవీకారులను మాత్రం దరిచేయనీయవద్దని, లేదంటే అంతిమంగా వారికే నష్టం చేకూర్చే పరిస్థితులు ఎదురవుతాయనే కోణంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కూటమి శ్రేణుల్లో పలువురు సూచిస్తున్నారు.



రామకూరు లాకుల వద్ద జలాలను పరిశీలిస్తున్న ఈఈ

సాగర్ జలాలతో చెరువులు నింపండి

పంగులూరు, జూలై 23 : ప్రజల తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ జలాలతో మంచినీటి చెరువులను నింపాలని ఎన్నెస్పీ ఈఈ ఉమామహేశ్వరరావు కోరారు. కొణంకి సబ్ డివిజన్ పరిధిలోని రామకూరు 37వ మైలు వద్దకు చేరుతున్న సాగర్ జలాలను మంగళవారం ఈఈ పరిశీలించారు. ఏబీసీ పరిధిలో 37వ మైలు వద్దకు 378 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, యద్దనపూడి, పమిడిపాడు, కోటపాడు, ద్రోణాదుల మేజర్లకు నీటిని మళ్లిస్తున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లా పరిధిలోని 18వ మైలువద్ద నుంచి కాలువలో ప్రవహిస్తున్న సాగర్ జలాలను పరిశీలించామని, సోమవారం కన్నా నీటి ప్రవాహం కొంత తగ్గిందన్నారు. వృథా చేయకుండా జాగ్రత్తగా చెరువులు నింపుకోవాలన్నారు. బుధవారానికి నీటి ప్రవాహం కొంత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. పమిడిపాడు మేజర్‌తో పాటు కోటపాడు, ద్రోణాదుల, నూతలపాడు మైనర్ల పరిధిలోని మంచి నీటి చెరువులన్నిటినీ నీటితో నింపాలని ఈఈ సూచించారు. ఆయనతోపాటు కొణంకి సబ్ డివిజన్ డీఈ స్వామి, జేఈలు సుబ్బారావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

నోటిఫైడ్ చెరువులకు నీరు

- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య

తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన నీటితో మండలంలోని నోటిఫైడ్ చెరువులు నింపాల్సిన అవసరం ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని పంగులూరు, చందలూరు, ఏవీ పాలెం, కొప్పెరపాడు, జేవీపాలెం చెరువులను డీఈ వేణుగోపాల్, ఏఈ శివయ్య పరిశీలించారు. ఆరికట్లవారిపాలెం, కోటపాడు, జాగర్లమూడివారిపాలెం, నూజెళ్లపల్లి చెరువులకు సాగర్ నీటిని మళ్లించి చెరువులు నింపే చర్యలు చేపట్టామన్నారు. సోమవారం 37వ మైలు వద్ద నుండి పమిడిపాడు మేజర్‌కు 200ల క్యూసెక్కుల నీరు విడుదల కాగా మంగళవారం 138 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదలయినట్లు తెలిపారు. మండలంలోని నూజెళ్లపల్లి, ఆరికట్లవారిపాలెం, పంగులూరు, మల్లవరం, బూదవాడ, కేవీపాలెం, కొప్పెరపాడు జేవీపాలెం, జనకవరం, చందలూరు, కొప్పెరపాడు, తక్కెళ్లపాడు చెరువులకు నింపాల్సిన అవసరం ఉందన్నారు. పమిడిపాడు మేజర్‌కు 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తేనే చెరువులను కొంతమేర నింపగలుగుతామని తెలిపారు.



ఊరేగింపుగా అమ్మవారికి సారెను తీసుకెళ్తున్న భక్తులు

నాంచారమ్మకు ఆషాఢ సారె

పర్చూరు, జూలై 23 : పర్చూరులోని గ్రామ దేవత శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి మంగళవారం ఆషాఢ మాస సారెను బహూకరించారు. తొలి ఏకాదశ ముందు అమ్మవారికి సారె ఇవ్వడం ఆనవాయితీ. అమ్మవారికి సారె ఇవ్వడం ద్వారా గ్రామం సుభిక్షంగా ఉంటుందని, పాడి పంటలు వృద్ధి చెందుతాయని భక్తుల నమ్మకం. ఆలయ వంశం పారంపర్య అర్చకులు తులసి వారి సారథ్యంలో అమ్మవారికి సారెను బహూకరించారు. కార్యక్రమంలో పెద్దకాపు, తులసి వారు పాల్గొన్నారు.

జ్వరాలు తగ్గేవరకూ వైద్య శిబిరం

బల్లికురవ. జూలై 23 : జ్వరాలు, చికున్ గున్యా అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరాన్ని గ్రామంలో కొనసాగించాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ప్రేమ్‌చంద్ ఆదేశించారు. అంబడిపూడి గ్రామాన్ని వైద్యాధికారి పరిశీలించారు. జ్వరాలబారిన పడి కాళ్ల నొప్పులతో బాధపడుతున్న రోగులను అయన పరిశీలించారు. అలానే గృహాలలో నిల్వ ఉన్న కూలర్‌లో ఉన్న లార్వా దోమలను చూసి అయన వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటింటికీ తిరిగి గృహాల పరిసరాలను పరిశీలించి ప్రజలకు తగు సూచనలు చేయాలన్నారు. మురుగు నిల్వ లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జ్వరాలు తగ్గిన నొప్పులు కొన్ని రోజులు ఉంటాయని ప్రజలు వైద్య సిబ్బంది వద్ద మందులను తీసుకోవాలన్నారు. అనంతరం వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో వైద్యాధికారి రవితేజ, సిబ్బంది ఉన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి ప్రేమ్‌చంద్

స్తంభాలకు తీగలు

- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- పొంచి ఉన్న ప్రమాదాలు



శింగరకొండపాలెం సమీపంలో స్తంభానికి అల్లుకున్న తీగ



బొమ్మనంపాడు రోడ్డులో జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎగబాకిన మొక్కలు

అద్దంకి, జూలై 23 : మొక్క దశలో తుంచి వేయకపోతే పెను ప్రమాదానికే దారి తీసే అవకాశం ఉంది. పలు చోట్ల మొక్కల తీగలు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు ఎగబాకి విద్యుత్ లైన్‌లకు అల్లుకుంటున్నాయి. దీంతో ఆయా ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించే అవకాశం ఉంది. అదే సమయంలో విద్యుత్ తీగల నుంచి మొక్కలకు విద్యుత్ ప్రసరణ జరిగి అటు వైపు వెళ్లే పశువులు, ప్రజలు విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వానలు పడుతుండడడంతో మొక్క తీగలు మరింత ఏపుగా ఎగబాకుతున్నాయి. ప్రారంభదశలో అయితే వాటిని సులువుగా తొలగించే అవకాశం ఉంటుందని, అలా కాకుండా ఆలస్యం చేస్తే సమస్య తీవ్రతరం అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా సిబ్బంది ఆయా ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోయిన మొక్కల తీగలను తొలగించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

చినగంజాం, జూలై 23 : గ్రామాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి అన్నారు. మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని కోడూరివారిపాలెం, కాటంవారిపాలెం, నీలాయపాలెం, చింతగుంపల్లి గ్రామాలను మంగళవారం ఆయన సందర్శించి, పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి, పలు సూచనలు ఇచ్చారు. కోడూరివారిపాలెంలో వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. చింతగుంపల్లి కాలువను శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.



ఆర్టీసీ రీజియన్‌కు 29 కొత్త బస్సులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జులై 23 : ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌లో డొక్కు బస్సులకు కాలం చెల్లనుంది. వాటి స్థానంలో కొత్తబస్సులు రానున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ జిల్లా అధికారులు కాలం చెల్లిన బస్సుల స్థానంలో 110 బస్సులు పంపాలని ప్రతిపాదనలు పంపారు. అయితే, వీటిని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోపే జిల్లాకు 29 కొత్త సూపర్ లగ్జరీ బస్సులను పంపింది. మరోవైపు కొంత మైనర్ రిపేర్లు ఉన్న సూపర్ లగ్జరీ బస్సులను పల్లె వెలుగు బస్సుల కింద తిప్పేందుకు ఆర్టీసీ ఆర్ఎం ఆదేశాలు జారీ చేశారు. ఆ బస్సుల స్థానాల్లో దూరప్రాంతాలకు కొత్త బస్సులు నడుపుతున్నారు.

ఏపీకి ప్రాధాన్యం హర్షణీయం



కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయం. కేంద్రం నుంచి భారీగా నిధు లు రాబట్టిన కూటమి ప్రభుత్వానికి అభినందనలు. సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలు రాష్ట్రానికి భారీస్థాయిలో నిధులు రాబట్టేలా చేశాయి. అలాగే భవిష్యత్తులోనూ రాజధాని నిర్మాణానికి సహాయం అందుతుందని కేంద్ర మంత్రి ప్రకటించడం హర్షణీయం. సమర్థవంతమైన నాయకత్వం ఎలా ఉంటుందో సీఎం చంద్రబాబు చేసి చూపారు.

- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ

ఏపీకి వరాల జల్లు



రాజధాని అమరావతికి భారీ ఆర్థిక సహాయం ప్రకటించటం సంతోషకరం. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం అమలుకు చర్యలు తీసుకోవటం శుభపరిణామం. ఏపీలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించటం గొప్ప విషయం. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం ప్రాంతాలకు నిధులు కేటాయించటం ద్వారా ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. సాధ్యమైనంత త్వరగా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలనే నిర్ణయం హర్షణీయం. విశాఖ-చెన్నై, బెంగళూరు-ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రోత్సాహం ఇచ్చారు.

- పొంగూరు నారాయణ, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి

చంద్రబాబు కృషి ఫలితమే



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి ఫలితమే. రాష్ట్ర రాజధాని అమరావతితోపాటు విద్య, నైపుణ్యాభివృద్ధికి, వ్యవసాయం, అనుబంధ రంగాలకు అధిక నిధులు కేటాయించడం, స్వయం ఉపాధి పొందుతున్న చేతివృత్తి మహిళలకు రుణసాయం పెంచడం అభినందనీయం.

- కాకార్ల సురేష్, ఉదయగిరి ఎమ్మెల్యే

అమరావతికి నిధులివ్వడం హర్షణీయం



ఏపీ గుండెకాయ అమరావతికి నిధులు మంజూరు చేస్తూ కేంద్రం తన బడ్జెట్‌లో ప్రకటించడం హర్షణీ యం. ఎప్పటినుంచో ఎదురు చూస్తు న్న పోలవరాన్ని పూర్తి చేసే బాధ్యత ను కూడా కేంద్రం తీసుకుంది. ఇదం తా చంద్రబాబు చొరవ వల్లే జరిగింది. వేతన జీవులకు వెసులుబాటు కల్పించడం సంతోషం.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే

బంగారం ధరలు తగ్గుతాయి



కేంద్ర బడ్జెట్ ద్వారా బంగారు, వెండి ధరలు తగ్గడానికి అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం గ్రాము బంగారం ధర రూ.7వేల వరకు ఉంది. బంగారంపై విదేశీ సుంకం తగ్గించ డం వల్ల బంగా రం ధరలు దిగివచ్చాయి. ఉన్నత విద్యకు విద్యా రుణాల కేటాయింపు మధ్యతరగతి వారికి ప్రయోజనం కలుగుతుంది.

- కొండూరు దుర్గాదేవి, గృహిణి



పారిశ్రామిక పరుగు..
యువతకు భరోసా

- విశాఖ-చెన్నై కారిడార్‌కు కేంద్ర బడ్జెట్‌లో నిధులు
- కొప్పర్తి, ఓర్వకల్లు వాడలతో జిల్లాకు అనుబంధం
- మధ్య తరగతి ప్రజలకు ఐటీ ఊరట. అన్ని వర్గాల్లో హర్షం

నెల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్‌పై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈదఫా రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్ల నిధులు కేటాయించడమే కాకుండా వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక నోడ్‌లకు నిధులు కేటాయించడం, పోలవరం పూర్తి చేసేందుకు నిధులన్నీ సమకూరుస్తామని కేంద్ర విత్త మంత్రి నిర్మలమ్మ ప్రకటించడం శుభపరిణామమని విశ్లేషకులు చెప్పుకుంటున్నారు. అదే సమయంలో కేంద్ర బడ్జెట్ జిల్లాలో పారిశ్రామిక రంగానికి ఊతం ఇస్తుందని అభిప్రాయపడుతున్నారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని నోడ్‌లకు ప్రత్యేక సాయం అందిస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ కారిడార్‌లో కీలకమైనది కృష్ణపట్నం పారిశ్రామక నోడ్. ఇప్పటికే ఆ నోడ్‌లో మౌలిక వసతులకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ఈదఫా బడ్జెట్‌లో కూడా నిధులు అందిస్తామని ప్రకటించడంతో కృష్ణపట్నం నోడ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు మెరుగుపడనున్నాయి. అలానే కడప జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక్ నోడ్, కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు నోడ్‌లకు కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. అక్కడ పరిశ్రమలు ఏర్పడితే వాటికి ఎగుమతి, దిగుమతులన్నీ జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు నుంచే జరగనున్నాయి. ఇక కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తే, ఆ ఉద్యోగుల మొదటి నెల జీతాన్ని కేంద్ర ప్రభుత్వం బోనస్‌గా అందిస్తుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఇది కొత్త కంపెనీల ఏర్పాటుకు ఎంతో తోడ్పాటును అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇటు కృష్ణపట్నం అటు రామాయపట్నం పోర్టు నడుమ వేల ఎకరాల భూములు అందుబాటులో ఉన్న నేపథ్యంలో తాజాగా కేంద్ర రాయితీలు కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు కల్పిస్తున్నాయి.

మధ్యతరగతికి ఊరట

మధ్య తరగతి ప్రజలకు మేలు జరిగేలా ఆదాయపు పన్ను శ్లాబులలో మార్పులు చేశారు. ఇప్పటి వరకూ 3 లక్షల్లోపు ఆదాయం ఉంటే ఐటీ చెల్లించాల్సిన అవసరం లేదు. 3 నుంచి 6 లక్షల మధ్య ఐదు శాతం పన్ను చెల్లిస్తుం డగా, ఆ గరిష్ఠ మొత్తాన్ని 7 లక్షలకు పెంచారు. అలానే ఇప్పటివరకూ 6 నుంచి 9 లక్షల మధ్య ఆదాయం ఉన్న వారు 10 శాతం ఐటీ చెల్లిస్తుండగా ఇకపై 7 నుంచి 10 లక్షలలోపు ఆదాయం ఉన్న వారు మాత్రమే 10 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో దాదాపు లక్ష మం దికిపైగా ఆదాయపపు పన్ను చెల్లించే వారు ఉండగా అందులో సగం మందికి కొత్త శ్లాబు విధానం ద్వారా ప్రయోజనం చేకూరుతుందని అంచనా. అదే సమ యంలో ఆదాయపు పన్ను చట్టాన్ని సమీక్షిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లా లోని వ్యాపారులకు ఇది మేలు చేస్తుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఎన్‌సీఈఆర్‌టీ, తెలుగు ప్రాచీన అధ్య యన కేంద్రాలకు ఈ దఫా నిధులు దక్కే అవకాశం ఉన్నట్లు సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. ఆయా శాఖలకు కేటాయించిన నిధులలో తమ సంస్థలకు ఏ మేరకు కేటాయించారన్న విషయం తెలియడానికి కొంత సమయం పడుతుందని వారు చెబుతున్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ఊతం

భవిష్యత్ భారతాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో తాజా గా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రకృతి వ్యవసాయానికి భారీగా ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ప్రకటించారు. ఏడాదిలో కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించాలన్నది లక్ష్యం. జిల్లాలో దాదాపు నాలుగు లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. వారిలో ఇప్పటికే అనేక మంది ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ప్రోత్సాహకాలు ఇస్తున్న నేపథ్యంలో మరింత మంది అటువైపు అడుగు వేసే అవకాశాలు ఉన్నాయి.

చిరువ్యాపారులపై 'ముద్ర'

ఇక చిరు వ్యాపారులకు ముద్ర రుణాలను రూ.10 లక్షల వరకు అందిస్తుండగా ఆ మొత్తాన్ని రూ.20 లక్షలకు పెంచారు. వ్యాపారాల విస్తరణకు, కొత్త వ్యాపారాల ప్రారంభానికి ఈ పెంపు ఎంతో ఉపయోగపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా దేశంలోని టాప్ 500 కంపెనీల్లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌నకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలో వేల మందికి ఇది సువర్ణావకాశంగా మారనుంది.

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : కేంద్ర బడ్జెట్‌లో నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్‌తోపాటు విజయవాడ-గూడూరు మధ్య మూడవ రైల్వేలైన్‌కు కేటాయింపులు చేశారు. మెట్ట ప్రాంతవాసులు ఎన్నోఏళ్లుగా ఎదురు చూస్తున్న నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైనుకు రూ.450 కోట్లు మంజూరు చేశారు. మొత్తం ప్రాజెక్ట్ వ్యయం రూ.2289 కోట్లతో 309 కి.మీ పొడవున రైల్వేలైను నిర్మించాల్సి ఉంది. ఈ ప్రాజెక్ట్‌లో రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణతోపాటు ప్రాజెక్ట్ వ్యయంలో 50 శాతం భరించాల్సి ఉంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం నిధుల కేటాయిం పుతో పాటు భూసేకరణ సక్రమంగా పూర్తి చేయలేదు. దీంతో పనులు ఆలస్యం అవుతూ వస్తున్నాయి. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.450 కోట్లు కేటాయించడంతో పాటు ఎన్‌డీఏ కూటమి రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో పనులు వేగం పుంజుకోనున్నాయి. అదేవిధంగా గూడురు - విజయవాడ మూడవ రైల్వేలైను పనులు దాదాపు 80శాతం పూర్తయ్యాయి. మిగిలిన 20 శాతం పనులు చివరి దశలో ఉన్నాయి. ఇందుకోసం ఈ బడ్జెట్‌లో రూ.500 కోట్లు మంజూరు చేశారు.

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్‌కు రూ.450కోట్లు
- **గూడూరు-విజయవాడ 3వలైన్‌కు రూ.500 కోట్లు**

ప్రామాణిక తగ్గింపు హర్షణీయం



ఉద్యోగుల ఆదాయపు పన్ను నూతన విధానంలో ప్రామాణిక తగ్గింపు (స్టాండర్డ్ డిడక్షన్) రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు పెంపు హర్షనీయం. కింద స్థాయి ఉద్యోగులకు సుమారు రూ.5వేల వరకు పన్ను రాయితీ వస్తుంది. పైస్థాయి అధికారికి గరిష్ఠంగా రూ.17,500 పన్ను రాయితీ లభిస్తుంది. మొత్తం మీద ఉద్యోగులందరికీ వారి స్థాయిని బట్టి లబ్ధి చేకూరుతుంది. అలాగే ఉద్యోగులు ప్రతి కొనుగోలుపై కడుతున్న జీఎస్‌టీని దృష్టిలో ఉంచుకొని ప్రామాణపు తగ్గింపు పరిమితిని మరింత పెంచితే అధిక మేలు జరిగేది. మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు.

- పీవీఎస్‌టీ రాంప్రసాద్, స్టాటిస్టికల్ అధికారి, నెల్లూరు

స్లాబ్‌ల వారీగా తగ్గింపు బాగుంది



ఉద్యోగుల ఆదాయపు పన్ను నూతన విధానంలో స్లాబ్‌ల వారీగా పన్ను శాతం తగ్గింపు బాగుంది. రూ.3 లక్షల వరకు పన్నులేదు. ఆ తర్వాత రూ.7 లక్షల వరకు 5శాతం, 7 నుంచి 10 లక్షల వరకు 10శాతం, 10లక్షల నుంచి 12 లక్షల వరకు 15 శాతం పన్ను విధింపు సంతృప్తికరం. క్యాన్సర్ వ్యాధికి మందుల పై సుంకం ఎత్తివేత కూడా ఉపయోగకరం. లెదర్ ఉత్పత్తులపై పన్ను శాతం తగ్గించడం హర్షదాయకం. కస్టమ్స్ డ్యూటీ 15 శాతం తగ్గింపు వల్ల సెల్‌ఫోన్ ధరలు తగ్గుతాయి.

- బి. సుధాకర్‌రెడ్డి, ఏపీజీఈఏ, జిల్లా అధ్యక్షుడు

బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు గౌరవం



ఆరేళ్ల క్రితం తర్వాత బడ్జెట్‌పరంగా ఆంధ్రప్రదేశ్‌కు గౌరవం లభించింది. ఏపీలో కూటమి ప్రభుత్వం అడిగినంత ఇవ్వక పోయినా రాష్ట్ర రాజధానికి రూ.15వేల కోట్లు కేటాయించారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా జరిగేందుకు సానకూలత వ్యక్తం చేయటం హర్షణీయం. విశాఖ-చెన్నై కోస్టల్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం, స్కిల్ డెవలప్‌మెంటుకు చేయూత తదితర అంశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు సహకరించడం గౌరవప్రదం.

- నాటకం తిరుమలయ్య, ఉపాధ్యాయుడు

పన్ను విధానంలో తగ్గించి ఉంటే బాగుండేది



పెన్షనర్లు అధిక శాతం మంది పాత పన్ను విధానాన్ని ఎంచుకొని ఉన్నారు. పాత పన్ను విధానంలో శ్లాబుల ప్రకారం రూ.3 లక్షల వరకు పన్ను లేదు. రూ.3 లక్షల నుంచి 5లక్షల వరకు 5 శాతం, రూ. 5లక్షల నుంచి 7లక్షల వరకు 10శాతం, రూ.7.5లక్షల నుంచి 10లక్షల వరకు 15 శాతం, రూ.10 లక్షల నుంచి 12.5 లక్షల వరకు 20 శాతం పన్ను ఉంది. అన్ని శ్లాబులలో 2.5 శాతం పన్నును అదనంగా తగ్గించి ఉంటే బాగుండేది. పాత పన్ను విధానంలో ముఖ్యంగా పెన్షనర్లకు మినహాయింపులు ఇచ్చి వుంటే బాగుండేది.

- పాముల నిర్మల, పెన్షనర్

దేశప్రగతికి బాట వేసేలా



రాష్ట్ర విభజన తర్వాత రాజధాని అమరావతికి, పోలవరానికి చేయూతనివ్వడం తోపాటు వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయం. అయితే, వ్యక్తిగత పన్నులకు పెద్దగా మినహాయింపులు లభించలేదు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు పెద్ద పీట వేసే విధంగా కొత్త కంపెనీల్లో ఉద్యోగాలకు మొదటి నెల జీతాన్ని తిరిగి బోనస్‌గా చెల్లిస్తామని ప్రకటించడం గొప్ప విషయం.

- చిన్ని శ్రావణ్‌కుమార్, చార్టెడ్ అకౌంటెంట్

వేతన జీవులకు తీవ్ర నిరాశ



బడ్జెట్‌లో పాత ఆదాయపన్ను స్లాబులు మార్చకపోవటం వల్ల వేతన జీవులకు తీవ్ర నిరాశ కలిగించింది. పెరిగిన ధరలు, ప్రస్తుత ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని పన్ను విధానంలో మార్పులు చేసి ఉంటే మధ్యతరగతి వర్గాలకు, సామాన్య వేతనజీవులకు మేలు చూకూరేది. సేవింగ్స్ పరిమితిని కనీసం రూ.2.5 లక్షలకు పెంచి ఉంటే పొదుపు చేసుకోవడానికి ప్రోత్సాహం ఉండేది. రూ.8లక్షల వరకు పన్ను మినహాయింపు ఇచ్చి ఉంటే బాగుండేది. ఉద్యోగులంతా కోరుకునే విధంగా ఆర్థిక భద్రత కలిగించడానికి సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రకటించి ఉంటే బాగుండేది.

- అల్లంపాటి సురేంద్రరెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

'విశ్వకర్మ'కు లబ్ధిదారులను ఎంపిక చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వెంకటేశ్వరపురం): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద లబ్ధిదారులను మూడు దశల్లో పరిశీలన చేసి ఎంపిక చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విశ్వకర్మ పథకం అమలు కమిటీతో ఆయన సమీక్షించారు. ఇప్పటివరకు ఈ పథకం కోసం 68,546 దరఖాస్తులు వచ్చాయని, వీటిని సచివాలయ సిబ్బంది ద్వారా పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, ఎల్‌డీఎం శ్రీకాంత్, శర్మద పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక బృందాలు

ఇసుక పంపిణీ, అక్రమ రవాణా నిరోధించేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. స్టాక్‌యార్డులు, స్టాక్ పాయింట్ల నుంచి మాత్రమే కేవలం రవాణా ఖర్చులు మాత్రమే భరిస్తూ ఉచితంగా ఇసుకను ప్రజలకు అందించాలన్నారు. ప్రతి యార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఇసుక సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మైనింగ్ శాఖ డీడీ శ్రీనావాసకుమార్, జేసీ సేధుమాధవన్, ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్, ఆర్‌డీవో మాలోల, మధులత తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ విజ్ఞప్తుల స్వీకరణ

నెల్లూరు (హరనాథపురం) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రతిరోజూ గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తారని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. అంతేగాక ప్రజలే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా https. meekosam. ap.gov.inలో ఆధార్ నెంబరును ఉపయోగించి తమ సమస్య లను నమోదు చేయవచ్చని అన్నారు. అలాగే, కలెక్టరేట్, మండల, డివిజన్ స్థాయిల్లో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు.

ప్రశ్నార్థకం.. పంటల సాగు!



సాగులేక బీడుగా ఉన్న భూములు

● ఎండిన చెరువులు, కుంటలు ● బీడు భూములుగా మాగాణి భూములు

ఏఎస్‌పేట, జూలై 23: ఈ ఏడాది ఆశించిన వర్షాలు కురవక పోవడంతో మండలంలో వరి సాగు చేసే రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాలు కురిసి వాగులు, వంకలు పొంగితే చెరువులు, కుంటల్లో నీరు పూర్తి స్థాయిలో ఉండేది. దీనికితోడు సమీప ప్రాంతంలోని పొలాల్లోని బోర్లలో సంవృద్ధిగా నీరు ఉండేది. రైతులు అనుకున్న దానికంటే ఎక్కువగా పంటలు సాగుచేసేవారు. కానీ ఈ ఏడాది వర్షాకాలం ప్రా రంభమై సుమారు రెండు నెలలు పూర్తికావస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురువకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఇదీ పరిస్థితి..

అనుమసముద్రం, గుడిపాడు, చిరమన గ్రామాల్లో ప్రతిఏడాది ఈ సీజన్‌లో 12వేల ఎకరాల్లో ఈ పాటికి వరి సాగులో అయ్యేది. ఈ ఏడాది మాత్రం నాటు వేసే పనులు ప్రారంభం కాలేదు. చాలావరకు బీడు భూములుగా ఉన్నాయి. సోమశిల ప్రాజెక్టు ఉత్తరకాలువకు విడుదల కాకపోవడంతో వరిసాగు ప్రశ్నార్థకంగా మారనుందని ఆందోళన వ్య క్తం చేస్తున్నారు. చెరువులల్లో నీరు ఎండిపోవడంతో పశువులకు తాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నా రు. సగానికి పైగా పొలాలు సాగులేకపోవడంతో రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు.

సాగు కష్టమే..



చెరువులో నీరు లేదు. వర్షాలు పడకపోవడంతో వరి సాగు చేయడం కష్టంగా కన్పిస్తుంది. చాలామంది పొలాలు చేయడంతో పొలాలు బీడు భీములను తలపిస్తున్నాయి. కూలీలకు పనులు లేక ఉపాధి దొరకదు.

- సోమల చౌడారెడ్డి, రైతు

పసులకు నీరు లేదు..



వాగులు, వంకల్లో నీరులేక నిలువునా ఎండిపోయాయి. మెతకు వెళ్లిన పశువులకు తాగునీరు దొరకడం లేదు. తప్పనిసరి పరిస్థితిలో మధ్యాహ్నంకు తిరిగి ఇంటికి వచ్చి నీటిని తాపాల్సి వస్తుంది.

- సుబ్బారెడ్డి, రైతు

బహుళ నైపుణ్యంతో బోధన చేయాలి



ఆత్మకూరు: ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో రామారావు

● జిల్లా విద్యా శాఖ అధికారి పీవీజే రామారావు

ఆత్మకూరు, జూలై 23: జిల్లా విద్యాధికారి పీవీజే రామారావు స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం ఆత్మకూరు డివిజన్‌స్థాయి సపోర్టింగ్ ఆంద్రస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యక్రమంలో భాగంగా టీచ్ టూల్ 5వ రోజు శిక్షణా తరగతులను ఆయన పరిశీలించారు. ఆత్మకూరు గురుకుల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరం పదో తరగతి వందశాతం ఉత్తీర్ణత సాధించడంపై ప్రిన్సిపాల్ కామేశ్వరి, అధ్యాపకులను అభినందించారు. కార్యక్ర మంలో డిప్యూటీ డీఈవో గోపాల్, జిల్లా సమగ్ర శిక్ష విద్యా విషయక పర్యవే క్షణ అధికారి సుధీర్‌బాబు, ఎంఈవోలు జ్యోతి, చలపతి, మాస్టర్ ట్రైనీలు సురే ష్, నాగేశ్వరరావు, కేశవనారాయణ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గణితంపై మక్కువ పెంచాలి



సంగం: విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న డీఈవో రామారావు

విద్యార్థులు గణితంపై మక్కువ పెంచుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయురాలు అనంతలక్ష్మీ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు పునాది అభ్యసన కార్యక్రమంను నిర్వహించారు. గణితంతో విద్యార్థులకు మానసిక ఆనందంతో పాటు సృజనాత్మకత అలవడుతుందన్నారు. భాషలో కనీస అభ్యసనస్థాయిలను సాధించేలా విద్యార్థులను తయారు చేయాలన్నారు. **సంగం:** పడమటిపాళెం, పెరమన ప్రాథమిక పాఠశాలలను డీఈఓ రామారాము ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఆయన వెంట ఎంఈవో 2 మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఏఎస్ పేట: గుంపార్లపాడు హైస్కూల్‌ను డీఈఓ రామారావు పరిశీలించి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల ఆవర ణంలో మొక్కలు నాటారు. అనంతరం శిక్షసప్తాహ్ కార్యక్రమంలో జరు గుతున్న ఎఫ్ఎల్ఎన్ కృత్యాలను పరిశీలించారు. హెచ్ఎం పోతులూరయ్య, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్‌బాబు, ఎంఈవో సాయిప్రసాద్ ఉన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి

ఆత్మకూరు, జూలై 23: స్థానిక ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఆంధ్ర విద్యార్థుల సంఘం (ఏవీఎస్) ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌ల జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఏవీఎస్ నాయకులు, విద్యార్థులు ప్రిన్సిపాల్ కిషోర్‌రెడ్డితో కలిసి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల హెచ్‌వోడీలు దేవానంద్, దేమముని, సుదర్శన్, ఏవీఎస్ నియోజకవర్గ కన్వీనర్ మహంత్‌రెడ్డి, శ్రీరామ్, మనోజ్, బాలాజీ, త్రినాథ్ పాల్గొన్నారు.

ఓడీఎఫ్, జల్‌జీవన్ అంశాలపై ప్రత్యేక గ్రామసభ

సీతారామపురం,జూలై 23: స్థానిక గ్రామ పంచాయతీలోని బీట్-2 సచివాలయంలో మంగళవారం సర్పంచ్ భాగ్యకుమారి అధ్యక్షతన ఓడీఎఫ్, జల్‌జీవన్ అంశాలపై అధికారులు గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యకుమారి మాట్లాడారు. గ్రామంలోని ప్రతిఇంటి వద్ద వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండాలని, చర్యలు తీసుకుంటామన్నారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి నీటిని సరఫరా చేస్తామన్నారు.

వరికుంటపాడు: అన్నిగ్రామాల్లో పారిశుధ్య మెరుగుదలకు చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి తెలిపారు. మంగళవారం రామాపురం సచివాలయంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరెకొండ పెంచలమ్మ, కార్యదర్శి వెంకటకృష్ణయ్య, వెంకటరత్నం పాల్గొన్నారు.

చేజర్ల: మడపల్లి, నెర్నూరు, ఆదురుపల్లి గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ముఖ్యంగా తాగునీరు, శానిటేషన్‌పై చర్చించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మేత పోరంబోకు భూముల పరిశీలన

కలువాయి, జూలై 23: కేశమనేనిపల్లి రెవెన్యూ పరిధిలోని తిరుమలపాడు సమీపంలో ఉన్న 620ఎకరాల మేత పోరంబోకు భూములను మంగళవారం తహసీల్దారు సంజీవకుమారి పరిశీలించారు. తిరుమలపాడు గ్రామస్థులు ఈ భూములను రాత్రులు జేసీబీలతో చదును చేసుకుంటున్నారని సోమవారం కేశమనేనిపల్లి గ్రామస్థులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఈ భూముల్లో మా గ్రామానికి 3భాగాలు, తిరుమలపాడు గ్రామస్థులకు ఒక భాగం హక్కు ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దారు ఈ భూములను పరిశీలించారు. ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలు ఇచ్చేంత వరకు ఎవరూ భూములను చదును చేయకూడదని తెలిపారు. ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

ఉదయగిరి రూరల్, జూలై 23: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు ట్రాన్స్‌కో డీఈ జనార్దన్ విద్యుత్ సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు మండలాల సెక్షన్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఈ కోటేశ్వరరావు, మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులు

చేజర్ల, జూలై 23: నాగులవెల్లటూరు, తూర్పుపల్లి సచివాలయాలల్లో ఏర్పాట్లు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. ఈ నెల 27వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. తూర్పుపల్లిలో 12మంది, నాగులవెల్లటూరులో 22మంది అవకాశాన్ని వినియోగించుకున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

సీతారామపురం, జూలై 23: ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, పంచాయతీ కార్యదర్శి జీవన్‌కుమార్‌లు మంగళవారం స్థానిక పరమటివీధి, హరిజనవాడ ప్రాంతాలలో పారిశుద్ధంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మురుగుకాలువలలో పూడిక తిసి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

వింజమూరు: స్థానిక బంగ్లాసెంటర్‌లో ఎంపీడీవో రాజేష్‌బాబు, సర్పంచ్ నల్లగొండ సృజనలు సైడ్ కాలువను తీసి వర్షపు నీరు పోయేలా పూడికను తీసి వేయించారు.

అతిథి భోజనం అందాలి

ఉదయగిరి రూరల్, జూలై 23: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులకు దాతల సహకారంతో పుట్టిన, పెళ్లి రోజులు, ఇతర కార్యక్రమాల సమయాల్లో వారి పేర్ల మీద పండ్లు, మిఠాయిలు (అతిథి భోజనం) అందించేలా చర్యలు చేపట్టాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తెలిపారు. స్థానిక దళితవాడ పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయుడు సయ్యద్ కలీం విద్యార్థులకు పండ్లు అందజేశారు.

లక్ష్యాలను అధిగమించాలి

ఉదయగిరి రూరల్: వైద్యఆరోగ్య సిబ్బందికి కేటాయించాలని లక్ష్యాలను నూరుశాతం అధిగమించాలని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు శివకల్పన, వినీతలు తెలిపారు. మంగళవారం స్థానిక ఆరోగ్యకేంద్రంలో సిబ్బం దితో సెక్టార్ సమావేశం నిర్వహించారు. సీహెచ్‌వో శివకుమారి, వెంకటసుబ్బయ్య ఉన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

అనంతసాగరం, జూలై 23: చిలకలమర్రి వద్ద సాగు చేసిన వేరుశెనగ పంటను మంగళవారం మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసచక్రవర్తి పరిశీలించారు. ఈసీజన్‌లో వచ్చే తెగుళ్లు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ మల్లెంకొండయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లు వేస్తే చర్యలు

వింజమూరు, జూలై 23: పట్టణంలోని అక్రమ లేఅవుట్లు వేసినట్లయితే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి బంక శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పంచాయతీ పరిధిలో సర్వే నెంబరు 348/2ఏ లో విస్తీర్ణం 5.67 సెంట్లు హరితా లే అవుట్లు, దేవతా మాల్యాద్రి అనువారు అక్రమ లే అవుట్‌లో నెంబరు రాళ్లను తొలగించారు. అక్రమ లే అవుట్లకు నోటీసులు జారీ చేస్తామన్నారు.

దారి ఆక్రమణపై ఫిర్యాదు

ఏఎస్ పేట, జూలై 23: తెల్లపాడు పంచాయతీ రహదారిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా ఆక్రమించుకోడానికి ప్రయత్నిస్తున్నారని మంగళవారం తహశీల్దారు రవికుమార్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పంచాయతీ రహదారి అక్రమంగా ఆక్రమించుకోవడమే కాకుండా దానికి పట్టాను తయారు చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వైద్యుడ్ని కొనసాగించాలి

ఉదయగిరి రూరల్, జూలై 23: స్థానిక ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు షంషుద్దీన్‌ను బదిలీ చేయకుండా వైద్యశాలలోనే కొనసాగించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు వేణుగోపాల్, దస్తగిరిఅహ్మద్‌లు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే వైద్యశాలలో గైనకాలజిస్టు, జనరల్ మెడిషన్, సర్జన్, చిన్నపిల్లల వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వైద్యులందరినీ ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తే ఇక్కడి రోగుల పరిస్థితి ఏమిటని పేర్కొన్నారు.

నిధుల కేటాయింపుపై హర్షం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 23: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర రాజధాని అమరావతికి రూ.15వేల కోట్లు నిధులు కేటాయించడం హర్షణీయమని తెలుగుయువత మండలాధ్యక్షుడు పాముల మహేష్ మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమించే వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడని, ఆయన కృషి ఫలితంగానే కేంద్ర బడ్జెట్‌లో అమరావతితో పాటు పలు సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపు జరిగిందన్నారు.

పోలేరమ్మకు పులివాహనసేవ

సంగం, జూలై 23: తలుపూరుపాడు పోలేరమ్మ సోమవారం అర్ధరాత్రి పులి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సం సందర్భంగా భక్తులు కర్పూరహారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా షిర్డీ సాయిబాబా గ్రామోత్సవం

స్థానిక సాయినగర్‌లో సోమవారం అర్ధరాత్రి సాయిబాబా గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు హారతలతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత అలఘనాథస్వామి ఆలయంలో మంగళవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆర్యవైశ్యులు అలఘనాథుని కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఉదయగిరి రూరల్, జూలై 23: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు మంగళవారం తహసీల్దారు నెహ్రూబాబు, ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఎంఈవో-2 తోట శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఫణిరాజ్ సుబ్బారెడ్డి, మున్నా, రామకృష్ణ, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

సీతారామపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి గొడ్లవేటి వెంకటేశ్వర్లు, భోగ్యం శ్రీనివాసులు, పేరాల శ్రీనివాసులు, బాలకృష్ణారెడ్డి, లక్ష్మయ్య, ఆనంద్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కొండలా విద్యుత్ బకాయిలు !

● రూ.14 లక్షల బిల్లుల పెండింగ్

● 'రాళ్లపాడు' అతిథి గృహానికి కరెంట్ కట్



నిరుపయోగంగా ఉన్న రాళ్లపాడు అతిథి గృహం

రాళ్లపాడు ప్రాజెక్టు అతిథి గృహం విద్యుత్ బకాయిలు కొండలా పేరుకుపోయాయి. ఎంతకూ అధికారుల్లో చలనం లేకపోవడంతో విద్యుత్‌శాఖ అధికారులు సర్వీసును తొలగించారు. ఈ అతిథి గృహానికి రూ.14 లక్షల వరకు బకాయిలు ఉండటంతో ఏడాది క్రితమే కరెంట్ కనెక్షన్ కట్ చేశారు. దీంతో అతిథిగృహం వైపు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అతిథిగృహం నిరుపయోగంగా మారింది. గతంలో రాళ్లపాడు సందర్శనకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ అతిథి గృహంలో భోజనాలు చేసి కాసేపు సేద తీరేవారు. అధికారులతో సమావేశమూ అయ్యేవారు. అలాంటిది ఇప్పుడు బోసిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎంతో ప్రాముఖ్యమున్న ఈ అతిథి గృహానికి బకాయిలు చెల్లించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

- లింగసముద్రం

ప్రతి విద్యార్థిని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి : డీఎంహెచ్‌వో

లింగసముద్రం, జూలై 23 : ప్రతి విద్యార్థిని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య చెప్పారు.మండలంలోని పెద పవనిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను ఆయన మంగళవారం ఉదయం సందర్శించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్నేహలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. డాక్టర్ దివ్య ఫ్లోరోసిస్ గురించి అవగాహన కల్పించారు. అనంతరం డీఎంహెచ్‌వో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థినులకు పీహెచ్‌సీ సిబ్బంది హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనూరాధ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● **పీహెచ్‌సీ తనిఖీ**

లింగసముద్రంలోని పీహెచ్‌సీని కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రియంవద మంగళవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె పీహెచ్‌సీలోని రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం కాన్పుల గదిని, ల్యాబరేటరీని సందర్శించారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జీ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ కుమారి, స్టాఫ్ నర్సు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● **ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాల పంపిణీ**

కొండాపురం : మండలంలోని ఫ్లోరోసిస్ బాధితులకు డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య మంగళవారం పలు పరికరాలు అందచేశారు. ఫ్లోరోసిస్ బాధితులు 45 మందిని గుర్తించి వారికి అవసరమయిన వాకర్లు, లుంబర్ బెల్టు, లెట్రిన్ షీట్లు, చైర్స్, వాకింగ్ స్టిక్స్‌ను ఆయన ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించి, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి నసీరుద్దీన్, ఫ్లోరోసిస్ కన్సల్టెంటు డాక్టర్ దివ్య, సీహెచ్ చెంచురామయ్య, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.కాగా కొండాపురం మండలానికి 30 పడకల ఆసుపత్రిని కేటాయించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున డీఎంహెచ్‌వో పెంచలయ్యకు వినతిపత్రం అందచేశారు.ఆయన వెంట మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి చల్లా చినమాలకొండయ్య తదితరులు ఉన్నారు.



కొండాపురం : ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాలు అందచేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం : బీజేపీ

కందుకూరు, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయించటం పట్ల బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం బీజేపీ నేతలు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి కేంద్రప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు మాట్లాడారు. సమావేశంలో పార్టీ నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, చల్లా వెంకటరాజా, చుండి మురళీధర్, జగన్నాథం వైకుంఠం, నవులూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కావలి : కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు వరాలు జల్లు కురిపించటం హర్షణీయమని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జీ. భరత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి నిర్మాణానికి రూ. 15,000 కోట్లు కేటాంచటమే కాక, పోలవరం పూర్తికి నిధులు, వైజాగ్ -చెన్నై కోస్టల్ ఇండస్ట్రీయల్ కారిడార్‌కు నిధులు ఇస్తానని చెప్పటం సంతోషదాయమన్నారు.

కొండాపురం : కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యం ఇవ్వడంపై టీడీపీ మండల కన్వీనర్ ఓంకారం హర్షం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలు ఫలించాయన్నారు.

నెల్లూరు : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు మంజూరు చేయటం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తామని తెలపడం హర్షణీయమని జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు పేర్కొన్నారు.

బైకు ఢీకొని సైక్లిస్టు మృతి

వలేటివారిపాలెం, జూలై 23 : మోటారుబైకుపై అతి వేగంగా వస్తూ ఓ వ్యక్తి సైక్లిస్టును ఢీకొనడంతో సైక్లిస్టు మృతి చెందాడు.ఈ సంఘటన మండలంలోని చుండి ఎంపీయూపీ స్కూల్ ఎదురుగా సోమవారం రాత్రి జరిగింది. ఈ సంఘటనలో పోలినేనిచెరువుకి చెందిన కర్నేటి మాల్యాద్రి (39) మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ బాలమహేంద్రనాయక్ కథనం మేరకు మాల్యాద్రి చుండికి వెళ్లి పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, చుండి గ్రామానికి చెందిన చెరువుపల్లి లక్ష్మయ్య మోటారుబైకుపై అతివేగంగా వస్తూ మాల్యాద్రిని ఢీకొన్నాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి తల్లి ఆదెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్మశానంలో చోరీ

లింగసముద్రం, జూలై 23 : మండలంలోని చినపవని గ్రామ శ్మశాన వాటికలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన ఇనకొల్లు సతీష్ తన తండ్రికి సమాధి కట్టిస్తున్నారు. రోజూలాగే సోమవారం రాత్రి కూడా సతీష్ సమాధి వద్ద నాలుగేసి చొప్పున బిందెలు, నీళ్ల డ్రమ్ములు, బకెట్లు, కొన్ని ఇనుప చువ్వలు, బేల్దారి సామగ్రిని ఉంచి ఇంటికి వెళ్లారు.అదేరోజూ రాత్రి దొంగలు వాటిని తీసుకెళ్లారని సతీష్ చెప్పారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

ఎంఈవో పాఠశాలల తనిఖీ

కావలి, జూలై23: పట్టణంలోని రెండు పాఠశాలలను ఎంఈవో గోవిందయ్య మంగళవారం తనిఖీ చేశారు. గుర్రంవారివీధిలో ఉన్న ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం స్కూల్ బ్యాగులను విద్యార్థులకు పంపిణీ చేశారు. అలాగే పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. వంటగదిలో పరిశుభ్రతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల రక్షణలో ప్రభుత్వాలు విఫలం

కావలి,జూలై23: సమాజంలోని మహిళల మాన, ప్రాణాలకు రక్షణ కల్పించటంతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విఫలమవుతున్నాయని మహిళా సంఘాల నాయకులు ఆరోపించారు. జర్నలిస్ట్ క్లబ్‌లో మంగళవారం ఉమెన్ ఫోర్స్ పట్టణ కన్వీనర్ చాకలికొండ శారద, జమాయితే ఇస్లామీ ఇ హింద్ కార్యదర్శి ఫాతిమా విలేకరులతో మాట్లాడారు. పసికందు నుంచి ముదుసలి వరకు అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవటంలేదన్నారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలు చూస్తే ఆడపిల్లలు పుట్టడమే నేరమా ? అనే ఆలోచనలు కలుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో ఉమెన్‌ఫోర్స్, జమాయితే ఇస్లామీ ఇ హింద్ సభ్యులు టీ. లక్ష్మీ, నూర్జహాన్, సఖి, సుమయ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కావలి : జనవిజ్ఞానవేదిక పట్టణశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నలందా టాలెంట్‌స్కూల్ ఆవరణలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. జేవీవీ కోశాధికారి సుబ్బరాయశర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్యుల నిపుణుడు శ్రీరాం మనోహర్‌బాబు, ఈఎన్‌టీ నిపుణులు విజయభాస్కర్, జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు కందికట్లు నారాయణ, పాఠశాల డైరెక్టర్ వశీం, ప్రిన్సిపాల్ మెహతాజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతలపాటికి సీపీఎం నేతల పరామర్శ

గుడ్లూరు : మండలంలోని చేవూరుకు చెందిన సీపీఎం సీనియర్ నాయకులు నూతలపాటి నరసింహంను మంగళవారం నెల్లూరు, ప్రకాశం జిల్లాల సీపీఎం నాయకులు పరామర్శించారు ఆయన కొంతకాలం నుంచి తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. స్వగ్రామానికి వచ్చిన ఆయన్ను పార్టీ నాయకులు జాలా అంజయ్య, ఎం కోటయ్య, జీ శ్రీనివాసులు, కుమార్, ఈ బ్రహ్మయ్య, పీ కొండమ్మ పరామర్శించారు.

సాగు, తాగునీటి సమస్యలు తీర్చాలని సీఎంకు వినతి



సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జూలై 23: నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లను కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం వారిద్దరినీ ప్రత్యేకంగా కలిసిన ఆయన నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. వెలుగొండ ప్రాజెక్టు తూర్పు ప్రధాన కాలువ నుంచి ప్రత్యేక కెనాల్ ద్వారా నియోజకవర్గంలోని లింగసముద్రం, వలేటివారిపాలెం, కందుకూరు మండలాలకు నీరందించేందుకు ఉన్న అవకాశాన్ని మ్యాప్ ద్వారా లోకేష్‌కు వివరించారు. ఈ సమస్యను పరిశీలిస్తామని వారు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపేలా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

మంత్రి దృష్టికి రోడ్ల దుస్థితి

కావలి, జూలై23: నియోజకవర్గంలోని రోడ్ల దుస్థితిని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆర్అండ్‌బీశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అమరావతిలో మంగళవారం కావలి మత్స్యకార నాయకులతో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసారు. స్పందించిన మంత్రి కావలి అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే వెంట కావలి రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, రాష్ట్రమత్స్యకారసాధికారసమితి సభ్యులు సోమయ్యగారి రమణ, కుర్రు కొండయ్య, ప్రార్థనరావు, శ్రీనుబాబు తదితరులు ఉన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

అల్లూరు, జూలై 23 : గ్రామ సచివాలయాల్లో నిర్వహించే ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జ్యోతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రతీ సచివాలయంలో ఈనెల 28 వరకు నిర్వహించే ఆధార్ కేంద్రాలను అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు దుర్గేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనరు ఫణికుమార్ పాల్గొన్నారు.

● **గ్రామాల అభివృద్ధికి ప్రోత్సాహం**

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఎంపీడీవో జ్యోతి తెలిపారు. అల్లూరు మండలం తూర్పు గోగులపల్లి, పడమర గోగులపల్లి, గ్రద్దగుంట గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గ్రామ సభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, సర్పంచులు, కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

కావలి,జూలై23: పట్టణంలో నాలుగో విడత జనసేన సభ్యత్వ నమోదు జోరుగా సాగుతున్నదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్య తెలిపారు. జర్నలిస్ట్‌క్లబ్‌లో మంగళవారం ఆయనతోపాటు పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు ఆలా శ్రీనాథ్ విలేకరులతో మాట్లాడారు. జనసేన సభ్యత్వం పొందటం వల్ల బీమా సౌకర్యంతోపాటు స్థానిక సంస్థల్లో పోటీచేయటానికి, నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులు పొందేవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. సమావేశంలో జనసేన నేతలు పాలడుగు వెంకటేశ్వర్లు, గుంటుపల్లి క్రిష్ణయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జాషువాకు ఘననివాళి

కందుకూరు, జూలై 23: విశ్వకవి గుర్రం జాషువా 73వ వర్ధంతి సందర్భంగా జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక బుద్ధ అంబేడ్కర్ విజ్ఞానకేంద్రంలో సంస్థ ప్రతినిధులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎం. కిషోర్, జీ. హరిప్రసాదు, ఆర్.అయ్యన్న, కే. బ్రహ్మయ్య మాట్లాడుతూ కులమతాలపై రాజీలేని పోరాటం సాగించిన కవిగా తనను తాను విశ్వనరుడిగా ప్రకటించుకున్న సాహితీ ధ్రువతార గుర్రం జాషువా అని నివాళులర్పించారు.

అనధికార బ్యారన్ల నిర్మాణం చట్టరీత్యా నేరం

కందుకూరు, జూలై 23: అనధికార బ్యారన్లు నిర్మించడం చట్టరీత్యా నేరమని పొగాకు బోర్డు ఆర్ఎం ఎం. లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం ఆయన కందుకూరు 2 వేలం కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బోర్డు అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి ప్రస్తుతం ఉన్న మార్కెట్‌ను చూసి కొందరురైతులు అనధికార బ్యారన్లు నిర్మిస్తున్నట్లు సమాచారం ఉందని, అలాంటి రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. అనంతరం బోర్డు పరిధిలోని శాఖవరం, పోకూరు, వీఆర్ కోట తదితర గ్రామాలను సందర్శించి జనుము పైరును పరిశీలించారు.ఆయన వెంట వేలం నిర్వహణాధికారి కే రాజగోపాలరెడ్డి, తాటికొండ రమణయ్య తదితర రైతు ప్రతినిధులు ఉన్నారు.

అన్న క్యాంటీన్ మరమ్మతుల పరిశీలన

కావలి : స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జరుగుతున్న అన్న క్యాంటీన్‌ను మరమ్మతులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరామ్ పరిశీలించారు. ఆగస్టులో రాష్ట్ర వ్యాప్తంగా వీటిని ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. దీంతో మరమ్మతుల పనులు చేపట్టారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు.అలాగే పట్టణంలోని కొత్త శివాలయం, వెంగాయగారిపాలెంలో జరుగుతున్న కాలువల పూడికతీత పనులను మున్సిపల్ డీఈ సాయికుమార్‌తో కలిసి కమిషనర్ పరిశీలించారు.ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు మార్జిన్ పనులను కూడా పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.